# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

**ఆగస్టు - 2015**

సంపుటి- 41 సంచిక : 08



## సంపాదక వర్గం

కె.జోజయ్య, ప్రధాన సంపాదకులు
పి.బాబురెడ్డి
ఐ.వెంకటేశ్వరరావు
సిహెచ్.సుభాష్‌చంద్రబోస్
ఎన్.కుమార్ రాజా
టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు
సిహెచ్.శ్రీహరి


ఈ సంచికలో...


| | |
|---|---|
| జాతీయం అంతర్జాతీయం | -04 |
| నూతన విద్యావిధానం చర్చాపత్రం | - 05 |
| యుటియఫ్, ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావం... | -07 |
| విద్యావికాస ఉద్యమం | -08 |
| ప్రాథమిక విద్యలో ... | -09 |
| స్వతంత్ర భారతం ... | -11 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -13 |
| మున్సిపల్ పాఠశాలల్లో సంస్కరణలు.. | -16 |
| ది ఎకనమిస్ట్ (కథ) | -17 |
| సదస్సులు - సమావేశాలు | -19 |
| ప్రశ్నోత్తరాలు | -23 |
| సమస్యలపై ప్రాతినిధ్యాలు ... | -24 |
| మున్సిపల్ ఉపాధ్యాయుల... | -27 |
| ధర్నాలు - నిరసనలు | -30 |
| అభినందన సభలు | -31 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | -32 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ 1000-00 |
| 5 సం॥ చందా | : | ₹ 550-00 |
| సం॥ చందా | : | ₹ 120-00 |
| విడిప్రతి | : | ₹ 10-00 |

SBI Online
A/c No. 30206957939



**ఐక్య ఉపాధ్యాయ**

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2573763
Website : www.aputf.org.
E-mail:ikyopadhyaya1975@gmail.com


# ఎంత మంచి శిష్యుడో - అంతమంచి గురువు

ప్రజల మన్ననలు పొందిన రాష్ట్రపతులు, శాస్త్రవేత్తలు మన దేశంలో ఎందరో ఉన్నారు.

కానీ దేశవ్యాపితంగా లక్షలాదిమంది విద్యార్థుల మనసుల్ని కలాంలా చూరగొన్నవారు మరొకరు లేరు. ఆయన మరణవార్త విద్యార్థుల్ని కలచివేసింది. ఒక పెద్దని కోల్పోయామని బాధపడింది యువత. ఏమిటీ ఆయన ప్రత్యేకత! ఎలా వచ్చిందీ ఆదరణ!!

గురువుకు వన్నె తెచ్చేది విద్యార్థుల మనస్సుల్లో స్థానంతప్ప అవార్డులు, డాక్టరేట్‌లు కావని కలాం ఋజువు చేశారు. ఆయన నిజాయితీ, నిరాడంబరత, మానవతావాదం ఆయన్ని నవభారత గురువు స్థానంలో నిలిపాయి.

కలాం ఎంత ఉన్నత స్థాయికి చేరినప్పటికీ ఆయన నివాసం రెండు గదులే. ఒకటి నివాసానికి, రెండవది పుస్తకాలకు. రాష్ట్రపతి భవన్‌లో ప్రవేశించేటప్పుడు, వీడ్కోలు చెప్పినప్పుడు రెండే సూట్‌కేసుల లగేజీతో ఉన్నారు. జీవితంలో ఎంత ఉన్నత స్థానాలు అధిరోహించినా తనకంటూ ఏమీ సంపాదించుకోకుండా నిజాయితీగా నిలవడమే ఆయన ప్రత్యేకత.

కలాం ప్రతి నినాదం, ప్రతి ప్రసంగం, ప్రతి పాఠం, ప్రతి రచన, ఆయన ఉదాత్తమైన వ్యక్తిత్వం అచంచల కార్యదీక్ష, అసమాన నిబద్ధత వంటి లక్షణాలు యువతను, విద్యార్థుల్ని ఆయనకు అభిమానులుగా మార్చాయి.

రాష్ట్రపతిగా ఉన్నప్పుడుగాని, ఆ తర్వాత గాని ఎక్కడకు వెళ్ళినా చిన్నారులే స్వాగతం పలికేవారు. ఆయన వారిలో ఒకరిగా కలిసిపోయేవారు.

మంచి గురువుగా మారేముందు మంచి శిష్యుడిగా ఉంటూ గురువులు ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో గ్రహించాడు. అదే ఆచరించాడు.

మతమంటే తెలియని ప్రాణమిత్రులు కలాం, రామనాధాలు. వారి స్నేహాన్ని విడదీసేందుకు ప్రయత్నించిన మత పిచ్చి మాస్టార్ని చూసి గురువు ఎలా ఉండకూడదో పసితనంలోనే నేర్చుకున్నాడు. తిరుచునాపల్లి సెయింట్ జోసఫ్ కళాశాలలో చదువుతున్నప్పుడు మరో గురువు కలాంను ఇంటికి తీసుకెళ్ళి స్వయంగా భోజనం వడ్డించిన గురు ప్రేమను చవిచూశారు. గురువు ఎలా ఉండాలో తెలుసుకున్నాడు.

ఆయన జీవితంలో నేర్చుకున్న ఎన్నో విలువైన పాఠాలు క్రోడీకరించి కొత్త తరాలకు చెప్పేందుకు గురువుగా మారారు. ఎన్నో పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో సైన్సును జీవితానుభవాలను మిళితం చేసి విద్యార్థులకు క్రొత్త బోధనలు చేశారు.

"నలుపు అశుభానికి సంకేతం" అంటుంటారు. "తరగతి గదిలో బ్లాక్ బోర్డు నల్లగా ఉంటుంది కానీ విద్యార్థుల జీవితాలు ప్రకాశించడానికి అదే కారణం" అంటూ సైన్సును పిట్ట కథల్లో చెప్పి చిన్నారుల్లో మూఢనమ్మకాలు పారద్రోలే ప్రయత్నం చేశారు.

గొప్ప మెదళ్ళు చాలావరకు వెనక బెంచీల్లో నే తయారవుతాయంటూ వెనకబడిన విద్యార్థులను ప్రోత్సహించేవారు.

చిన్నారుల ప్రశ్నలకు సరదాగా జవాబిస్తూ, వారి గొప్ప కలలకు గౌరవాన్నిస్తూ, వారి ఆలోచనా పరిధులను విస్తరిస్తూ విజ్ఞాన భారతావనికి విద్యార్థి సైన్యాన్ని తయారుచేశారు.

చిన్నారులతో మాట్లాడితే చాలా విషయాలు తెలుసుకోవచ్చని, వారిలా గొప్ప కలలు కనడం నేర్చుకోవచ్చని, వీలు దొరికినప్పుడల్లా చిన్నారులతో కలిసి పరవశించిపోయేవారు. రాష్ట్రపతిగా ఉన్నా ప్రతి వారం 300-400 మంది విద్యార్థులతో సమావేశమై చర్చించే వారు.

చిన్నారులతో చేసిన చర్చలు, తరగతులు వృధాపోవు. విద్యార్థుల కోసం చేసిన రచనలు, ఆ ప్రసంగాలు వట్టిపోవు. అవి నవజాతికి ప్రేరణ అవుతాయి. వారి హృదయాల్ని గొప్ప లక్ష్యాలతో ప్రజ్వలింపచేస్తాయని, నూతన సమాజ ఆవిష్కరణ చేస్తాయని గుర్తించారు. అందుకే అన్ని సమస్యలకు మూలం పేదరికం అని కలాంతో తన వేదనను పంచుకున్న స్నేహల్ థక్కర్ అను విద్యార్థినికి తాను రచించిన "ఇగ్నైటెడ్ మైండ్స్"ను అంకితమిచ్చారు.

కలాం తాను గొప్ప శాస్త్రవేత్త అయినా, రాష్ట్ర పతి అయినా, ప్రపంచ దేశాలు గుర్తించిన మేధావి అయినా పిల్లలే ఆయనకు అభిమానులు, 2003, 2005లో యూత్ ఐకాన్‌గా యావత్‌భారత దేశం ఎన్నుకోబడిన గొప్ప వ్యక్తి. ఆయన పుట్టిన రోజు అక్టోబర్ 15ను ప్రపంచ విద్యార్థి దినంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించడం హర్షణీయం.

విద్యార్థుల్లో స్ఫూర్తిని కల్గించగలిగిన వాడే నిజమైన గురువు. అందుకు నిలువెత్తు రూపం కలాం. నెహ్రూ తర్వాత పిల్లలకు అతి చేరువైన ఏకైక వ్యక్తి. చివరి క్షణంలో కూడ షిల్లాంగ్ ఐఐఎంలో విద్యార్థుల కోసం "లివబుల్ ప్లానెట్ ఎర్త్" అనే అంశంపై సెమినార్‌లో ప్రసంగిస్తూ తుదిశ్వాస విడిచారు. చివరి క్షణం వరకు మేథో భారత్ జాతి నిర్మాణానికి అంకితమైన కలాం తన పని విధానంతో, ఉత్తమ ఆచరణ ద్వారా యువభారత్‌కు మార్గనిర్దేశకుడు అయ్యారు.

**భవిష్యత్ భారతదేశ నిర్మాణానికి ఉత్తమ పౌరులను తయారు చేసే ఉపాధ్యాయులకు కలాం ఆదర్శం కావాలి. అదే స్ఫూర్తితో పని చేయాలి. అదే కలాంకి నేటి ఉపాధ్యాయులంగా మనం ఇచ్చే నివాళి!**

# జాతీయం అంతర్జాతీయం

## విద్యార్థుల సంఖ్యను బట్టి జీతాలు

2016లో ఇవ్వాల్సిన పిఆర్‌సిలో టీచర్ల జీతాల్లో అసమానతలు తొలగించాలని యూరప్‌లోని లాత్వియా దేశ ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. 2009 సెప్టెంబర్ 1 నుండి లాత్వియాలో టీచర్ల జీతాలు స్కూల్‌కు కేటాయించే ఫండ్ స్కూల్ ఆధారంతో నిర్ణయించే పద్ధతి అమలులో వుంది. ఒక మున్సిపాలిటీ లేదా లోకల్ బాడీలో ఉన్న మొత్తం విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆ దేశ మంత్రిత్వ శాఖ టీచర్ల జీతాల బడ్జెట్ కేటాయిస్తుంది. మున్సిపాలిటీలు ఆ మొత్తాన్ని ఆయా స్కూళ్ళకు పిల్లల సంఖ్య ఆధారంగా కేటాయిస్తాయి. దీంతో ఎక్కువమంది పిల్లలుండే స్కూల్ టీచర్లకు ఎక్కువ జీతాలు, తక్కువ పిల్లలు ఉండే టీచర్లకు తక్కువ జీతాలు వస్తాయి. ఎక్కువమంది పిల్లల్ని సమీకరించుకోవడానికి స్కూళ్ళు తమలో తాము పోటీపడుతుంటాయి. ఇది కొన్ని స్కూళ్ళు లెక్కకుమించి విద్యార్థులు ఉండడానికి తద్వారా టీచర్ల పనిభారం పెరగడానికి, అంతిమంగా బోధనలో నాణ్యత లోపించడానికి, మరోవైపు చిన్న స్కూళ్ళు మూసివేతకు అందులోని టీచర్ల ఉద్యోగాలు ఊడడానికి దారితీస్తున్నది.

## గ్రీస్ టీచర్లకు సంఘీభావం

గ్రీస్‌లో టీచర్లకు, విద్యార్థులకు యూరోపియన్ యూనియన్ దేశాల ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. గ్రీస్ సంక్షోభ ఫలితంగా విద్యా కేటాయింపుల తగ్గింపుతో వేలాదిమంది టీచర్లు, లక్షలాది విద్యార్థులు తీవ్ర పరిణామాలకు గురయ్యారు. బ్యాంకుల మూసివేతతో పిల్లల చదువులకు ఆటంకం కలిగింది. ఇతర దేశాల్లో చదువుతున్న పిల్లలకు ఏంచేయాలో తెలియని స్థితి. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు పతనావస్థకు చేరుకొంటున్నాయి.

## ఉద్యోగాలు కోల్పోతున్న పోర్చుగల్ టీచర్లు

గ్రీస్‌లోలాగా నయా ఉదారవాద విధానం అమలుతో పోర్చుగల్ తీవ్ర ఆర్థిక యిబ్బందులు ఎదుర్కొంటోంది. గత నాలుగు సంవత్సరాల లో విద్యా కేటాయింపులు 3.2 బిలియన్ యూరోలు తగ్గించడంతో 20% టీచర్లు ఉద్యోగాలు కోల్పోయారు. మిగిలిన వాళ్ళు దుర్భర పని పరిస్థితుల్లో వున్నారు. టీచర్ ట్రైనింగ్ కూడా నిర్లక్ష్యానికి గురికాబడ్డది. దీనికి నిరసనగా వేలాదిమంది విద్యావేత్తలు, పరిశోధకులు లిస్బన్‌లో పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయుల పట్ల, స్కూళ్ళ పట్ల నిర్లక్ష్యం విద్యా నాణ్యతను దెబ్బతీస్తుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

## బొకోహారం దాడిలో 28మంది టీచర్లు మృతి

నైజీరియాలో 28మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బొకోహారం ఉగ్రవాదులు అమర్చిన బాంబు ప్రేలుడులో మరణించారు. 23మంది తీవ్రగాయాలతో చికిత్సపొందుచున్నారు. ఈ సంఘటన జులై 7న జరిగింది. నైజీరియా ఉపాధ్యాయ సంఘ ప్రధానకార్యదర్శి ఒభాంగ్ మాట్లాడుతూ ఇటువంటి దాడులవల్ల ఒక్క బోర్నో రాష్ట్రంలోనే 272మంది టీచర్లు చనిపోయారని, 19000మంది వృత్తివదిలి వెళ్ళిపోయారని తెలిపారు. టీచర్ల, విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2015 మే నెలలో నైజీరియా కొత్త అధ్యక్షుడుగా బుహారి ఎన్నికైన తరువాత ఉత్తరప్రాంతంలో బొకోహారం దాడులు మరింతగా పెరిగాయి. మసీదులు, చర్చిలు, ప్రశాంత గ్రామాలపై వీరి దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

## పాఠ్యపుస్తకాల్లో మహాత్ముడుగా ఆశారాం బాపు

మైనర్ బాలిక అత్యాచారం కేసులో నిందితుడు ఆశారాం బాపు మహాత్ముడుగా బిజెపి పాలిత రాజస్థాన్ 3వ తరగతి పాఠ్య పుస్తకంలోని పాఠంలో పొందుపర్చబడింది. ఈ పాఠంలో వివేకానంద, మదర్ థెరిస్సా, రామకృష్ణ పరమహంస, గురునానక్, కబీర్, మీరాబాయి, శంకరాచార్యుల సరసన ఆశారాం ఫోటోవుంది. 2013 ఆగస్టు నుండి 16 యేళ్ళ బాలిక అత్యాచారం కేసులో నిందితుడుగా జైల్లోవున్న ఆశారాం ''మహాత్ముడు''గా నేటికి పాఠ్యపుస్తకాల్లో కొనసాగడం ఏమనాలి? అధికారుల్ని అడిగితే ''మాకు తెలియదన్నట్లు'' వ్యవహరిస్తారు. పబ్లిషర్స్‌ను అడిగితే "ఆ పుస్తకం ముద్రించే నాటికి ఆయన మీద కేసులేదు. ఇప్పుడు పుస్తకాల్ని వెనక్కి తెప్పించుకొంటాం" అంటారు. వ్యూహాత్మకంగానే చేస్తున్న రాజకీయ పెద్దలు మౌనంగా వుంటున్నారు. వెర్రితలలు వేస్తున్న విద్య కాషాయీకరణలో భాగంగానే రాజస్థాన్‌తోపాటు అనేక రాష్ట్రాల్లో నేడు జరుగుతోంది.

## కిల్లర్ స్కామ్ - వ్యాపం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న మధ్యప్రదేశ్ వ్యాపం కుంభ కోణం 2013 జులై నుండి వెలుగులోకి వచ్చింది. ఈ స్కామ్‌లో నిందితులుగా 24మంది అసహజ మరణం చెందారు. దీంతో సంబంధమున్న 22మంది అనుమానాస్పద పరిస్థితుల్లో చనిపోయారు. మొత్తంగా ఈ సంఖ్య 46కు చేరింది. తరచూ వస్తున్న మరణవార్తలు ఈ సంఖ్య 146 అయినా ఆశ్చర్యం లేదని జనంలో ప్రచారం జరుగుతోంది. పరీక్షల్లో కాపీయింగ్, ఒకరి పరీక్ష వేరొకరు రాయడం, ఖాళీ జవాబు పత్రాలకు అత్యధిక మార్కులు రావడం వంటి వ్యాపం స్కామ్‌లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ఈ రాకెట్‌లో గవర్నరు ఇంటినుండి సాధారణ ఉద్యోగి వరకూ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. 1800మందిని ఇప్పటికి అరెస్టుచేసి ఉన్నారు. గవర్నరు కుమారుడు ఇందులో దోషిగా అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మాజీ విద్యామంత్రి ఈ కేసులో జైలులో వున్నాడు. పాలకవర్గాలు విద్యా వ్యవస్థను ఎంత భ్రష్టుపట్టిస్తున్నారనడానికి ఇదొక నిదర్శనం.

## పిల్లలు, మహిళలపై నేషనల్ సర్వే

తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్ మరియు త్రిపుర రాష్ట్రాలు మాత్రమే ఎదుగుతున్న బాలికల బరువు తక్కువను నివారించ గలిగాయని దేశవ్యాప్తంగా యునిసెఫ్‌తో లక్ష కుటుంబాలపై జరిగిన రాపిడ్ సర్వే ఆన్ చిల్డ్రన్ (ఆర్ఎస్ఓసి) తెలిపింది. ఆర్థికంగా వృద్ధి రేటు గొప్పగావున్న గత దశాబ్ద కాలంలో కొన్ని రాష్ట్రాలు మాత్రమే పిల్లల పౌష్టికాహారం మీద చెప్పుకోదగ్గ ప్రగతి సాధించాయని, మరి కొన్ని కాస్త మాత్రమే మెరుగయ్యాయని తెలిపింది. పిల్లల బరువు తక్కువ, ఎదుగుదల లేని విషయంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో గుజరాత్ (33%) బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని జాతీయ సగటుకంటే (29%) ఎక్కువని తెలిపింది.

ఎదుగుదల లేని పిల్లలు ఎక్కువగా వున్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. కేరళ ఇప్పటికీ పిల్లల విషయంలో మంచి ప్రగతి సాధిస్తోంది. అలాగే మణిపూర్, మిజోరం కూడా. ఢిల్లీతోపాటు మధ్యప్రదేశ్, బీహార్, హిమాచలప్రదేశ్‌లో ఈ దశాబ్దకాలంలో పౌష్టికాహారం అందించడం చెప్పుకోదగ్గ ప్రగతి సాధించాయి. ఎదిగే ఆడపిల్లల పౌష్టికాహార విషయంలో దాదాపుగా అన్ని రాష్ట్రాలు చెప్పుకోదగ్గ ప్రగతి సాధించ లేదని సర్వే విశ్లేషించింది.

## మనసులో ఒకటి - మాటల్లో ఒకటి

# నూతన విద్యా విధాన చర్చాపత్రం




కేంద్ర ప్రభుత్వం షరా మామూలుగా **'నూతన విద్యా విధానం'**పై ఓ చర్చాపత్రాన్ని ప్రశ్నావళిని రూపొందించి అభిప్రాయ సేకరణ కోసం వెబ్‌సైట్‌లో పెట్టింది. పలు వర్గాల చర్చల ఆధారంగా డిసెంబరు నాటికి దీన్ని ఓ కొలిక్కి తెస్తానంటోంది. ఇప్పటికే ఈ కసరత్తును మన రాష్ట్రంలోనూ జరిగింది.

విద్యారంగం నిరంతరం మారాల్సిన రంగం. మారుతున్న సామాజికార్థిక పరిస్థితుల కనుగుణంగా, అంతర్జాతీయ పరిణామాల కనుగుణంగా విద్యను మార్చడంలో, ఆధునీకరించడంలో తప్పేమీ లేదు. చిత్తశుద్ధితో, దార్శనికతతో చేస్తే అందరం దీన్ని ఆహ్వానిస్తాము.

కాని కేంద్రానికి ఆ లక్షణాలేమీ వున్నట్లు లేదు.



**వి.బాలసుబ్రహ్మణ్యం,** ఎమ్మెల్సీ

మొదటిది చర్చకు పెట్టిన అంశాల్లోని డొల్లతనం, పేలవత్వం. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకొనేపుడు ప్రస్తుత స్థితిని వాస్తవిక దృష్టితో విశ్లేషించుకోవాలి. గత లక్ష్యాలు ఏమేరకు సాధించామో, ఏమి సాధించలేక పోయామో, ఎందుకు సాధించలేక పోయామో ఆత్మవిమర్శ చేసుకోవాలి. దీనికోసం నిష్పక్షపాతంగా ఒక రిపోర్టును రూపొందించి సమీక్షించాలి. ఈ పని ప్రభుత్వం చెయ్యలేదు. అందువల్ల ఎక్కడినుంచి మనం ప్రారంభిస్తున్నామో తెలియకుండా దాచిపెట్టినట్లయింది.

నీపా (NUEPA) 2014 ఆగష్టు నాటి సమాచారం ప్రాతిపదికన "Education For All, towards Quality and Equity" పేరుతో ఒక నివేదికను 2015లో ప్రచురించింది. కనీసం దీన్ని ప్రాతిపదికగా తీసుకొన్నా కొంత అర్థం వుండేది. దీని ప్రకారం బాల్యారంభ విద్య పొందే పిల్లలు 2001-2002 నుండి 2012-2013 మధ్య కాలంలో 1.67 కోట్ల నుండి 3.53 కోట్లకు పెరిగారు. ఇది సముద్రంలో నీటిబొట్టు! ఇక అంగన్‌వాడీల్లో ఇస్తున్న విద్య ఎంత అందమైందో చెప్పాల్సిన అవసరం లేదు. ప్రాథమిక విద్యను దాటి ప్రాథమికోన్నత విద్యకు చేరుతున్న వారు కేవలం 64.2 శాతం. సెకండరీ విద్యకు చేరేవారు 41.9 శాతం, వెనకబడిన రాష్ట్రాల్లో పిల్లల హాజరు శాతం 70కి మించడం లేదు. ఇక బడిలో వున్నవారి అభ్యసన ప్రమాణాలు మరీ ఘోరం. భాషాభ్యసనంలో 56.06 శాతం, గణితంలో 53.23 శాతం, పరిసరాల విజ్ఞానంలో 53.39 శాతం మించి గట్టెక్క లేకపోతున్నారు. మళ్ళీ వీరిలో మూడవ వంతుమందికి 40 శాతం కూడా మార్కులు రావడం లేదు. ఈ 11 ఏళ్ళలో టీచర్ల హాజరు ఏమీ పెరగలేదని, అసలు దీన్ని ఎలా పరిష్కరించాలో బోధపడ్డం లేదని ఈ నివేదికే పేర్కొంది. ఇక ఉపాధ్యాయుల ప్రమాణాలు సరేసరి. రాష్ట్రాల మధ్య, రాష్ట్రాల్లోని జిల్లాల మధ్య, జిల్లాల్లోని బ్లాకుల మధ్య, బ్లాకుల్లోని గ్రామాల మధ్య పొంతన లేనంత అసమానతలున్న దేశం మనది. పట్టుమని 30 శాతం అక్షరాస్యత వున్న గిరిజన ప్రాంతాల్ని వేళ్ళ మీద లెక్కించవచ్చు.

ఇలా చెప్పుకుపోతే చేంతాడంత. ఈ నేపథ్యాన్ని చూపించి, కొన్ని రాష్ట్రాలు సాధిం చిన గొప్ప విజయాల్ని కూడా ప్రస్తావించి గదా, కొత్త విద్యావిధానం ఎలా వుండాలో మాట్లాడు కోవల్సింది! ఇంతమాత్రం తెలియదంటారా ఈ విధాన పత్రరచనా పండితులకు.

రెండోది లక్ష్యాల గురించి. పాతికేళ్ళ ముందు జూమిటియన్‌లో చేసిన అంతర్జాతీయ డిక్లరేషన్ మన ముందు వుంది. అలాగే దాకార్‌లో (2000) ప్రపంచ విద్యా వేదిక చేసిన పునరుద్ఘాటన వుంది. 2002లో National Plan of Education వచ్చింది. 2005లో మనం విద్యాహక్కు చట్టం చేశాం. వాటన్నింటిలో మనం చెప్పుకొన్నదేమిటి? పిల్లలందరూ 4-5 ఏళ్ళ వయస్సులోనే విద్యాభ్యాసం ప్రారంభించాలి. కుల, మత, లింగ, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ నాణ్యమైన ప్రాథమిక విద్య నందించాలి. యువతకు కూడా విద్య దక్కాలి. వీటిలో మనం ఎంత దూరం రాగలిగామో NUEPA సమీక్షలో వుండనే వుంది. మరిప్పుడు మనం కొత్తగా పెట్టుకొంటున్న లక్ష్యాలేమిటి? ఈ విధాన పత్రం వీటిని ఏమి ప్రస్తావించదు. వైఫల్యాల నేపథ్యంలో ఎలాంటి లక్ష్యాల్ని నిర్దేశించుకోవల్సి వచ్చిందో వివరించదు.

ప్రస్తుత స్థితిపై సమీక్షా, లక్ష్యమూ లేనపుడు దానికి తగ్గ ప్రణాళికా వుండదు. నూతన విద్యావిధాన పత్రం ఇందువల్లనే అనేక అంశాల పట్ల మౌనం వహిస్తుంది, దాటవేస్తుంది, డొంకతిరుగుడు ప్రశ్నలతో సరిపెడుతుంది. తాను ఏం చేయదల్చుకొన్నదో చెప్పకుండా జనం మీద వదిలిపెడుతుంది. ఈ పత్రంలోని విచిత్రమో, వికారమో ఇది.

జాతీయోద్యమం నుంచి విద్యారంగం మీదా, దాని విలువల మీద పెద్ద చర్చ జరుగుతున్న దేశం మనది. పాఠశాల విద్య గావచ్చు, ఉన్నత విద్య గావచ్చు అవేమీ వ్యక్తిగత అభివృద్ధికి పరిమితమైనవి గావు. చదువే ఒక విలువ. దానికి Instrumental value ఎంత వుందో, Intrensic value అంతకంటే ఎక్కువ వుంది. ఒక జాతి తనను తాను సమర్థవంతంగా వ్యక్తీకరించుకొని పురోగమించేందుకు గొప్ప సామాజిక వనరు విద్య. అది లేనిదే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు. అదొక సమానత్వ దోహదకారి. వెనకబడి, ఎగుడుదిగుడుగా శతాబ్దాల తరబడి కుంచించుకొనిపోయిన జాతిలో ఊర్ధ్వ చలనం తేగల్గినదీ, ఐక్యం చెయ్యగల్గినదీ విద్యే. అదొక ప్రజాస్వామిక హక్కు, మానవ హక్కు. ప్రశ్నించే, తర్కించే జాతిని చదువు మాత్రమే నిర్మించ గలుగుతుంది. ఇవన్నీ మనం చాలాసార్లు, చాలాచోట్ల చెప్పుకొన్నాం. NCF-2005 దీన్ని అద్భుతంగా మన ముందుంచింది. రాధాకృష్ణన్

## “అక్రమ బదిలీలు చేయం” ముఖ్యమంత్రి ప్రకటన

ఉపాధ్యాయ బదిలీలు వేసవిలోనే జరపాలని కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని యుటియఫ్, ఫ్యాప్టో అనేకసార్లు విద్యాశాఖమంత్రి, విద్యా శాఖ అధికారులకు ప్రాతినిధ్యం చేశాయి.

కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటించకుండానే ప్రభుత్వం అక్రమ బదిలీలు, పైరవీ బదిలీలు చేయడానికి సిద్ధం అయింది. దీనికి వ్యతిరేకంగా ఫ్యాప్టో జూన్ 30వ తేదీన అన్ని జిల్లాల్లో కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు నిర్వహించింది. జులై 6వ తేదీ డైరెక్టర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో జులై 8న విద్యాశాఖమంత్రిగారు చర్చలకు ఆహ్వానించారు. చర్చల్లో ఫ్యాప్టో డిమాండ్స్‌ని అంగీకరించకపోగా రాజకీయ అవసరాల కోసం మేం కొన్ని బదిలీలు చేయాల్సి ఉంటుందని ప్రకటించారు. ఇది అప్రజాస్వామికం అని ఫ్యాప్టో తెలియజేసింది.

జులై 15న విజయవాడలో మహాధర్నా, 16 నుండి నిరవధిక దీక్షలకు పిలుపునిచ్చింది.

ఉపాధ్యాయ సంఘాల పోరాటానికి మద్ధతుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఆరుగురు, మాజీ ఎమ్మెల్సీతో కలిసి జులై 9వ తేదీన విజయవాడలో నిరాహారదీక్షలు చేపట్టారు. వారికి మద్ధతుగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటానికి రాష్ట్ర వ్యాపితంగా చర్చనీయాంశం అయింది. ప్రభుత్వం మీద ఒత్తిడి పెరిగింది. ప్రభుత్వంలో కదలిక వచ్చింది. స్వయంగా ముఖ్యమంత్రి కౌన్సిలింగ్ ద్వారానే ఉపాధ్యాయుల బదిలీలు చేస్తాం అని ఫ్యాప్టో నాయకత్వానికి హామీ ఇచ్చారు.

పోరాటం ద్వారా అక్రమ బదిలీలు నిలిపివేయబడ్డాయి. ఉపాధ్యాయ ఉద్యమ పోరాటాలు, ఎమ్మెల్సీల సహకారంతో కౌన్సిలింగ్ హక్కులు రక్షించుకోగలిగాం. భవిష్యత్‌లో ఇలాంటి ఐక్యత కొనసాగాలి.

---

లాంటివారు ఉన్నత విద్య జాతి నిర్మాణం కోసం, దేశీయ మేధావి వర్గాన్ని రూపొందించు కోడానికనీ ఎంతో గొప్పగా చెప్పారు.

జాతిని గురించి నిరంతరం ధర్మపన్నాలు వల్లించే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం – దాని మానవ వనరుల శాఖ ఈ నూతన విద్యా చర్చా పత్రంలో వీటిని గురించి ఒక్క ముక్క పలికితే ఒట్టు. దీనర్థం ఏమిటి? తమకు స్వంత అజండా ఒకటి వుంది గన్క దాన్ని కడుపులో పెట్టుకొని మొదట ఇప్పటిదాకా మనం నిర్దేశించుకొన్న ప్రజాస్వామిక విలువల్ని దాటవేసి గుట్టుచప్పుడు గాకుండా గొంతు నులిమేస్తే, ఆ తర్వాత తమ విశ్వరూపం ప్రదర్శించవచ్చునన్న వ్యూహమా ఇది? **చెప్పాల్సినవి చెప్పకపోవడం చెయ్యరానివి చెయ్యడానికి పూర్వ రంగం.**

కాదంటే మరో రూపంలోనైనా మనం అనుకోవాలి. దేశంలో ఇప్పుడు రెండు పాయలు సమాంతరంగా ప్రవహిస్తున్నాయి. ఒకటి మోడీది. రెండోది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ది. మోడీది ‘Make in India’ దృక్పథం. ఇందులో మార్కెట్ తప్ప ఏదీ వుండదు. ఎక్కడెక్కడి వాళ్ళూ రావాలి, అన్ని వనరులూ వాళ్ళకప్పగించాలి. మనుషులు కూడా వనర్లే. వారినీ అప్పగించాలి. వారు ఉత్పత్తి చేస్తారు. సర్వీసులు నడుపుతారు. లాభాలు ఆర్జిస్తారు. మనకు కూలి దొరుకుతుంది. వాళ్ళకి సంపద పెరుగుతుంది. దీనికి తగ్గట్టు నిపుణులైన ఊడిగంవాళ్ళని తయారుచేయడమే విద్య చెయ్యాల్సింది. దానికి జాతి నిర్మాణం, organic intellectuals ఇంతింత పెద్ద మాటలతో పనిలేదు. కేంద్రంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం దీనికి తగ్గట్టే ఈ డొల్ల చదువుల్ని ముందుకు తెస్తోందా? ఈ విధానం అంతర్జాతీయ బేహారులకు అవసరం. W.T.O.కు ఎంతో ప్రీతిపాత్రం. ఎలాగూ డిసెంబరులో నైరోబీలో W.T.O. మంత్రుల సమావేశం జరగనుంది. మన దేశం General Agreement on Trade in Services (GATS) లోని సర్వీసుల్లోకి విద్యనూ చేర్చి ఇప్పటి ప్రాథమిక హామీని (Initial Offer) ఒప్పు కోలుగా మార్చుకోడానికి, విద్యా వ్యాపారానికి అంతర్జాతీయ వ్యాపారుల్ని ఆహ్వానించడానికి రంగం సిద్ధమవుతోంది. **విద్యార్థి వినిమయ దారుడుగా, తర్వాత మార్కెట్ సరుకుగా మారాలంటే మొదట విద్య సరుకుగా మారాలి. అప్పుడు విద్య కూడా సిరులు కురిపిస్తుంది.** నూతన విద్యా విధానం చర్చాపత్రం సరిగ్గా దీని కోసమే మన ముందుకు రావడం లేదు గదా! కాదని ఎవరనగలరు? ఎలా అనగలరు?

ఇక ఆర్.ఎస్.ఎస్. దృక్పథం మరొకటి వుంది. అది తాత తాతల నాటి కథల్ని తవ్వి పొయ్యడం, కాషాయ కషాయాన్ని త్రాగించడం. ఈ పత్రంలో దీని ప్రస్తావన కొట్టొచ్చినట్లు కన్పించదు. అక్కడక్కడా లీలామాత్రంగా, మినుకు మినుకుమంటూ ఈ దుర్లక్షణాలు కన్పిస్తాయి. కొంపదీసి మన అఖండ భారత జాతీయవాద సింహాలు తాము నిత్యం ప్రచారం చేసే జాతీయ సంస్కృతీ, చరిత్రా విలువల్ని కట్టగట్టి గుహలో పెట్టి ద్రవ్య పెట్టుబడిముందు గ్రామసింహాలుగా మారలేదు గదా! తమకు అత్యంత ప్రీతిపాత్రమైన విద్యా కాషాయీకరణను ప్రస్తుతానికి చాప కింద నీరులా మాత్రమే పారిస్తూ W.T.O.ను ధిక్కరించే శక్తి లేక (ఆసక్తి లేక) నాటకాలాడ్డం లేదు గదా! ఈ దోబూచులాట కొంచెం లోతుగా చూస్తే తప్ప ఈ చర్చా పత్రంలో కన్పించదు. ఔను మరి, మార్కెట్ ముందు మతం ఎంతటిది?

ఈ నేపథ్యంలో ఈ చర్చా పత్రం ఇటు పాఠశాల విద్యలోనూ, అటు ఉన్నత సాంకేతిక విద్యలోనూ చాలా సంస్కరణల్ని ప్రస్తావించింది. ఇందులో కావల్సినంత గందరగోళం వుంది లేదా మనల్ని గందరగోళ పరిచే ఎత్తుగడ వుంది. ఒక స్పష్టమైన చిత్రం లేకుండా, చట్రం లేకుండా చాలా విషయాలు, వాటి చుట్టూ తలాతోకాలేని ప్రశ్నలు ఇందులో బోలెడున్నాయి. మాటిమాటికీ నాణ్యతను ఇందులో ప్రస్తావించారు. ఏయే పాఠ్యాంశాలకు ఎంత ప్రాధాన్యత వుండాలో ఓ చర్చ వుంది. భాషల మీద, వృత్తి విద్య మీదా చాలా చాలా వుంది. మూల్యాంకనం, ICT, పాఠ్యగ్రంథాలు ఒక ప్రక్క, నిర్వహణా సమస్యలను మరొక ప్రక్క ముందుకు తెచ్చారు. ఇక PPP (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) ప్రస్తావన సరేసరి. ఎంత చెప్పినా ‘అందరికీ విద్య’ను నాణ్యమైన సమానమైన విద్యను అందించడం మా పూచీ’ అని మాత్రం ఎక్కడా చెప్పరు. వీటన్నిటినీ వరుసగా అంశాల వారీగా వచ్చే మాసాల్లో చర్చించుకొందాం.

# యుటియఫ్, ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాలు

**ప్రభుత్వ విద్యారంగ రక్షణకు పునరంకితమవుదాం!**

విద్యారంగాన్ని సమైక్యపరిచి అన్ని ప్రాంతాల, అన్ని మేనేజిమెంట్ల, అన్ని కేడర్ల సమైక్య సంఘంగా చారిత్రక అవసరంగా 1974 ఆగస్టు 10న ఏర్పడిన సంస్థ యుటియఫ్.

యుటియఫ్ స్థాపించిన వెంటనే అత్యవసర పరిస్థితి ఏర్పడినా లెక్కచేయక ఉపాధ్యాయుల పక్షాన నిలిచింది.

రీగ్రూపింగ్ స్కేల్సు సాధన, పే స్కేళ్ళు పెంపుదలకు, ఎయిడెడ్ టీచర్ల డైరెక్ట్ పేమెంట్ నుండి 60 సం॥లకు రిటైర్మెంట్ వరకు, మున్సిపల్ టీచర్ల జీతాల అక్కౌంట్ నుండి 010 వరకు, ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే కౌన్సిలింగ్ జిఓ సాధనతోపాటు అప్రెంటీస్ నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన, అప్రెంటిస్ విధానం రద్దుకు స్వతంత్రంగానూ, సమైక్యంగానూ అగ్రభాగాన నిలిచిపోరాడిన సంస్థ యుటియఫ్. 2007 తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటియఫ్ బలపరిచిన ఎమ్మెల్సీలు 13 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



**దాచూరి రామిరెడ్డి**
మాజీ ఎమ్మెల్సీ

నవ్యాంధ్రప్రదేశ్‌లో అగ్రగామి సంఘంగా ఉంటూ ఐక్య ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషిస్తూ ఫ్యాప్టోలో కో-చైర్మన్ మరియు జెఏసిలో సెక్రటరీ జనరల్ బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల హక్కుల సాధనకు కృషి చేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయింపులు తగ్గించటంతో పాటు, విద్యా కాషాయీకరణకు బీజాలు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా మార్చుతామని ప్రచారం చేస్తూ విద్యారంగం మొత్తం కార్పొరేట్ వారికి అప్పగించ బోతుంది.

విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల్ని చైతన్యపరచడం, ప్రజలతో కలిసి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడమే నేడు మన ప్రధాన కర్తవ్యం.

**యుటియఫ్ 42వ వసంతంలో ప్రవేశిస్తున్న సందర్భంగా విద్యా వికాస ఉద్యమం ద్వారా ప్రభుత్వ విద్యారంగ రక్షణకు పునరంకిత మవుదాం.**

## ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

STFI ఆవిర్భావంలో యుటియఫ్ ప్రధాన భూమిక వహించింది. 1981 భీమవరంలో జరిగిన మహాసభల్లో తర్వాత నెల్లూరులో జరిగిన మహాసభల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఉపాధ్యాయ నేతలతో చర్చించి దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించారు. STFI ఆవశ్యకతను వారందరికి వివరించి ఒప్పించడం జరిగింది. అయితే రిజిస్ట్రేషన్ చేయడానికి సాంకేతికపరమైన అభ్యంతరాలు రావడంతో 1997లో మద్రాసులో జరిగిన సమావేశంలో CCSTO (కో-ఆర్డినేషన్ 'కమిటీ ఆఫ్ స్కూల్ టీచర్స్ ఆర్గనైజేషన్స్')గా ఏర్పడింది. తమిళనాడులో 454/2002 నెంబరుతో రిజిస్టర్ జరిగింది. 2002లో కలకత్తాలో CCSTO రెండవ మహాసభ జరిగింది. ఆ మహాసభలో CCSTOను STFIగా ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఆ మహాసభకు కేరళ నుండి KSTA, పశ్చిమ బెంగాల్ నుంచి ABTA, ABPTA, ఆంధ్రప్రదేశ్ నుండి APUTF, రాజస్థాన్ నుండి RSS, పంజాబ్ నుండి GTU, హర్యానా నుండి HRSA, త్రిపుర నుండి TGTA, TTA, పాండిచ్చేరి నుండి TAP, తమిళనాడు నుండి TNPTF, TNHSSGTA, TNPGTA, TIAS, జమ్ము కాశ్మీర్ నుండి J&KUTA సంఘాలు హాజరైనాయి.

ఆ తర్వాత STFI దేశవ్యాపితంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఉపాధ్యాయుల సమస్యలపై కోటి సంతకాల తో రాష్ట్రపతికి మెమోరాండం ఇవ్వడం, అన్ని రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం కొరకు రౌండ్‌టేబుల్స్, వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు చేయడం, 29.03.1994న ఢిల్లీలో భారీ విద్యాసభ జరపడం జరిగింది. ఉపాధ్యాయులందరిని చైతన్యపరచుటకు కన్యాకుమారిలో 3 రోజులు వర్క్‌షాప్ జరిగింది. ఆ సభలో అన్ని రాష్ట్రాలలో ఉన్న సర్వీస్ నిబంధనలు, సెలవు నిబంధనల గురించి చెప్పడం జరిగింది. దీనివల్ల ఏపి రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంది, ఉపాధ్యాయులందరికి అర్థం అయింది. అలాగే నాయకత్వ లక్షణాలు, విలువలు గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది.

STFI రెండవ మహాసభ కేరళలో పాలఘట్‌లో 2003 ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో జరిగింది. ఆ సభలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య మంత్రితో పాటు అనేకమంది మేధావులు పాల్గొన్నారు. ఆ మహాసభ ప్రత్యేకత కరపత్రంలో వేసిన టైం ప్రకారం జెండావందనం దగ్గర నుండి బహిరంగ సభ వరకు ఒక్క నిమిషం కూడా తేడాలేకుండా జరపడం.

మూడవ మహాసభ 2005 డిసెంబర్ 17,18 తేదీలలో హైదరాబాద్‌లో యుటియఫ్ ఆతిథ్యంతో జరిగింది. ఆ తర్వాత మహాసభలు ఉత్తరాది రాష్ట్రాల్లోనే జరిగాయి. ఈ మధ్యకాలంలో ఢిల్లీలో స్వంత భవనం ఏర్పాటు చేసుకున్నాం. యుపి, బీహార్, ఒరిస్సా రాష్ట్రాల్లో విస్తరించ డానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రోజు దేశంలో ఉన్న అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా ఎస్‌టిఎఫ్ఐ పనిచేస్తోంది. దీనికి మనమంతా గర్వపడాలి. విద్యారంగంలో రావలసిన మార్పుల గురించి ఢిల్లీలో రెండు సదస్సులు జరిగాయి. భవిష్యత్‌లో అనేక కార్యక్రమాలు చేయడానికి సన్నద్ధం జరుగుతున్నాయి.

దేశవ్యాపితంగా విద్యారంగంలో వస్తున్న సంస్కరణలపై చర్చించి, నూతన విద్యా విధానంలో ప్రభుత్వరంగంలో విద్య ఉండాలి తప్ప కార్పొరేటీకరణ చేయరాదని, విద్యకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని, పాఠ్యాంశాలలో కాషాయీకరణ చేయడం విరమించు కోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడమైనది.

పిఎఫ్ఆర్‌డిఏ బిల్లుకు వ్యతిరేకంగా పోరాటాలలో పాల్గొనింది. సెప్టెంబర్ 2న జరిగే దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలియజేయడం ద్వారా ప్రభుత్వరంగ పరిరక్షణకు పోరాటాలు చేస్తుంది.

ఎస్‌టిఎఫ్ఐ 17 రాష్ట్రాలకు విస్తరించింది. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్రాల్లో నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తోంది.

ఎస్‌టిఎఫ్ఐ ద్వారా యుటియఫ్ దేశవ్యాప్త ఉపాధ్యాయ ఉద్యమాలు నిర్మించుకోవడం కీలకపాత్ర వహిస్తుంది. మన రాష్ట్రంలో ఎస్‌టిఎఫ్ఐ కార్యక్రమాలు విస్తృతంగా జరుపుదాం.

# విద్యావికాస ఉద్యమం

## మంచి విద్య కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దాం

పి.బాబురెడ్డి, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

మన రాష్ట్ర ముఖ్య మంత్రిగారు అన్ని సమావేశాల్లో చర్చించే ప్రధాన అంశం అభివృద్ధి.

ఏ జాతి అయినా అభివృద్ధి చెందటానికి అతి ముఖ్యమైన, కీలకమైన అంశం విద్య.

విద్యాభివృద్ధి అనేది ఆర్థికాభివృద్ధికీ, పేదరిక నిర్మూలనకు కీలకమైన విషయం. విద్యాభివృద్ధి జరగకుండా ఏ దేశము, జాతి అభివృద్ధి కాలేదు. సింగపూర్, జపాన్, చైనాతో సహా మన రాష్ట్రం అభివృద్ధి కావాలంటే కూడ కీలకం విద్యాభివృద్ధే. అందులోను ప్రాథమిక విద్యాభివృద్ధి మరింత కీలకం.

కానీ మన విద్యారంగం పరిస్థితి ఎలా ఉంది? దేశ సగటు అక్షరస్యాత 74%, రాష్ట్రంలో 67% దేశంలో మనం 31వ స్థానంలో ఉన్నాం. దేశంలో గ్రామీణ జనాభా 73.44% ఉండగా రాష్ట్రంలో 76%గా ఉన్నారు.

దేశంలో నిరక్షరాస్యులు 35.73% అక్ష రాస్యులు వచ్చిన ప్రాథమిక విద్యకూడ లేని వారు 13.97%. మొత్తం 49.7% మంది ప్రాథమిక విద్యకూడ లేనివారే.

మన రాష్ట్రంలో నిరక్షరాస్యులు 37.85%. ప్రాథమిక స్థాయి కూడ లేనివారు 14.72% మొత్తం 52.57% మంది ప్రాథమిక విద్యలేని వారు స్వాతంత్ర్య వచ్చి 6 దశబ్దాలు దాటినా గ్రామాల్లో సగంమంది పైగా నిరక్షరాస్యులే.

రాష్ట్రం ఎడ్యుకేషన్ హబ్‌గా, నాలెడ్జ్ స్టేట్‌గా మార్చుతామని ముఖ్యమంత్రి అంటున్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో విద్యారంగానికి కేటాయిం పులు తగ్గిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం విద్యా రంగానికి కేవలం 16% మాత్రమే కేటాయిం చాలని అందులో ప్రాథమిక విద్యకు సగం కూడ లేదు. కేంద్ర నుండి కేటాయింపులు కోతలు పడ్డాయి.

విద్యారంగం నుండి క్రమంగా ప్రభుత్వం తన బాధ్యత తగ్గించుకునే క్రమంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రాథమిక విద్యను ప్రయోగశాలగా మార్చేశారు. అందు బాటు పేరుతో వేలాది పాఠశాలలు ప్రారంభించి అవన్నీ ఒకరిద్దరు టీచర్లతో ప్రజల విశ్వాసం కోల్పోయేలా చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం పెట్టినా అందుకు ప్రత్యేకంగా టీచర్లను ఇవ్వలేదు. రేషన లైజేషన్ పేరుతో టీచర్లను తొలగించి పాఠశా లలు మూసివేశారు. పర్యవేక్షణ వ్యవస్థ రెండు దశాబ్దాలుగా కుప్పకూలింది. 665 మండలాల కు 567 మండలాలలో ఎంఇఓలు లేరు, డెప్యూటీ డిఇఓలు 75మందికి 65 ఖాళీలు కేవలం 10మంది రెగ్యులర్‌గా ఉన్నారు.



నూతన ఉపాధ్యాయుల్ని తయారుచేసే డైట్, బిఇడి కాలేజీల్లో 95% పోస్టుల్ని ఖాళీలే. 30% పాఠశాలల్లో టాయిలెట్స్‌లేవు. మంచినీరు లేనివి ఇంకా ఉన్నాయి. ప్రభుత్వాలు బుద్ధిపూరకంగానే ఈ పరిస్థితిని తీసుకువచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలంటే నాశిరకం పాఠశాలలు అనే విధంగా మార్చేశారు.

నాణ్యమైన విద్య అంటే ఇంగ్లీషు విద్య అనే అభిప్రాయం కల్పించారు. ఇంగ్లీషు చదువు పట్ల ప్రజల్లో ఉన్న ఆకాంక్షను కార్పొరేట్ వారు తమకు అనుకూలంగా మలచుకున్నారు. విద్యను వ్యాపారంగా మార్చారు. వేలకోట్ల రూపాయలు వ్యాపారం విద్యారంగంలో నడుస్తోంది. దేశంలో ఎక్కడలేనివిధంగా మన రాష్ట్రంలో 48% పిల్లలు ప్రైవేట్ స్కూళ్ళకు వెళు తున్నారు.

ఇంటర్మీడియేట్‌లో 9.3 లక్షలమంది చదువుతుండగా అందులో 6.6 లక్షలమంది కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీల్లో ఉన్నారు. ఉన్నత విద్య దాదాపుగా ప్రైవేట్ రంగం చేతిలోకి వెళ్ళింది.

ప్రభుత్వ తప్పుడు విధానాలు కార్పొరేట్ వారికి వరంగా, ప్రజలకు పెనుభారంగా మారాయి. స్కూల్ ఫీజులతోపాటు, బస్సు, దుస్తులు, హాస్టల్, పుస్తకాలు, విహారయాత్రలు, ఎగ్జిబిషన్‌లతోపాటు అనేక రకాల ఫీజులు వసూలు చేస్తున్నారు. కనీసంగా 15వేల నుండి లక్షల్లో వసూలు చేస్తున్నారు. విద్య లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. విద్యా వ్యాపారులే పాలకవర్గాల ప్రతినిధులైనారు.

ఎంత ఎక్కువ ఫీజు కడితే అంతమంచి చదువు ఉంటుందనే ధోరణిని ప్రచారం చేస్తున్నారు. వ్యాపారంతోపాటు విద్య యాంత్రికమైంది. ప్రభుత్వ సిలబస్, బోధనా విధానాలుండవు భట్టీపట్టి మార్కులు తెచ్చుకోవడంలోనే గొంతు లు కోసే పోటీ, ఒత్తిడి తట్టుకోలేక ఆత్మ హత్యల కు పాల్పడే విద్యార్థులను చూస్తున్నాం. ఎంతో ఖర్చుచేసి చదివినా కొద్దిమందికి ఐఐటి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు తప్ప అందరికి ఉద్యోగాలు రాని పరిస్థితి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం తో తల్లిదండ్రులు అప్పుల ఊబిలో కూరుకు పోవడం చూస్తున్నాం.

ప్రభుత్వ విద్య ప్రజలకు దూరం కావడంతో ప్రైవేట్ విద్య ప్రజలకు భారంగా మారింది. ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలి. పాలక పార్టీలన్నీ ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య నందిస్తామని వారివారి మానిఫెస్టోల్లో ప్రకటిం చాయి. ఇది ఆచరణలో పెట్టాలి. విద్య ప్రజల హక్కు, దాన్ని సాధించుకునేందుకు ప్రజలు కదలాలి, పాలక వర్గాలపై ఒత్తిడి తేవాలి.

నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించే విద్య ప్రభుత్వమే అందించాలి. "అందరికి నాణ్యమైన, సమానమైన విద్య కావాలంటే అది ప్రభుత్వరంగంలోనే సాధ్యం." అందుకోసం ప్రభుత్వ విద్యారంగం కాపాడు కోవాలి. కార్పొరేట్ రంగంలోని ఫీజుల దోపిడి, అసమానమైన చదువులు, అసమగ్రమైన విద్యా విధానం, విలువలులేని విద్యావ్యాపార ధోరణిపై విస్తృతంగా చర్చనడవాలి.

'విద్యా వికాస వేదిక' కార్యక్రమాల్లో యుటియఫ్‌గా భాగస్వామ్యమవుదాం. విస్తృతమైన ప్రచారం చేద్దాం. ప్రజల్లోకి తీసుకెళ్దాం. అందరికీ సమాన విద్యకోసం పనిచేసే అన్ని సంస్థలతోను, సంఘాలతో, మేధావుల తోను విస్తృతంగా విశాల వేదికగా పనిచేద్దాం. అందుకోసం ప్రాథమిక కార్యక్రమాలుగా ప్రజలచే ఆకర్షింప బడి, ప్రజల సహకారంతో పిల్లల సంఖ్యను పెంచుకొని అభివృద్ధి చెందిన, ప్రభుత్వ పాఠశాలలు మన మధ్య ఉన్నాయి. వాటిని గుర్తించాలి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను, సహకరించిన గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, దాతలు, సంస్థలు, పూర్వ విద్యార్థులు తదితరులను ఆహ్వానించి, అభినందించాలి.

కార్పొరేట్ విద్యలోని అసలు విషయాలను కార్పొరేట్ విద్యార్థుల తల్లిదండ్రులతోనే చర్చించాలి. అందుకోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. వాస్తవాన్ని వెలుగులోకి తేవాలి. విద్యా వికాస వేదిక ప్రజల వేదికగా పని చేయాలి.

# ప్రాథమిక విద్యలో భాష ప్రాధాన్యత

సివి క్రిష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక
9490300478




ప్రాథమిక విద్యలో భాషకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలు ముందుగా భాషపై పట్టుసాధించాలి. భాష ద్వారానే పిల్లలు సమస్త విషయాలు నేర్చుకుంటారు.

పిల్లల చదువులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలంటే మనం ఏమి చేస్తాం? పిల్లల చేతికి ఒక పుస్తకం ఇచ్చి చదవమంటాం. ఒక కూడికో, తీసివేతో ఇచ్చి చేయమంటాం. చదవలేకపోతే "వీళ్ళకు చదువు రాదు" అని నిర్ధారించుకొంటాం.

వివిధ సర్వేలు చేసే సంస్థలు, పరిశీలకులు అప్పుడప్పుడు పిల్లల చదువుల గురించి బాంబులు పేలుస్తుంటారు. 8వ తరగతి పిల్లలు నాలుగు వాక్యాలు చదవలేకున్నారని, తప్పుల్లేకుండా రెండు వాక్యాలు గూడా రాయలేకున్నారని, కూడికలు తీసివేతలు కూడా చేయలేక పోతున్నారని ప్రకటిస్తారు. రెండవ తరగతి స్థాయిలోనే ఉన్నట్లు నిర్ధారిస్తారు. నాలుగు రోజులు దానిమీద టీవీల్లో చర్చలుచేస్తారు. దిన పత్రికల్లో విశ్లేషణలు, విమర్శలు వస్తాయి. ఆ తర్వాత అంతా మరిచి పోతారు.

ఇలా ఎన్నాళ్లు? ఎన్నేళ్ళు? **నిజంగా పరిస్థితులు అంత అధ్వానంగా ఉన్నాయా? అదే నిజమైతే ఆ పిల్లలకు, వారి కుటుంబాలకు జరిగే నష్టాలకు ఎవరు బాధ్యులు**? దేశానికీ ఇది పెద్ద నష్టమే గదా! ఐదేళ్ళు చదివినా చదవడం రాయడం రాకపోవడం ఏమిటి? టీచర్లు నేర్పించ లేకపోవడం ఏమిటి? ఎక్కడుంది లోపం? దీన్ని సరిదిద్దలేమా? లోపం ఎక్కడుందో తెలుసుకొంటే సరిదిద్దుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.

**ప్రాథమిక విద్యలో భాషకున్న ప్రాధాన్యత**

ఒకప్పుడు చదువుకోవడం అంటే భాషమీదా, సాహిత్యంపై నా పట్టు సాధించడం. గణితంతోసహా ఇతర శాస్త్రాలు కూడా పద్యాలలో శ్లోకాల్లో సాహిత్య భాషలోనే ఉండేవి. కాలం మారింది. విజ్ఞానశాస్త్రాల ప్రాధాన్యత పెరిగింది. సాహిత్యాన్ని వదిలేసాం. దురదృష్టం ఏమిటంటే సాహిత్యంతోపాటు భాషను కూడా వదిలేసాం. కష్టాల్లో పడ్డాం. అన్ని సబ్జెక్టుల మాదిరి భాష కూడా ఒక సబ్జెక్టు మాత్రమే. అన్ని పీరియడ్లలో దానికి ఒక పీరియడ్ కేటాయిస్తున్నాం. ఇక్కడే మనం పొరపాటు చేశాము.

ముందు భాష రావాలి. భాష ద్వారా ఇతర సబ్జెక్టులు నేర్చుకొంటారు. భాష ద్వారానే గణితానికవసరమైన తార్కిక శక్తి సమకూరుతుంది. అందుకనే భాషకు గణితానికి దగ్గర సంబంధం ఉందంటారు భాషా శాస్త్రవేత్తలు. భాషపై పట్టు ఉన్నవారే భవిష్యత్తులో గొప్ప వ్యక్తులుగా రాణిస్తారు.

అసలు మాతృభాషలో చదవడం రాయడం రాకుండా, ఇంగ్లీషు హిందీ అంటూ మరో రెండు భాషలు నేర్పించడానికి పూనుకొంటాం. చరిత్ర భూగోళం జీవరసాయన భౌతిక శాస్త్రాలు బోధించడానికి సిద్ధపడతాం. గణితం ఎలాగూ ఉండనే ఉంది. బండెడు పుస్తకాలు - చుక్కలు చూపించే సిలబస్ - మోయలేని బరువు - ఈ కొండను చూసి బెదిరిపోతారేతప్ప నెత్తికెత్తుకోడానికి ఎవ్వరూ సిద్ధపడరు. **లక్ష్యం సాధించడానికి తగినట్లు ఉండాలి. భయాన్ని కల్గించకూడదు.**

**భాషకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి**

ప్రాథమిక తరగతుల్లో సగం కాలాన్ని భాషకు కేటాయించాలి. ప్రతినిత్యం పఠనానికి, రాతకు, తప్పులు గుర్తించి సరిచేసుకోడానికి కొంత సమయాన్ని వినియోగించాలి. కథలు చెప్పడానికి, కథల పుస్తకాలు చదవడానికి, పద్యాలకు పాటలకు కూడా కొంత సమయాన్ని ఉపయో గించుకోవాలి.

ప్రతి సబ్జెక్టు చెప్పేటప్పుడు ఉచ్చారణ, అక్షర దోషాల గురించి పట్టించుకోవాలి. గణితం పరిసరాల విజ్ఞానం బోధించే టీచర్లు కూడా భాష గురించి శ్రద్ధ తీసుకోవాలి. ప్రాథమిక తరగతుల్లో భాష చుట్టూ చదువు సాగాలి. పాఠశాలల్లో భాషకు సంబంధించిన వాతావరణం కన్పించాలి. అయితే ఇంపోజిషన్లతో, చూచి రాతలతో బయపెట్ట కూడదు.

భాషకు ఇంత ఎక్కువ సమయాన్ని కేటాయించి ప్రాధాన్యత ఇచ్చినంత మాత్రాన ప్రయోజనం ఉంటుందా? తప్పక ప్రయోజనం ఉంటుంది.

**క్లిప్ ప్రోగ్రాం**

అప్పుడప్పుడు అనుకోకుండా ప్రభుత్వం కూడా కొన్ని మంచి పనులు చేస్తుంటుంది అనడానికి 'క్లిప్' ప్రోగ్రాం ఒక ఉదాహరణ. పదేళ్ళ క్రిందట డిపిఇపి (జిల్లా ప్రాథమిక విద్యా పథకం) క్లిప్ అనే ప్రోగ్రాం చేపట్టింది. పిల్లలకు ఏదీ సరిగా రావడం లేదని గమనించి ముందుగా తెలుగు చదవడం రాయడం నేర్పాలని నిర్ణయించింది. అలాగే గణితంలో కూడిక తీసివేత గుణకారం భాగహారాలు నాలుగు ప్రక్రియలు నేర్పాలని టీచర్లకు సూచనలిచ్చింది. ఇందుకోసం కొంత మెటీరియల్ తయారు చేసి టీచర్లకు అందజేసింది. నాలుగు నెలల తర్వాత నేను కొన్ని స్కూళ్ళు సందర్శించాను. టీచర్లలో ఉత్సాహం కన్పించింది. పిల్లల్లో అభివృద్ధి గమనించాను.

ఆ సంవత్సరం క్లిప్ ప్రోగ్రాంలో 5వ తరగతి చదువుకొన్న పిల్లలు మరుసటి యేడాది 6వ తరగతిలో చేరారు. సాధారణంగా ఆరవ తరగతిలో ఎక్కువమంది డ్రాపౌట్స్ ఉంటారు. షుమారు ఈ డ్రాపౌట్స్ శాతం 25 నుండి 30 శాతం వరకు ఉంటుంది. నేను పనిచేస్తున్న హైస్కూల్లో ఆ సంవత్సరం డ్రాపౌట్స్ 8 శాతం లోపే. 40మంది విద్యార్థులకుగాను ఇద్దరే బడిమానేశారు. ఈ విషయంలో జనవిజ్ఞాన వేదిక వాదన నిజమైంది. మొదటి నుండి జనవిజ్ఞాన వేదిక పిల్లలు చదువురాక భయపడి బడి నుండి పారిపోతున్నారని వాదిస్తున్నది. చాలా మంది అభిప్రాయం ప్రకారం పేదరికం, కుటుంబ ఆర్థిక పరిస్థితులే పిల్లలు బడి మానేయడానికి కారణం. ఇది నిజం కాదు. చదువు విలువ పిల్లలకు వారి తల్లిదండ్రులకు తెలుసు. అది తమకు అందదనే అభిప్రాయంతోనే చదువు మానుకొంటారు. ఆర్థిక పరిస్థితుల వల్ల చాలా తక్కువ మంది మాత్రమే బడి మానుకొంటారు.



## బుల్లెట్లు వద్దు....
# పుస్తకాలే ముద్దు!

**బు**ల్లెట్ల కోసం వృధా చేస్తున్న ధనాన్ని పుస్తకాల కోసం ఖర్చు చేయాలని నోబెల్‌శాంతి బహుమతి గ్రహీత ఈసఫ్‌జాయి మలాలా ప్రపంచ నేతలకు పిలుపు నిచ్చారు. మలాలా తన 18వ పుట్టినరోజు సందర్భంగా లెబనాన్‌లోని సిరియా శరణార్థ బాలికల కోసం ఓ పాఠశాలను ప్రారంభించారు. పాకిస్థాన్‌లో బాలికల విద్యకోసం పోరాడుతూ 2012లో తాలిబన్ల కాల్పుల్లో తీవ్రంగా గాయపడి కోలుకున్న మలాలా 2014లో నోబెల్‌శాంతి బహుమతి అందుకున్నారు. సిరియా శరణార్థుల బాధలు తెలుసుకునేందుకు తాను లెబనాన్ వెళ్లానని మలాలా చెప్పారు. పాఠశాలలోని సిరియా బాలికలతో కలిసి ఆమె తన జన్మదినోత్సవం జరుపుకున్నారు. సిరియా సరిహద్దున ఉన్న బెకా వ్యాలీలోని ఈ పాఠశాలకు మలాలాకు చెందిన స్వచ్ఛంద సంస్థ నిధులు అందిస్తోంది. 14-18యేళ్ల మధ్య వయసుగల 200మంది బాలికలు ఈ పాఠశాలలో చదువుకోనున్నారు. సిరియా అంతర్యుద్ధం వల్ల శరణార్థులుగా మారిన 40 లక్షలమందిలో 12 లక్షలమంది లెబనాన్‌లో ఆశ్రయం పొందుతున్నారు. వారిలో 5 లక్షలమంది పాఠశాలకు వెళ్లే వయసున్న బాలబాలికలు కాగా ఐదోవంతు చిన్నారులు మాత్రమే విద్యాభ్యాసానికి నోచుకుంటున్నారు. తన కూతురు తలపెట్టిన కార్యక్రమాలను చూసి తాను గర్విస్తున్నానని మలాలా తండ్రి జియా వుద్దీన్ అన్నారు. బాలికల విద్యకోసం గత తొమ్మిదేళ్లుగా కృషి చేస్తున్నా మన్నారు. తమ సంకల్పం స్వాత్‌లోయలో (పాకిస్థాన్) చిన్న ఉద్యమంగా ప్రారంభమై ఇప్పుడు ప్రపంచవ్యాప్తమైందని జియావుద్దీన్ పేర్కొన్నారు. బాలికల మధ్య కేక్‌కట్ చేసి మలాలా తన జన్మదినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

**బ్రిడ్జి స్కూల్స్**

మరో మంచి ఉదాహరణ బ్రిడ్జి స్కూల్స్. జిల్లా ప్రాథమిక విద్యా పథకం డ్రాపౌట్స్ కోసం ఉమ్మడి రాష్ట్రంలో బ్రిడ్జి స్కూల్స్ ఏర్పాటు చేసి కొంతకాలం నడిపింది. బడి మానేసిన పిల్లలు వారి వయసుకు తగిన తరగతిలో చేరాలంటే కనీసం వారికి చదవడం రాయడం వచ్చి ఉండాలి. గణితంలో నాలుగు ప్రక్రియలు తెలిసి ఉండాలి. ఇందుకోసం రెసిడెన్షియల్ స్కూళ్ళు పెట్టి టీచర్స్ నిరంతర పర్యవేక్షణలో ఒక సంవత్సరమో రెండు సంవత్సరాలో చదువు చెప్పి రెగ్యులర్ స్కూల్స్‌లో చేర్పించేవారు. ఈ బ్రిడ్జి స్కూల్స్‌లో ఎందరో పిల్లలు చదవడం రాయడం నేర్చుకొని పై తరగతులకు అర్హత సంపాధించి రెగ్యులర్ స్కూల్స్‌లో చేరారు.




**ప్రస్తుతం మన కర్తవ్యం**

ప్రతి స్కూలుకు దాని ప్రత్యేక పరిస్థితులు దానికుంటాయి. పిల్లల సంఖ్య, టీచర్ల సంఖ్య, ఉన్న గదులు అన్నిటిని దృష్టిలో పెట్టుకొని తమ స్కూల్‌కు సంబంధించి స్వంత ప్రణాళికను (టీచర్ల మధ్య అవగాహన) సిద్ధం చేసుకోవాలి. **5వ తరగతిలోపు పిల్లలకు కనీసం చదవడం రాయడం నాలుగు గణిత భావనలు నేర్పడానికి ప్రయత్నించాలి. ఈ మాత్రం నేర్పితే చాలు పిల్లలు టీచర్లను జీవితాంతం గుర్తుంచుకొంటారు.**

**పిల్లలు సులభంగా నేర్చుకొనే మార్గాలు**

**తరగతి గదిలో ప్రజాస్వామ్యం :** పిల్లలు టీచర్ల దగ్గర నేర్చుకోవాలంటే ఆ టీచర్ని పిల్లలు అంగీకరించాలి. **పిల్లలకు ఆత్మాభిమానం ఎక్కువగా ఉంటుంది. మన మాటలు వారిని గాయపరుస్తూ ఉంటాయి. మనకు భయపడ్తూ ఉంటారు. మనం ఎంత అద్భుతంగా చెప్పినా పిల్లలు స్వీకరించరు.** వాళ్ళ మెదళ్ళు మూసుకొనిపోయి ఉంటాయి.

క్లాసురూమ్‌లో ప్రజాస్వామ్యం, పిల్లలతో స్నేహం - ఇవి రెండూ ఉంటే చాలు. పిల్లలు టీచర్ కోసమైనా నేర్చుకొంటారు.

**ఆసక్తి రేకెత్తించడం :** టీచర్ చదువు చెప్పడంకంటే ఆ చదువు మీద ఆసక్తి కల్గించడం ముఖ్యం. దీనర్థం నీతి వాక్యాలు, సుద్దులు చెప్పడం కాదు. విషయం మీద ఆసక్తి కల్గించడం. విజ్ఞానంతోపాటు పిల్లలకు వినోదం కావాలి. కథలు, మ్యాజిక్, సైన్స్ ట్రిక్స్ - ఆసక్తి కల్గిస్తాయి.

**భాషకు హృదయం ఉంది :** భాష కేవలం పొడి అక్షరాలు పొడి మాటలు గాదు. భాష అంటేనే భావం- 'పిల్లలు నిరంతరం స్పందిస్తూ ఉంటారు'. కథలు, పాటలు, పద్యాలు, జోక్స్, పేరడీలు, నాటికలు వంటివి ఎక్కువగా ఉపయోగించుకోవాలి. టీచరు కూడా భాషతో వినోదించాలి. అక్షరాలతో మాటలతో అనేక తమాషాలు చేయవచ్చు.

హాస్యం, కరుణ, వీర అద్భుతా రసాలకు పిల్లలు ఎక్కువ స్పందిస్తారు.

టీచరు పిల్లలూ కలిసి క్లాసురూమ్‌ను సంతోషంతో నింపాలి. అప్పుడు మాత్రమే చదువుకోవడం పిల్లలకూ, చదువు చెప్పడం టీచర్లకూ ఆనందంగా ఉంటుంది. ఇదంతా భాషను సమర్ధవంతంగా ఉపయో గించడం ద్వారా మాత్రమే సాధ్యం.

**కొత్త కార్యక్రమం రాబోతూ ఉంది :**

ప్రస్తుతం ప్రభుత్వం కూడా పిల్లలు చదవడం రాయడంలో వెనుకబడి ఉన్నట్లు గమనించింది. టీచర్లందరూ తమ తమ సబ్జెక్టులకు సంబంధించి భాష మీద శ్రద్ధ పెట్టాలనే భావంలో ఉంది. పిల్లలు చదవడానికి వీలుగా కొంత మెటీరియల్ తయారుచేసి ఇవ్వబోతూ ఉంది. సిలబస్‌తో పాఠాలతో సంబంధం లేకుండా చదవడం రాయడం మీద ప్రత్యేకంగా కొంతకాలం కృషి చేయబోతున్నట్లు తెలుస్తూ ఉంది. ఇది మంచి కార్యక్రమమే. కాని కొంత కాలానికి మాత్రమే పరిమితం కాకుండా నిరంతరం జరగాలి. టీచర్లు కూడా ఈ పని సులభంగా చేయగలరు. ఈ కార్యక్రమం టీచర్ల దగ్గరకు తీసుకొని పోవడంలో లోటుపాట్లు ఉన్నప్పటికీ పిల్లల కోసం సానుకూలంగా తీసుకోవడం అవసరం. పిల్లల చదువులు మెరుగు పడే దిశగా ప్రయత్నిద్దాం. మన ప్రభుత్వ బడులను మనం కాపాడుకొందాం.

# స్వతంత్ర భారతం విజయాలు - వైఫల్యాలు




రెండువందల సంవత్సరాల వలస ఆధిపత్యం పీడన నుండి మహత్తర స్వాతంత్ర్య పోరాటంతో 1947న భారత్ విముక్తి చెందింది. ఇవాళ "ఈ స్వాతంత్ర్యం మనకేమి ఇచ్చింది" అనే ప్రశ్న మెజార్టీ ప్రజానీకం మనసుల్లో తలెత్తుతున్న తలె త్తుతున్నా భారత్ సాధించిన పురోగతి తక్కువేమీ కాదు. మత ఘర్షణలు, దేశం ముక్కలు కావడం నేపథ్యం నుండి లౌకిక తత్వాన్ని నిలుపుకోవడం చిన్న విషయమేమీ కాదు. బ్రిటీష్ వాళ్ళు వెళ్ళేనాటికి "ప్రజాస్వామ్యం నడపడం మనకు సాధ్యమా?" అనే సంశయం ఉండేది. విభజన గాయాలు, గందరగోళం అధిగమించగలమా అనేది మరొకటి. స్వాతంత్రానికి 4 యేళ్ళముందర 20-30 లక్షలమంది బెంగాల్ కరువుతో చనిపోయిన దైన్యస్థితి ఇంకొకటి. అయినా వివిధ జాతులు, భాషలు, మతాలుగల దేశం లో ప్రజాస్వామ్యం ఎలా పరిఢవిల్లగలదో మనం చూపగలిగాం. ఈ రోజు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ రెండవది.




బ్రిటీష్ పాలనలో 0% వృద్ధిరేటు నుండి స్వాతంత్ర్యానంతరం సాలీనా 3.5% వృద్ధి రేటు కలిగివుండడం (3 దశాబ్దాలపాటు ఇంతకంటే ముందుకు కదలక పోయినా) ముందడుగే.

| | GDP | Per Capita GDP |
|---|---|---|
| 1900-01 నుండి 1946-47 వరకు | 0.9% | 0.1% |
| 1970-71 నుండి 1980-81 వరకు | 3.4% | 1.2% |
| 2000-01 నుండి 2010-11 వరకు | 7.6% | 6.0% |

ఆర్థిక జఢత్వం నుండి భారత్ బైటపడ్డాక కొన్ని రంగాల్లో ప్రపంచంపై తనదైన ముద్ర వేసింది. అందులో ఐటి రంగం ఒకటైతే తక్కువ ఖర్చుకు ఆధునిక మందుల్ని ప్రపంచానికి అందివ్వడం ఇంకోటి. న్యూయార్క్ టైమ్స్ తన ఎడిటోరియల్లో ప్రపంచంలో జనరిక్ మందుల సరఫరాలో భారత్ ఎక్కువని, ఫార్మాసుటికల్ రంగంలో భారత్ విధానాలు ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల పేద ప్రజానీకాన్ని ఆదుకున్నాయని రాసింది.

స్వాతంత్ర్యానంతరం భారత్ ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక మార్పునూ సాధించింది. ప్రస్తుత సగటు జీవితకాలం 66 సం॥లు. ఇది 1951లో కేవలం 32 సం॥లు మాత్రమే. చిన్న పిల్లల మరణాలు ప్రతి 1000కి 1951లో 180 వుండగా నేడు 44. మహిళల అక్షరాస్యత 9% నుండి 65%కు, పురుషుల అక్షరాస్యత 27% నుండి 82%కు పెరిగింది. గర్భధారణ రేటు 5.9% నుండి 2.4%కు మెరుగైంది. గ్రామీణ పేదరికం 47% నుండి 22% తగ్గింది. రాజకీయంగా మహిళలు, మైనార్టీలు, బడుగు వర్గాల నుండి నాయకులు తయారై రావడం మరొక సామాజిక విజయం.

*పూర్తికాని అజెండా :*

**భారత్ సాధించిన విజయాలు సులభ మైనవేమీ కాదు. అయితే అదే మొత్తం కథ కాదు.** అభివృద్ధి సాధించింది కానీ మొత్తంగా సమతూకంగా కాదు. దేశ ఆర్థిక పురోగతిలో సమాజానికి చెందింది చాలా తక్కువ. చైనాలో కార్మికుల నిజవేతనాలు విపరీతంగా పెరిగాయి. భారత్‌లో అలా జరగలేదు. ఇంట ర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకారం నిజ వేతనాలు చైనాలో సంవత్సరానికి 12% వంతున పెరిగితే భారత్‌లో పెరిగింది 2.5% మాత్రమే. సాఫ్ట్‌వేర్‌రంగం ఊపందుకోవడం వల్ల మధ్య తరగతి జీవన ప్రమాణాలు బాగా పెరిగినా రిక్షా కార్మికులు, ఇటుకబట్టీ కూలీలు, ఇళ్ళల్లో పని చేసేవారు, వ్యవసాయ కూలీలు ఇంకా అనేకమంది కార్మికుల జీవన ప్రమాణాలు దారుణంగా గత 30 యేళ్ళలో పడిపోయాయి. ఆర్థిక వృద్ధివల్ల పెరిగిన సంపదలో వీరికి చెందినవాటా చాలా తక్కువ. 1991లో ఉత్పత్తిలో కార్మికుల వాటా 25%వుండగా 2010 నాటికి 12%కి పడిపోవడం దీనికి దృష్టాంతం.

సామాజిక పరిస్థితులు ప్రణాళికాబద్ధంగా చైనాలోలాగా మన దేశంలో అభివృద్ధి చెంద లేదు. ఇప్పటికీ చదువు నుండి ఆరోగ్యం వరకు, రక్షిత మంచినీటి నుండి డ్రైనేజి వ్యవస్థ వరకు - కనీస సామాజిక అవసరాలు మెజార్టీ ప్రజా నీకం ముంగిటకు చేరలేదు. **ఆర్థికాభివృద్ధిలో అనేక దేశాలకంటే భారత్ ముందుకు దూసు కెళ్తోంది. మానవాభివృద్ధిలో అనేక దేశాలకంటే భారత్ కిందకు జారిపోతుంది.**

జిడిపి వృద్ధి రేటులో భారత్ చాలా వేగంగా చైనాలాంటి దేశాల్ని అందుకొంటున్నా అక్ష రాస్యత, సగటు జీవితకాలం, పౌష్టికాహారం లాంటి ప్రమాణాల్లో పేద దేశాలకంటే వెనుకన నత్తనడకన సాగుతోంది. మనకంటే తక్కువ తలసరి ఆదాయం గల దక్షిణ ఆసియా దేశా లతో (బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక) కూడా మానవాభి వృద్ధి సూచికల్లో వెనుకబడి వున్నాం. సగటు జీవితకాలం బంగ్లా దేశ్, భూటాన్, నేపాల్, శ్రీలంకకంటే తక్కువ. 5 సం॥లలోపు పిల్లల మరణాలు శ్రీలంకలో ప్రతి 1000కి 12 అయితే మనకు 61. ఈ విషయంలో మన వెనుక పాకిస్తానే వుంది. ఇమ్యునైజేషన్‌లో శ్రీలంక 99%. పాకిస్తాన్ 80% మనం 72%. 25 సం॥లపైన ఉన్న వారిలో స్కూల్‌లో చదివిన సంవత్సరాలు సగటున శ్రీలంకలో 9.3 సం॥ కాగా మన దేశంలో 4.4 సం॥లు మాత్రమే. తక్కువ బరువుగల పిల్లల సంఖ్య దక్షిణాసియా దేశాల్లో మనకే ఎక్కువ.

అసమానతలు అనేక రూపాల్లో భారతీయ జీవితా ల్లో కొనసాగు తున్నాయి. ప్రభుత్వ వైఫల్యం ప్రధానమైన చర్చనీయాంశం ఇక్కడ. 2012 జులై 30, 31 తేదీల్లో విద్యుత్ సరఫరా నిల్చిపోవడం 60 కోట్లమందిని అంధకారంలో పడేసింది. ఇది ఆర్గనైజేషన్ వైఫల్యం వల్ల జరిగింది. అందులో 3వ భాగానికి అంటే 20కోట్ల మందికి అసలు కరెంట్ కనెక్షనే లేదు. 3వ భాగానికి కరెంట్ లేకపోవడం (అదే చైనాలో 1% మాత్రమే) వ్యవస్థ వైఫల్యం కాదా? ఇవే వైఫల్యా లు నీటి సరఫరా, డ్రైనేజి, ప్రభుత్వ రవాణా వంటి అనేక రంగాల్లో కనిపిస్తుంటాయి.

**కవిత**

## శతవసంత గీతం

– ములుగు లక్ష్మీమైథిలి, నెల్లూరు

పలు పెదవులు పలికిన జగమున
పలుగళములు చిలికిన స్వరమున
శత వసంతాల జనగణమన
అసువులు బాసిన అమరుల త్యాగపథమున
తెల్లవారికి చరమగీతం
భరతజాతికి స్వాగతగీతం
భాషాద్వేషాలు మరచి ఆలపించే గీతం
సుగమ గమ్యం నిర్దేశించే గీతం
భారతీయులమని తెలిపే గీతం
మతమౌఢ్యం చెరిపే గీతం
సామరస్యం నిలిపే గీతం
ప్రశాంతి ప్రేరణ గీతం
ఆసేతు హిమాచలం ప్రతిధ్వనించే గీతం
భారతజాతి కర్తవ్యమే గీతం
సమత, మమత చాటే గీతం
ఓంకార ప్రణవ నాదమే గీతం
భరతమాత ఘనత చాటే గీతం
పాడితే సరిపోదు జాతీయ గీతం
జాతికి పునరంకితమవ్వాలి మనం
మన గీతం... జయ గీతం.. జయహే..

---

1990 తరువాత వృద్ధిరేటులో ప్రపంచ దేశాల్తో పోటీపడ్డ భారతదేశం వృద్ధిరేటు 2005–08 మధ్య 9% పతాక స్థాయికి కూడా చేరింది. అయినా ఇప్పటికీ పేద దేశాల్లో ఒకటిగా మిగిలిపోయింది. మిలియన్ల ప్రజల జీవితాల్లోకి తొంగిచూస్తే వారి తిండి, బట్ట, గూడు, పని పరిస్థితులు దారుణంగా కనిపి స్తాయి. **వృద్ధిరేటు అసంఖ్యాక ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఉపయోగపడలేదు.**

**గతం - నేడు**

ఎందుకని భారతదేశం చాలా పేదదేశంగా మారిపోయింది? క్రీ.శ. 2వ శతాబ్దంలో టాలమీ మనదేశ వ్యాపారాభివృద్ధి గురించి, నగరాలు కేంద్రంగా అభివృద్ధి గురించి గొప్పగా వివరించాడు. 1776లో రాసిన "వెల్త్ ఆఫ్ నేషన్స్" గ్రంథంలో ప్రఖ్యాత ఆర్థికవేత్త, ఆడమ్‌స్మిత్ భారత దేశాన్ని ముఖ్యంగా బెంగాల్‌ని సంపద్వంతమైన ప్రాంతంగా అభి వర్ణించాడు. పోర్చుగల్, డెన్మార్క్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, ప్రష్యా దేశపు వ్యాపారస్థులు ఇండియా సరుకుల్ని యూరప్‌లో తరలించి అమ్ముకొనే వారు. మన సరుకులు యూరప్‌ను ఎంత ఆందోళనకు గురి చేశాయంటే బ్రిటన్ పార్లమెంట్ (ఇండియాలో బ్రిటీష్ పాలనకు ముందు) భారతీయ గుడ్డతో చేసిన వాటిని ఉపయోగించకూడదు అంటూ నిషేధం విధించింది. ఆ కాలంలో బ్రిటన్ నేత పనివారి కంటే భారత్ పనివాళ్ళ జీతాలు మెరుగ్గా వుండేవి. బ్రిటీష్‌పాలన నుండే మన తలసరి ఆదాయంబాగా తగ్గింది. ఇది 19వ శతాబ్దం అంతా కొనసాగింది.

స్వాతంత్ర్యానంతర ఆర్థిక విధానాలు వృద్ధిరేటును, జీవన ప్రమాణా ల్ని పెంచడంలో విజయం సాధించలేదు. 1951 నుండి ప్రారంభమైన పంచవర్ష ప్రణాళికలు గ్రామీణ పేదరికాన్ని 30 యేళ్ళపాటు తగ్గించ లేక పోయాయి. ఇదొక పెద్ద ప్రారంభ వైఫల్యం!!

సోవియట్ రష్యా, చైనా, వియత్నాం, క్యూ బాలు ఉచిత నిర్బంధ విద్యను ఏ మాత్రం జాగు చేయకుండా సమర్థవంతంగా అమలు చేశాయి. 1930లో రష్యాకు వెళ్ళిన రవీంద్ర నాథ్ ఠాగూర్ "నేను రష్యాదేశ గడ్డమీద అడుగు పెట్టగానే నన్ను ఆకర్షించింది ఆ దేశ విద్యా వ్యవస్థ. ఈ విషయంలో గత 100–150 సం॥ల్లో మన దేశ ఉన్నత వర్గాలు కూడా పొంద లేనిది రష్యాలో రైతులు, కార్మికులు పొందగలిగారు" అని ఉత్తరం రాశాడు. ఆనాడు ఠాగూరు రాసిన ఉత్తరాల్ని బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది. ఇప్పటికీ ఆ నిషేధం కొన సాగుతుంది.

మొదటి పంచవర్ష ప్రణాళిక (1951) ఉన్నత విద్యను సమర్థించిందే గానీ నియత స్కూల్ విద్యను వ్యతిరేకించింది. బేసిక్ విద్యను (గాంధీ ప్రవచించిన వృత్తిపనులతో విద్య) సమర్థించింది. మొదటి పంచవర్ష ప్రణాళిక చాప్టర్ 33లో "కొత్తగా పాఠశాలల ఏర్పాటు చేయాలనే వాదనను సమర్థించేది లేదు. బేసిక్ విద్య మీద కేంద్రీకరించి దాని అభివృద్ధికి కావల్సిన ఏర్పాట్లు, అవసరాలు చూస్తాం" అని స్పష్టంగా చెప్పారు. కమ్యూనిస్టు దేశాల ప్రణాళికా వేత్తల దృక్పధానికి పూర్తి వ్యతిరేక దిశలో భారతీయ ప్రణాళికా వేత్తలు నిలిచారు. ఈ వైఖరి అందరికీ చదువు అందించకపోగా ఉన్నత వర్గాలు మాత్రమే చదువు పొందేందు కు దోహదపడింది. నేటికీ ఈ ధోరణి కొన సాగుతోంది. నేటికి ఐదవ భాగం ఏకోపాధ్యాయ పాఠశాలలే. విద్యా ప్రమాణాలలో PISA వంటి అంతర్జాతీయ సర్వేలో హిమాచల ప్రదేశ్, తమిళనాడులను పోటీకి పెట్టినా అట్టడుగున నిలిచాం. బడ్జెట్‌లో విద్యా కేటాయింపులు నేటికీ తక్కువ. ప్రైవేట్ విద్యా వ్యవస్థను ప్రోత్సహిస్తున్నాం. ఇది మొత్తం సమాజాభివృద్ధిలోనూ, పారిశ్రామిక ప్రగతిలోను వెనుకబాటు తనానికి దారితీసింది. హెల్ప్‌మాన్ తన "Mystery of Economic Growth" లో మొత్తం దేశ ఉత్పాదకతను పెంచుకోవడం ఎలా అనేది అంతుపట్టని విషయమేమి కాదు అది విద్యావ్యవస్థ వల్లనే సాధ్యపడుతుంది అంటాడు.

మొత్తం ప్రజానీకం చదువుకు, నైపుణ్యాలకు దూరంగా ఉండడం ఆర్థిక పురోగతికి, సామాజిక మార్పుకు ఆటంకం అని ప్రపంచ అనుభవాలు చెబుతున్నాయి. "దూసుకుపోతున్న భారత్" అని చెప్పే పాలకులకు ఈ అనుభవాలు పట్టడం లేదు. "స్కూల్ విద్యలో చదవడం, రాయడం, లెక్కించడం బాగా నేర్పడం చుట్టూ జరుగుతున్నవి అర్థం చేసుకొనే శక్తిని, పొలిటికల్ వాయిస్‌ను ఇస్తుంది. అది సమాజ మార్పుకు దారి తీస్తుం దంటారు" జాన్‌డ్రెజ్, అమర్త్యాసేన్‌లు. ఉపా ధ్యాయులంగా స్కూల్లో చేయాల్సిన కనీస కర్తవ్యం అంటే మంచి చదువు చెప్పడం ప్రజానీకానికి ఉపాధి అవకాశాల్ని, నాణ్యమైన జీవితాన్ని, ఆరోగ్యం పట్ల, మానవ హక్కుల పట్ల, లీగల్ హక్కుల పట్ల సాధికారి కతను ఎలా ఇస్తుందో మనం అర్థం చేసు కోవాలి. కొందరి అభివృద్ధి దేశాభివృద్ధిగా చలామణి అవుతోంది. అందరి అభివృద్ధి గురించి చర్చ జరగాలి. అందుకు మంచి విద్యవ్యవస్థకై ఉద్యమాలు నడపాలి.

**(జాన్‌డ్రెజ్, అమర్త్యాసేన్‌లు రాసిన, "An uncertain glory" ఆధారంగా)**

**విలీన మండలాలకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల మంజూరు**

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో విలీనమైన మండలాల్లో ఉపాధ్యాయుల స్థానంలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను మంజూరు చేయాలని విద్యాశాఖ అధికారులకు, ఆర్థికశాఖ అధికారులకు ప్రాతినిధ్యాలు చేసి ఉత్తర్వులు యిప్పించడమైనది. పశ్చిమ గోదావరి జిల్లాలో విలీనమైన మండలాలకు 177, తూర్పుగోదావరి జిల్లాలో విలీనమైన మండలాలకు 260 మంది నియామకానికి అనుమతిస్తూ ఉత్తర్వులు యిచ్చారు. తెలంగాణకు ఆప్షన్ ఇచ్చినవారు ఎవరికి వారు రిలీవ్ కావడంతో వందలాది పాఠశాలలు మూతపడ్డాయి. దీనితో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో నాలుగు వందల మందిని 150 కి.మీ. పైబడి డిప్యూటేషన్ చేశారు.

**ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మొత్తం బడ్జెట్ ఒకేసారి విడుదలపై ఉత్తర్వులు**

ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాలకు సంవత్సరం మొత్తానికి ఒకేసారి బడ్జెట్ విడుదల చేయించాలని ఆర్థిక శాఖ మంత్రికి పలుమార్లు విజ్ఞప్తి చేయడం జరిగింది. మంత్రి దీనిపై సానుకూలంగా స్పందిస్తూ ఆర్థికశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఫలితంగా జి.ఓ.నెం.84 తేదీ:02.07.2015న విడుదలయ్యింది. శాసనసభ ఆమోదించిన బడ్జెట్ మేరకు జిల్లాలో సబ్ ట్రెజరీ వారీగా పాఠశాలలను బ్రేక్అప్ చేసి పాఠశాల విద్యాశాఖ ఆర్థికశాఖ అనుమతికి పంపించారు. వెంటనే ఉత్తర్వులు యివ్వాలని ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత గారికి ప్రాతినిధ్యం చేశాము. త్వరలో ఆర్థిక శాఖ నుండి ఆదేశాలు విడుదల కానున్నాయి. అయితే ప్రస్తుతం విడుదల చేసిన బడ్జెట్ ఫిబ్రవరి వరకు సరిపోయే పరిస్థితి లేదు. దీనికి తోడు పిఆర్‌సి అమలు చేయించుకోవాలి. బడ్జెట్ మేరకు జీతాలు తీసుకొని అవసరమైన బడ్జెట్‌కోసం జిల్లాల నుండి వెంటనే ప్రతిపాదనలు పంపించాలి.

**2008 హామీ పత్రాలతో చేరిన వారికి వేతన రక్షణ కల్పించాలి**

2008 డిఎస్సీ ద్వారా హామీపత్రాలు తీసుకొని తదుపరి వచ్చిన వేకెన్సీలలో జాయిన్ అయిన ఉపాధ్యాయులకు 2015 పిఆర్‌సిలో వేతన రక్షణ కల్పించాలని ట్రెజరీ అధికారులకు మరియు ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి హేమా మునివెంకటప్ప గారికి విజ్ఞప్తి చేయడమైంది. వీరు తేది:01.07.2011 తరువాత జాయిన్ కావడం వలన పిఆర్‌సి అమలు తేది:01.07.2013 తరువాత రెగ్యులర్ స్కేల్‌లోకి వచ్చారు. వీరికి ఫిట్‌మెంట్ బెనిఫిట్ కలవకపోవడంతో రెగ్యులర్ స్కేలులోకి వచ్చిన తేదిన స్కేలు మినిమంలో పెట్టడం వలన 2012 డిఎస్సీ ద్వారా నియమించబడిన వారికంటే ఒకస్టేజి తక్కువగా వేతన ఫిక్సేషన్ జరుగుతుంది. కావున ఈ వ్యత్యాసం సరిచేయాలని కోరగా పరిశీలించి తగు నిర్ణయం తీసుకొంటామని హామీ ఇచ్చారు.

**పని దినాల్లో ట్రైనింగ్‌లు రద్దు చేయాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు సరిగ్గాలేవని ఒకవైపు విమర్శచేస్తూ పాఠశాలలు జరిగే పనిదినాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడమేమిటని వీటిని విరమించుకోవాలని డిమాండ్ చేశాము.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు సరిగ్గాలేవని అంటూ పాఠశాలలు జరగకుండా అధికారులే ఉత్తర్వులు ఇస్తున్నారు. ఆర్‌సి నం.375, తేది.21.07.2015 ఉత్తర్వుల ద్వారా ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 11 వరకు నెల రోజులుపైగా శిక్షణ ఇవ్వడం వల్ల వేలాది పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారతాయి. విద్యార్థుల చదువు కుంటుపడుతుంది. పాఠశాలల్ని దెబ్బతీసే ఇటు వంటి ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని హెచ్చరించడమైనది.

**ఐ.వెంకటేశ్వరరావు, UTF రాష్ట్ర అధ్యక్షులు**



**ఇహెచ్ఎస్ ద్వారా మెడికల్ బిల్లులు చెల్లించాలి**

ఉద్యోగుల ఆరోగ్య పథకం స్టీరింగ్ కమిటీ జులై 9న జరిగిన సమావేశంలో తీసుకొన్న నిర్ణయానికి అనుగుణంగా ఇహెచ్ఎస్ ద్వారా మెడికల్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించుటకు విధివిధానాలు రూపొందించి వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని జెఎసి విజ్ఞప్తి చేసింది. అదే రోజు మధ్యాహ్నం ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్ర సమక్షంలో జెఎసి నేతలు హెల్త్‌కార్డులకు సంబంధించి పలు విషయాలు చర్చించారు. ఎన్.టి.ఆర్. వైద్య సేవా సి.ఇ.ఓ. డాక్టర్ రవిశంకర్, డిటిఎ కనకవల్లి ఇతర సిబ్బంది పాల్గొన్నారు. నవంబర్ 2014 నుండి ప్రీమియం మినహాయింపు జరుగుతున్నప్పటికి ఇరిగేషన్, పంచాయితీరాజ్, ఆర్&బి లలో పనిచేస్తున్న వర్క్ ఛార్జ్‌డ్ ఉద్యోగులు 10వేల మందికి మరియు విశాఖ, కర్నూలు కార్పోరేషన్ ఉపాధ్యాయులకు వెంటనే హెల్త్‌కార్డులు విడుదల చేయాలని కోరడం జరిగింది. డిప్యూటేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు, మెడికల్ & హెల్త్ సిబ్బందికి ప్రీమియం మినహాయింపుకు విధివిధానం రూపొందించి హెల్త్‌కార్డులు విడుదల చేయాలని జెఎసి నేతలు చెప్పారు. డి.టి.ఎ. వద్దనున్న సమాచారాన్ని సి.ఎఫ్.ఎం.ఎస్.లో అప్‌లోడ్ చేయాలని ఆర్థిక శాఖ కార్యదర్శి ఆదేశించారు. వీరందరికి త్వరలో హెల్త్‌కార్డులు విడుదలకు చర్యలు తీసుకొంటామని ఆర్థికశాఖ కార్యదర్శి జెఎసి నేతలకు హామీఇచ్చారు.

ఎయిడెడ్, మోడల్ స్కూల్స్ సిబ్బందికి మెడికల్ రియింబర్స్‌మెంట్ కూడా లేదని తక్షణం రియింబర్స్‌మెంట్ అయినా వర్తింపజేయాలని డిమాండ్ చేయడం జరిగింది. గురుకులాలు, విశ్వవిద్యాలయ సిబ్బంది, గ్రంథాలయ ఉద్యోగులకు ప్రీమియం మినహాయింపు, హెల్త్‌కార్డులు విడుదల చేయుటకు విధివిధానాలు రూపొందించాలని జెఎసి నేతలు కోరారు. జెఎసి తరపున ఛైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రెటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు, కో ఛైర్మన్లు బి.వెంకటేశ్వర్లు, కె.నర్సింహారెడ్డి, జి.హృదయరాజు, పి.పాండురంగ వరప్రసాద్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**పిఆర్‌సి బిల్లులు స్పెషల్ బిల్లులుగా చెల్లింపుకు ఉత్తర్వులు**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నూతన వేతనాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నెలాఖరు వరకు బిల్లులు తీసుకోవాలని జెఎసి తరపున విజ్ఞప్తి చేయగా ఆమేరకు స్పెషల్ బిల్లులుగా ఎలాంటి గడువు లేకుండా నెలాఖరు వరకు బిల్లులు స్వీకరించి చెల్లించాలని ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రెటరీ హేమాముని వెంకటప్ప ఖజానా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

**ఎన్టీఆర్ ఆరోగ్య సేవా ద్వారా మెడికల్ బిల్లులు చెల్లింపుకు ఉత్తర్వులివ్వాలి**

జూలై 9వ తేదీన ఇహెచ్ఎస్ స్టీరింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎన్టీఆర్ ఆరోగ్య సేవా పథకం ద్వారా మెడికల్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లింపుకు ఉత్తర్వులు ఇప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్. కృష్ణారావుకు జూలై 16న జెఎసి నేతలు విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేస్తామని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి హామీ ఇచ్చారు. స్టీరింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా డిడిఓల ద్వారా ఆన్‌లైన్‌లో బిల్లులు సి.ఇ.ఓ.ఆరోగ్యశ్రీ కి పంపించాల్సి వుంటుంది. తదుపరి బిల్లులు స్క్రూటిని చేసి ఉద్యోగి/పెన్షనర్ బ్యాంక్ అకౌంట్‌కు క్రెడిట్ చేయాలని

లేఖలో విజ్ఞప్తి చేసినట్లు ఛైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రెటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావులు, కోఛైర్మన్ యస్ రఘురామ్‌రెడ్డి, ఎం.కమలాకర రావు, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎన్.చంద్రశేఖరరెడ్డి, కోశాధికారి వీరేంద్రబాబు, యోగేశ్వరరెడ్డి, జె.సుదీర్‌బాబు లు తెలిపారు.

**పిఆర్‌సి అమలుకు సాఫ్ట్‌వేర్ ఇబ్బందులు సరిచేయాలి**

10వ పిఆర్‌సి ఫిక్షేషన్స్ చేసే సందర్భంలో సాఫ్ట్‌వేర్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు సరిచేయాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ & అకౌంట్స్ జాయింట్ డైరెక్టర్ ఎ.శివప్రసాద్ గారికి జూలై 14న విజ్ఞప్తి చేయడమైనది. పిఆర్‌సి బిల్లులు డౌన్‌లోడ్ కావడం లేదనీ, బ్యాంక్ బెన్ఫిషియర్ షీట్ రావడంలేదనీ, 2008 డిఎస్సీలో నియామకమై హామీ పత్రాలతో జాయిన్ అయిన వారికి ఇంక్రిమెంట్ తేదికి ఆప్షన్ లేకపోవడం వలన ఆర్ధికంగా నష్టపోతున్నారని వీరికి ఇంక్రిమెంట్ తేదికి ఆప్షన్ సౌకర్యం కల్పించాలనీ, నూతన పెన్షన్ స్కీంలో వున్న ఉపాధ్యాయులకు 10% మాత్రమే తగ్గించే విధంగా వుండాలనీ, స్టెప్‌అప్ చేసుకున్న వారికి సంవత్సరిక ఇంక్రిమెంట్ మరియు స్టెప్‌అప్ ఇంక్రిమెంట్ చూపించేటట్లు వుండాలని తదితర సాఫ్ట్‌వేర్ ఇబ్బందులు సరిచేయాలని కోరగా ఆమేరకు సాఫ్ట్‌వేర్‌ను సరిచేయడం జరిగింది.

**ఎయిడెడ్ సిబ్బంది గ్యాప్ పీరియడ్‌కు అర్హతల గల సెలవు**

ఎయిడెడ్ సిబ్బందికి రిటైర్మెంట్ వయస్సు 58 నుండి 60 సంవత్సరాలు పెంపుదల చేసే సందర్భంలో సుమారు ఆరు మాసాలు గ్యాప్ పీరియడ్ 02.06.2014 నుండి 02.01.2015 మధ్య రిటైర్ అయిన వారికి అర్హతగల సెలవు మంజూరు చేయాలని విద్యాశాఖ మరియు ఆర్ధిక శాఖ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశాము. రెగ్యులేట్ చేయాలని యుటియఫ్ పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఆమేరకు ఉత్తర్వులు విడుదల అయినాయి.

**ఆర్ధిక శాఖ అధికారుల వైఖరి గర్హనీయం**

10వ పిఆర్‌సి వేతన బకాయిలు చెల్లింపుకు అవసరమైన ఉత్తర్వులు విడుదల చేయడంలో ఆర్ధిక శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి గర్హనీయమని జెఎసి ఛైర్మన్ పి.అశోక్‌బాబు, సెక్రెటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. జులై 6న జరిగిన జెఏసీ సెక్రెటేరియేట్ సమావేశం ఆర్ధిక శాఖ అధికారుల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని వారు తెలిపారు. సి.ఎఫ్.ఎం.ఎస్. ద్వారా పిఆర్‌సి అమలు సాధ్యం కాదని జెఎసి తేల్చిచెప్పినప్పటికీ ఆర్ధికశాఖ జాప్యాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది.

జూన్ 12న ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణునితో జెఎసి నాయకత్వం హెచ్ఆర్ఎంఎస్ ద్వారానే పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేయగా ఆ మేరకు ఉత్తర్వులు ఇస్తామని ఆర్ధిక మంత్రి హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఉత్తర్వులు రాకపోవడంతో జూన్ 30న ఆర్ధిక మంత్రిని కలిసి ఈరోజే హెచ్ఆర్ఎంఎస్ మాడ్యూల్‌లో పిఆర్‌సి అమలుకు ఉత్తర్వులివ్వాలని కోరగా అదే రోజు ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అదేరోజు ముఖ్యమంత్రి పేషీ నుండి ఆ మేరకు ఆదేశాలు ఇప్పించినప్పటికీ ఆర్ధిక శాఖ అధికారులు ఉత్తర్వులు విడుదల చేయలేదు. ఈ వైఖరి ఉద్యోగుల పట్ల ఆర్ధిక శాఖ నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తుందని జెఏసీ నేతలు ఆగ్రహం వెలిబుచ్చారు. పిఆర్‌సి ఏ పద్ధతిలో చెల్లించాలనే దానిపై ఉత్తర్వులు ఇవ్వడానికి ఆర్ధిక శాఖ అధికారులకు ఎన్నిరోజులు కావాలని వారు ప్రశ్నించారు. వారికి ఇష్టమైనప్పుడే ఉత్తర్వులివ్వాలనుకుంటే ఈ అధికారుల సంగతి తేల్చాల్సి వుంటుందని జెఎసి నేతలు హెచ్చరించారు. ఫలితంగా జూలై 8న హెచ్ఆర్ఎంఎస్‌లో పిఆర్‌సి అమలుకు ఉత్తర్వులు విడుదల

**మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఇకపై ఇహెచ్ఎస్ ద్వారా చెల్లింపు - సి.ఎస్. ఆదేశం**

జిఓ ఆర్‌టి నెం.300, తేది: 24.01.2014 జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వుల ద్వారా ఏర్పడిన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్ఎస్) స్టీరింగ్ కమిటి తొలి సమావేశం ఒకటిన్నర సంవత్సరం తరువాత 09.07.2015 గురువారం మధ్యాహ్నం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎల్.వి.సుబ్రమణ్యం, కుటుంబ సంక్షేమ కమీషనర్ పూనం మాలకొండయ్య, జి.ఎ.డి. పొలిటికల్ కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డి.జి.ప్రసాదరావు, ఆర్ధిక శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. మొదట ఆరోగ్యశ్రీ సి.ఇ.ఓ. డాక్టర్ రవిశంకర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ విడుదల చేశారు. తదుపరి స్టీరింగ్ కమిటీ భాగస్వామ్య సంఘాల నాయకుల అభిప్రాయాలను చెప్పడం జరిగింది.

మెడకల్ రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో విపరీత జాప్యాన్ని నివారించుటకు ఇహెచ్ఎస్ ద్వారా చెల్లించాలని జెఏసి ఛైర్మన్ పి.అశోక్‌బాబు కోరారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు స్పందిస్తూ డిడిఓల నుండి నేరుగా ఆన్‌లైన్‌లో ఇహెచ్ఎస్‌కు బిల్లులు పంపాలని స్క్రూటినీ అనంతరం డిడిఓలకు పంపాలని దీని విధి విధానాలు వెంటనే రూపొందించి ఉత్తర్వులు విడుదల చేయాలని ఆదేశించారు. ఎంప్లాయిస్ డేటా సేకరణలో ఆర్ధిక శాఖ పెత్తనాన్ని పూర్తిగా తొలగించాలనీ ట్రెజరీ ద్వారా సమాచారాన్ని సేకరించాలని స్టీరింగ్ కమిటీ నేతలు కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో విధి విధానాలు రూపొందించి అమలు చేయుటకు స్టీరింగ్ కమిటీకే పూర్తి అధికారాలు వుండాలనీ, 517 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్యాకేజీ రేట్లు ఫైనల్ చేసి పూర్తిస్థాయిలో హెల్త్‌కార్డులు వినియోగించుకునేటట్లు చర్యలు తీసుకోవాలనీ, అర్హులందరికి హెల్త్‌కార్డులు వెంటనే విడుదల చేయాలనీ, సీలింగ్‌తో నిమిత్తం లేకుండా టెక్నికల్ కమిటీ ద్వారా నగదు రహిత వైద్యం అందించే ప్రధానమైన వ్యాధులకు విధివిధానాలు రూపొందించాలనీ, ప్రస్తుతం మెడికల్ బిల్లులు రీయింబర్స్‌మెంట్‌కు సిజిహెచ్ఎస్ ప్యాకేజి రేట్లు అమలు చేస్తున్నారనీ, నవంబర్ 2014 నుండి ఉద్యోగులు, పెన్షనర్లు ప్రీమియం చెల్లిస్తున్నందున ఇహెచ్ఎస్ రేట్లు అమలు చేయాలని కోరగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనికి అంగీకరించారు. వర్క్‌చార్జ్‌డ్ సిబ్బంది 10 వేల మంది ప్రీమియం చెల్లిస్తున్నా హెల్త్‌కార్డులు విడుదల కానందున వీరికి వెంటనే విడుదల చేయాలని చెప్పారు. ఔట్‌పేషంట్ విభాగంలో వైద్యానికి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవనీ, మందులు తగినంతగా సరఫరా కావడం లేదని చెప్పడం జరిగింది. చెన్నై, బెంగళూరు, ఢిల్లీలో ఆసుపత్రులలో హెల్త్‌కార్డుల ద్వారా వైద్యం అందించేదానికి వీటిని పథకంలో చేర్చాలని స్టీరింగ్ కమిటి నేతలు కోరారు.

**ఎయిడెడ్, గురుకుల, విశ్వవిద్యాలయ, గ్రంథాలయ ప్రభుత్వ రంగ సిబ్బందికి హెల్త్‌కార్డులు విడుదల చేయాలి**

నవంబర్ 2014 నుండి హెల్త్‌కార్డులు అమలులోకి వచ్చినప్పటికి ఆరు మాసాల తరువాత రెండవ దశలో మిగిలిన వారందరికి హెల్త్‌కార్డులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికి అమలు కాలేదని ఇప్పటికైనా వీరికి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని జెఏసీ సెక్రెటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎయిడెడ్ వారికి మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కూడా లేదని వారికి తక్షణం మెడికల్

రీయింబర్స్‌మెంట్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ దీనిపై చర్యలు తీసుకొంటుందని సి.ఎస్. తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్ లో వున్న నెట్‌వర్క్ ఆసుపత్రులలో హెల్త్‌కార్డుల ద్వారా వైద్యం అందించాలని కోరారు. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారికి హెల్త్‌కార్డులు విడుదల చేయాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీరింగ్ కమిటి సభ్యులు కె.నరసింహారెడ్డి, సదాశివరావు, ఎం.కమలాకరరావు, ఎం.సోమేశ్వరరావు, వాసు చర్చల్లో పాల్గొన్నారు. జెఎసి డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎన్.చంద్రశేఖరరెడ్డి, వీరేంద్రబాబు, డి.జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

**డైట్, డిఎడ్ ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి**

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలలో ఖాళీపోస్టులను ప్రమోషన్, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని యుటియఫ్ డిమాండ్ చేసింది. ఎస్‌సిఇఆర్‌టి ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ శిక్షణా సంస్థల బలోపేతం' అనే అంశంపై పాఠశాల విద్య కమీషనర్ & డైరెక్టర్ కె.సంధ్యారాణి అధ్యక్షతన బుధవారం నాడు కమీషనరేట్ సమావేశం మందిరంలో సమావేశం జరిగింది. ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ ఎం.వి.రాజ్యలక్ష్మి స్వాగతం పలుకుతూ ఆంధ్రప్రదేశ్‌లో టీచర్ ఎడ్యుకేషన్ పరిస్థితిని వివరించారు. కర్నాటక ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌వారి రాష్ట్రంలో టీచర్ ఎడ్యుకేషన్ పరిస్థితి, చేపట్టిన మార్పుల గురించి వివరించారు. టీచర్ ఎడ్యుకేషన్ నూతన దోరణులపై ఎన్‌సిఇఆర్‌టి ప్రొఫెసర్ జ్యోత్స్న మాట్లాడారు.

యుటియఫ్ తరపున రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయ సంస్థల్లో 80 శాతం ఖాళీ పోస్టులు భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఐఎఎస్ఇ రెండింటిలో ప్రిన్సిపాల్ పోస్టులు 2/2 వేకెన్సీలుగా వున్నాయి. ప్రొఫెసర్లు 3/3 వేకెంట్‌గా వున్నాయి. లెక్చరర్లు 11/14 వేకెన్సీలుగా వున్నాయి. సిటిఇ/ఐఎఎస్ఇ లో అధ్యాపకులు 11/14 వేకెంట్‌గా వున్నాయి. ఎస్‌సిఇఆర్‌టిలో 2/7 ప్రొఫెసర్లు, 20/24 అధ్యాపకుల పోస్టులు ఖాళీగా వున్నారు. 13 జిల్లాల డైట్స్‌లో ప్రిన్సిపల్స్ 6/13 సీనియర్ లెక్చరర్లు 80/91, లెక్చరర్లు (తెలుగు) 172/219, లెక్చరర్లు (ఉర్దు, తమిళం) 26/30 వేకెన్సీలుగా ఉన్నాయి. ఫిజికల్ ఎక్యుకేషన్ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్ 5/5 ఖాళీగా వున్నాయి. (మొదటిది ఖాళీలు, రెండవది శాంక్షన్ పోస్టులు) వీటి భర్తీకి సర్వీస్‌రూల్స్ సమస్యను వెంటనే పరిష్కరించి ప్రమోషన్ పోస్టులు మరియు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాల్సి వుందన్నారు. ప్రభుత్వ రంగంలో 22 ప్రభుత్వ శిక్షణ సంస్థలు వుంటే, ప్రైవేట్ రంగంలో 955 శిక్షణ సంస్థలు వుండడం ఆందోళన కలిగిస్తుందని ఉపాధ్యాయుల శిక్షణలో నాణ్యత లోపిస్తుందని దీనిని ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలని బలోపేతం చేయాలన్నారు. ప్రతి ట్రైనింగ్ కాలేజీని రెసిడెన్సియల్ కాలేజీగా నడపాలని,హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఫ్యాకల్టీలకు ఎప్పటికప్పుడు మారుతున్న బోధన పరిశోధనలు, నైపుణ్యం పెరిగేలా నిరంతరం పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహించాలని, సైన్స్, సైకాలజీ, ఐసిటి, వర్క్ ఎక్స్‌పీరియన్స్, భాషలకు ల్యాబ్ సౌకర్యం సమకూర్చాలని, డైట్‌లో ఇంగ్లీష్ మీడియం సెక్షన్ ఏర్పాటు చేయాలని, ఇంగ్లీష్ భాషపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సంస్థ నిర్వహణకు హాస్టల్స్, ల్యాబ్, లైబ్రరీ, నెట్, కరెంట్ వంటివాటికి బడ్జెట్ కేటాయించాలని మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లైబ్రరీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**కవిత**

## స్ఫూర్తిప్రదాత

**– ఎం.విజయకుమార్, ఎల్ఎన్ పల్లి**

ఓ మహామనీషీ... మా భారత రత్నమా!
బాలల మనస్సుల్లో విరసిన మరో చాచాజీ!
మా కలల కలాంజీ!
మీరు....
మానవత్వం మూర్తీభవించిన మానవతా వాదివి
విజ్ఞానపు విను వీధుల్లో విహరించిన మిస్సైల్ మనీషివి
విజ్ఞాన్ 2020ని వీక్షించిన స్వాప్నికుడవు
విద్యార్థుల గుండెల్లో అభివృద్ధి కాంక్షను రగిల్చిన
స్ఫూర్తిప్రదాతవు
కలలు కనడం నేర్పావు – సాకారామార్గాన్నీ చూపావు
అహర్నిశలు దేశంకై విశ్రమించక పరిశ్రమించావు
ఆదినుంచి అంతం వరకు సమస్త జీవితాన్ని
నిస్వార్థంగా, నిగర్వంగా, నిరాడంబరంగా
దేశ సేవకై దారబోశావు
ఆకాశపుటెల్లలు దాటిన మీ విజ్ఞానపుటిజయాలు
నలుపది డాక్టరేట్లు, అత్యున్నత రాష్ట్రపతి పీఠం
మీ వద్దకొచ్చి వన్నెలద్దుకున్నాయే గానీ
మీ నుండి నిరాడంబరత్వాన్ని, నిస్వార్థాన్నీ
వినయాన్నీ వీశ మాత్రమైనా తీసివేయలేక పోయాయి
ఇది మీ స్థితి ప్రజ్ఞతకు చిహ్నం
స్వచ్ఛమైన మీ మనస్సుకు అద్దం
మానవతను పరిమలింపజేసే మీ నవ్వును
ఆత్మీయతను పంచే మీ చల్లని కరచాలనాన్నీ
ఎలా మరచి పోగలం?
జీవిత తీరందాటి భౌతికంగా మా నుండి దూరమైనా
మా ప్రతి కణంలో, ప్రతి అణువులో...
అత్యున్నత భారతావనికై కలలుగనే
ప్రతి భారతీయుని కలలో
నీవు నిరంతరం జీవిస్తున్నావు...
..... జీవిస్తూనే వుంటావు

జైహింద్

**SMS Alert**

**చందాదారులకు విజ్ఞప్తి :** ఐక్యఉపాధ్యాయ పత్రిక చందాదారులుగా వున్న వారు మీ చందా నంబర్, పేరు, జిల్లా, ఫోన్ నెంబర్ పోస్టుకార్డు / ఇ–మెయిల్ ద్వారా పంపగలరు. ప్రతి నెల పత్రిక 11,12 తేదీలలో పోస్టు అవుతుంది. వెంటనే మీకు మెసేజ్ ఆటో జనరేట్ అయి మీ మొబైల్‌కి మెసేజ్ వస్తుంది. పైన తెలిపిన వివరాలతో పాటు ఒక సంవత్సరం / 5 సం॥ / 10 సం॥ / ఏజెన్సీ ఏదనే వివరం కూడా తెలుపగలరు. **– సంపాదకవర్గం**




# మున్సిపల్ పాఠశాలల్లో సంస్కరణలపై చర్చించాలి

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో 2015 జులై 11న విజయవాడలో మున్సిపల్ పట్టణ / నగర శాఖల కార్యకర్తల సమావేశం జరిగింది. 13 జిల్లాలలోని అన్ని మున్సిపల్ మరియు కార్పొరేషన్‌ల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో ప్రభుత్వ విద్యా విధానం అమలు చేయాలి తప్ప కార్పొరేట్ జోక్యాన్ని అంగీకరించం అని అన్నారు. కార్పొరేట్ వారిచ్చే శిక్షణా తరగతులు బహిష్కరించి నందుకు అభినందనలు తెలిపారు. మున్సిపల్ శాఖామంత్రి సంస్కరణల పేరుతో పాఠశాలల్లో బోధనా విధానాలు, పరీక్షా విధానాలు మార్చేయడం, ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు.

యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి యుటియఫ్ ఎంతో కృషి చేసిందన్నారు. త్వరలో జిపిఎఫ్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. పట్టణాల్లో పెరిగిన జనాభాకనుగుణంగా పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. 45వేలమందికి ఒక్క ఉన్నత పాఠశాల మాత్రమే ఉందని పట్టణ శివారు ప్రాంతాల్లో పిల్లలకి అందుబాటులో పాఠశాలలు లేవన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతినెలా ప్రమోషన్స్ ఇవ్వాలి, కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు జరపాలన్నారు. మున్సిపల్ టీచర్ల సర్వీస్ రూల్స్ ప్రకటించాలి, పాఠశాలల్లో సంస్కరణలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు.

- నూతన పిఆర్‌సి అమలు కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకి సమావేశం మద్దతు ప్రకటించింది.
- ఎంఆర్‌ఓ వనజాక్షితో పాటు అధికారులు, ఉద్యోగుల, ఉపాధ్యాయుల మీద అధికార పార్టీవారు చేస్తున్న దాడులను ఖండించారు. అందుకు బాధ్యులైన వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటి వరకు సాధించుకున్నవన్ని ఉపాధ్యాయ ఉద్యమాల ద్వారా తప్ప దయదాక్షిణ్యాలపై కాదన్నారు. ఇటీవల కొందరు సంఘాలను వ్యతిరేకించి, కార్పొరేట్ శక్తులకు వంతపాడడం గర్హనీయమన్నారు.

రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి మరియు 13 జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరలో పోరాట కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు.

## తీర్మానాలు

1. మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ప్రకటించాలి.
2. జిపిఎఫ్ మరియు ఎల్‌టిసి సౌకర్యం కల్పించాలి.
3. మున్సిపల్ పాఠశాలల్లో ఇతర పాఠశాలల్లోవలె స్టాఫ్‌ప్యాట్రన్ ప్రకారం పోస్టులు మంజూరు చేయాలి.
4. ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలి. జిఓ 40; తేది.07.05.2002 అనుగుణంగా వారికి అధికారాలు బదలాయించాలి.
5. ఉన్నత పాఠశాలల్లో అన్ని స్కూలు అసిస్టెంట్ స్థాయి పోస్టులే ఉండాలి. ఇప్పటికే ఉన్న ఎస్‌జిటి, పండిట్, పిఇటి, పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి.
6. అన్ని మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులు మంజూరు చేసి అర్హతగల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలి. కార్పొరేషన్‌లలో డిపైఇఓ పోస్టులు మంజూరు చేయాలి.
7. 01.04.2009 ముందున్న అన్ని రకాల అరియర్స్ చెల్లించాలి.
8. విజయవాడ, విశాఖ నగర పరిధిలోని ఉపాధ్యాయులకు ఏపిజిఎల్‌ఐ సౌకర్యం కల్పించాలి. నోషనల్ ఇంక్రిమెంట్లు అరియర్స్ చెల్లించాలి.
9. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నెలవారీ ప్రమోషన్‌లు ఇవ్వాలి.
10. విద్యాశాఖలో వలె ప్రతి సంవత్సరం షెడ్యూల్ ప్రకటించి కౌన్సిలింగ్ ద్వారానే బదిలీలు జరిపేందుకు స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలి.
11. ఇహెచ్‌ఎస్ వెబ్‌సైట్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల డిసిగ్నేషన్స్ పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలి.
12. మధ్యాహ్న భోజన పథకం ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వరాదు.

**పాఠశాలల సమస్యలు :**

1. మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ జోక్యం ఉండరాదు.
2. పాఠశాలల్లో ఎస్‌సిఇఆర్‌టి ఉత్తర్వుల మేరకు బోధనా మరియు పరీక్షా విధానాలు అమలు చేయాలి.
3. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలి.
4. ఉన్నత పాఠశాలల్లో లైబ్రరీ మరియు లాబొరేటరీ సౌకర్యం కల్పించాలి.
5. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా టాయిలెట్స్ నిర్మించాలి. అన్ని మౌలిక వసతులు కల్పించాలి.
6. పాఠశాలల విద్యార్థుల సంఖ్యకనుగుణంగా తరగతి గదులను నిర్మించాలి.
7. కంప్యూటర్ ఫ్యాకల్టిని నియమించాలి.
8. బోధనేతర సిబ్బందిని నియమించాలి.
9. ప్రతి పాఠశాలకి వాచ్‌మెన్ నియమించాలి.

**కథలు, కవితల పోటీలలో ప్రచురణకి ఎంపికైన కథ**

# ది ఎకనమిస్ట్

**సిహెచ్ సతీష్ మోహన్ రాజా,** ఓజిలి (మం), నెల్లూరు జిల్లా

రైల్వేస్టేషన్లో దిగి బయటకు నడిచాను. టౌన్ బస్సులు ఆగే స్టాండు కేసి నడక సాగించాను.

"బాబూ వేదాయపాళెం వెళ్ళాలంటే ఏ బస్సు ఎక్కాలి?" నా మిత్రుడు సుధాకర్ ఫోనులో పదిసార్లు క్లియర్‌గా చెప్పినా కన్‌ఫార్మ్ చేసుకునే దానికి ప్రక్కనే నిలబడిన వ్యక్తిని అడిగాను.

"ఈ ఆగి ఉన్న ఐదు బస్సులలో ఏది ఎక్కినా వెళ్తుంది సార్. ... అయినా ఆటోలో వెళ్లడం మంచిది. ఈ టౌన్ బస్సులను నమ్ముకుంటే మీరు వెళ్లినట్లే!" నవ్వుతూ చెప్పాడు.

"అమ్మో ఆటోనా.....! ఇంకేమైనా ఉందా! నా బడ్జెట్‌లో ఆటోలకు, ఆడంబరాలకు పద్దులేదు. ఎంతసేపైనా సరే ఇక్కడే ఉండి మొదట వెళ్లే బస్సులోనే వెళ్లాలని నిర్ణయించుకున్నాను. నెమ్మదిగా నడచివెళ్లి ముందర ఉండే బస్సును ఎక్కాను. నలుగురైదుగురు తప్ప ఎక్కువమంది బస్సులో ఎక్కిలేరు. చాలామంది స్టాండులోనే నిలబడిఉన్నారు. ఏ బస్సు ముందర వెళ్తే దాన్లో వెళుదాం అని...

"ఛా.... వీడు ఎంత చెప్పినా వినిపించుకోడు. నాకు వచ్చే తీరిక లేదురా అన్నా వినిపించుకోడు. చాలాసార్లు ఫోన్లు చేసి, తప్పక రావాలని పట్టుబట్టాడు. జీవితంలో తాను ఏదైనా సాధించానంటే ఇదేనని, బాల్య మిత్రుడైన నేను రాకపోతే అసలు ఊరుకొనేది లేదని ఖరాఖండిగా చెప్పేశాడు. రావడం నాకు ఇష్టం లేకపోయినా, ఏదో మొహమాటానికి రావలసి వస్తుంది. హైదరాబాద్ నుండి నెల్లూరుకు రావాలంటే మాటలా... కనీసం వెయ్యిరూపాయల ఖర్చు అవుతుంది. అందులో రిజర్వేషన్ దొరకక జనరల్ కంపార్టుమెంట్‌లో వచ్చేప్పటికి ప్రాణం ఉసూరుమంది. ఇక్కడ రెండు రోజులకంటే



ఎక్కువ ఉండకూడదని పించింది. ఒకవేళ మొహమాటపడితే ఇంకొక్క పూటకంటే ఎక్కువ ఉండకూడదని పించింది అయ్యే ఖర్చును ఆలోచించి. నేనేం పిసినారిని కాను. ముప్పై ఆరేళ్ల జీవితకాలం నాకు పొదుపు విలువను నేర్పింది. నేనెంత పొదుపు మనిషినో, మా ఆవిడ అంత దుబారా మనిషి. ఉన్నప్పుడు తినాలండీ... రేపనేది మనకు ఉంటుందో లేదో.... మనం సంపాదించేటప్పుడు, మనం తృప్తిగా ఉండకపోతే ఎందుకు చెప్పండి. "ఈ రోజు ఈ రోజే రేపటి సంగతి రేపు ఆలోచిద్దాం" అంటూ నాకు క్లాసు తీసుకుంటుంది. ఆర్థిక శాస్త్రంలో పట్టా పొందిన నా ముందు చివరకు నా ఎదురుదాడి వాదనలో ఓడిపోయి తలొంచుకుంటుంది. అలా పొదుపు చేయబట్టే భాగ్యనగరంలో ఓ సొంత ఇల్లు, లకార బ్యాంకు బ్యాలెన్సు మెయింటెయిన్ చేయగల్గుతున్నాను.

పెద్ద కుదుపుతో బస్సు కదలడంతో తటుక్కున ఈ లోకంలోకొచ్చా. షర్ట్ వెనుక జేబులో వున్న కరెన్సీ నోట్లను తృప్తిగా చూసుకుని, ముందర జేబులో ఉన్న చిల్లర ఇచ్చి టిక్కెట్టు తీసుకున్నాను. భాగ్యనగరానికి, సింహపురికి చాలా తేడా వుంది... బస్సుల విషయంలో ... అక్కడ బస్సులు ఆపరు, ప్రయాణీకులను ఆహ్వానిస్తుంటారు. కానీ ఇక్కడ కండక్టరు, డ్రైవరూ కలసి ప్రయాణీకులను ఆహ్వానిస్తుంటారు. బస్సు వేగంగానే వెళ్లినా, ఒక్కో స్టేజీలో పది నిముషాలకుపైనే నిలబెట్టి, బయటి ప్రయాణీకులను సాదరంగా ఆహ్వానిస్తూ, లోపలి ప్రయాణీకుల సహనానికి పరీక్ష పెడ్తున్నారు.

నా స్టేజ్ రాగానే కండక్టర్ గుర్తు చేశాడు "సార్...ఇదే వేదాయపాలెం అంటూ, ఆటోవాడు కూడా ఇంత గౌరవంగా సర్వీస్ చేయడు, అనుకుంటూ తృప్తిగా దిగాను. ఇంకోసారి కరెన్సీ నోట్లను తడుము కుంటూ, సుధాకర్ చెప్పిన అడ్రస్‌ను బట్టి ఇల్లు కనుక్కోవడం పెద్ద కష్టమనిపించలేదు.

చాలా పెద్ద స్థలం... అయితే రెండు గదుల ఇల్లు. ఇంటిముందు పొందికగా, అందంగా పెంచబడిన చెట్లు, వాడి కళాత్మక దృష్టిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. తలుపు దగ్గరకు వేసుంది... నెమ్మదిగా తట్టా, లోపల నుండి ... ఒకావిడ వచ్చింది... బహుశా సుధాకర్ భార్య అనుకుంటాను... చక్కగా... కుందనపు బొమ్మలా ఉంది.

"సుధాకర్ ఉన్నాడాండీ"...? ఎడమ చేతిలో ఉన్న బ్యాగు కుడిచేతికి మార్చుకుంటూ అడిగాను.

"మీ...రు" తడబడుతూ అడిగింది.

"నా పేరు రవి. సుధాకర్ ఫ్రెండ్‌ని" పరిచయం చేసుకుంటూ చెప్పాను. "మీరా... అన్నయ్య రండిరండి... వారు బయటకు వెళ్ళారు". సాదరంగా నవ్వుతూ ఆహ్వానించింది. ఆ నవ్వు తెచ్చిపెట్టుకున్న కృత్రిమ నవ్వులా లేదు. కల్మషరహితంగా, ఆత్మీయతగా ఉంది. లోపలికి వెళ్ళాను. కుండలో నుండి చల్లటి మంచినీళు తెచ్చిచ్చింది, తృప్తిగా రెండు గ్లాసులు త్రాగాను. ఈ లోపలే స్నానానికి నీళ్ళు.... వాణ్ణి రానీమ్మా అన్నా వినలేదు. వేడివేడి నీళ్లు నా ప్రయాణ బడలికను చిటికెలో తీసేశాయి. గీజర్ నీటికి కుండలో కాచిన నీటికి ఎంతతేడా... అదో రకమైన వాసన మనసుకి శరీరానికి హాయిగా ఉంది. పంచె కట్టుకొని వచ్చే లోపలే వేడివేడి ఉప్మాతో రడీగా ఉంది. పైకి కూడా వద్దని చెప్పలేక పోయాను. అద్భుతంగా ఉంది. వేడివేడి కాఫీ తాగాను.

ఈ లోపలే వచ్చాడు సుధాకర్... అదేరూపం, కాస్త సన్నబడ్డాడు. ఎప్పుడూ చెరగని చిరునవ్వు, బాగా పెరిగిన గడ్డం, ఒకటే మార్పు కళ్లకు అద్దాలు తగిలించాడు.

"రూపా... కిరాణాకొట్టు వాడికి రేపు ఇస్తానని చెప్పాను... సరే అన్నాడు. నీవు సరుకుల లిస్టు ఇస్తే వెళ్ళి తెస్తాను"... నన్ను చూడ కుండానే లోపలికొస్తూ అన్నాడు. లోపలికొచ్చి నన్ను చూడగానే ఎగిరి గంతేసినంత పనిచేశాడు.

"ఏరా...! ఇన్నాళ్లకు గుర్తొచ్చానా, సంవత్సరానికి ఒక్కసారైనా రావచ్చు కదా! స్నానం చేశావా...! రూపా... కాఫీ అయినా ఇచ్చావా"? పెద్ద హడావిడి చేశాడు.

'అంతా అయింది లేరా..., చెల్లెమ్మ అంతా ఏర్పాటు చేసింది". నవ్వుతూ చెప్పాను.

"రూపా.... కాకరకాయవేపుడు, అల్లం పచ్చడి చెయ్యి.... వీడికి చాలా ఇష్టం". కేకవేస్తూ చెప్పాడు.

"మీరు చెప్పాలా... అన్నయ్య వస్తారని, నిన్నే కాకరకాయలు, అల్లం

తెచ్చారుగా" నవ్వుతూ చెప్పింది. చాలా ఆనందమేసింది.

"ఏం సుధా అర్జంటుగా రమ్మని ఫోన్ల మీద ఫోన్లు... ఏం సంగతి?" నవ్వుతూ అడిగాను.

"ఏం లేదురా... ఈ రోజు సాయంత్రం టౌనుహాలులో రాష్ట్రస్థాయి చిత్రకళా ప్రదర్శనం.... సాంస్కృతిక వ్యవహారాల శాఖామంత్రి కూడా వస్తున్నారు. అందులో నా చిత్రాలు కూడా ఉన్నాయి. అందుకే నిన్ను పిలిచాను" చెప్పాడు.

'ఇంత చిన్న విషయానికి నన్ను ఇంతదూరం పిలిపించాలా..., ఎంత ఖర్చు ఎంత టైం వేస్టు" మనసులోనే విసుక్కున్నాను.

"నువ్వు భోంచేసి రెస్టు తీసుకో నేను వెళ్ళేటప్పుడు నిన్ను లేపుతాను" చెప్పాడు. 'సుధా ఈ ఇల్లెప్పుడు కొన్నావు..., పెళ్ళి ఎప్పుడు చేసుకున్నావు" అడిగాను.

'ఇల్లా...! భలేవాడివే.... కొన్నానంటే ఇంటి ఓనర్ తంతాడు... పెళ్లయితే నేను చేసుకోలేదు" చెప్పాడు.

'మరి రూపా...! ఆశ్చర్యంగా అడిగాను.

"నా భార్య.... నేను చేసుకోలేదని చెప్పానుగాని ఆవిడ నన్ను చేసుకోలేదని చెప్పలేదుగా..., లవ్ మ్యారేజ్" నవ్వుతూ చెప్పాడు. నేనూ పెద్దగా నవ్వేశాను.

మధ్యాహ్నం భార్యాభర్తలిద్దరూ కొసరి, కొసరి వడ్డించారు. తినలేక తినలేక తిన్నాను. హాయిగా నిద్ర పట్టేసింది. భాగ్యనగరిలో అయితే ఎయిర్‌కూలర్ పెట్టుకున్నా, ఇంత హాయిగా నిద్రపట్టదేమో! సాయంత్రం నాలుగు గంటలకు మెళకువ వచ్చింది. ఏదో పగిలిన చప్పుడికి మగతగానే పరిస్థితిని గమనించాను. హుండీ కాబోలు... చిల్లర గలగలలు వినిపిస్తోంది. ఒక్క క్షణం భయంవేసింది. వాడి ఆర్థిక పరిస్థితి తలచుకుని ఎక్కడ డబ్బు అడుగుతాడో, వాడికి లేదని ఎలా సమాధానం చెప్పాలో అని, అయినా ఎలా సమాధానం చెప్పాలో కూడా ప్రిపేరయ్యాను. ఎంతయినా ఎకనమిక్స్ చదివిన వ్యక్తిని కదా! ఆ మాత్రం జాలి, సెంటిమెంట్ చూపకపోతేనే నామటుకు నేను హాయిగా బతక కలను. నా రీజనింగ్‌కు నేనే మురిసిపోయాను.

మళ్ళీ వేడినీటి స్నానం... వేడివేడి పకోడా... చక్కని, చిక్కని ఫిల్టర్ కాఫీ. ఆ కార్యక్రమాల తర్వాత నేను, సుధా, రూపా ముగ్గురం ఆటోలో బయలుదేరాం. ఐదు గంటలకల్లా టౌను హాలుకు చేరుకున్నాము. మొహమాటానికి ఆటోకి డబ్బులు ఇవ్వబోయినా, సుధాకర్ వారించాడు. రూపా డబ్బులిచ్చింది. ఇచ్చేటప్పుడు గమనించాను... ఉదయం ఒకే ఒక బంగారు గాజుతో ఉన్న రూపా చేతులు ఇప్పుడు మట్టి గాజులతో తళతళలాడుతున్నాయి. "వీడెప్పుడు అనవసర ఖర్చులు తగ్గించు కుంటాడో- అప్పుడే బాగుపడతాడని" మనసులో అనుకున్నాను.

సుధా తను గీచిన ఒక్కొక్క చిత్రమే నాకు చూపిస్తున్నాడు. అన్నీ అద్భుతంగానే ఉన్నాయి. శ్రమైకజీవన సౌందర్యం, ప్రకృతి ఆరాధన, మొదలైనవి ఇతి వృత్తంగా ఎన్నుకున్నాడు. అన్నీ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

ఒక చిత్రం దగ్గర ఆగిపోయాను. ఎవరో ఓ వ్యక్తి ఒక చెట్టును నరకడానికి సంసిద్ధమవుతూ ఉంటే... ఆ చెట్టు తనను ఏమ చేయవద్దని దీనంగా ప్రార్థిస్తుంది. ఆ సన్నివేశం అలానే హృదయాన్ని కట్టిపడేస్తుంది. దానికి "వృక్షవిలాపం" అని పేరు పెట్టాడు. తదేకంగా ఆ చిత్రాన్నే చూస్తూ ఎంతసేపు ఆగానో నాకే తెలీలేదు. సుధాకర్ వచ్చి నన్ను మాట్లాడించేదాకా ఈ లోకంలోకి రాలేకపోయాను.

"బాగుందా...!" అడిగాడు.

"చాలా బాగుంది... కలర్ కాంబినేషన్ భావానికి తగ్గట్టుగా ఉంది. ఎక్సలెంట్" గుండె లోతుల్లోంచి చెప్పాను.

"ఈ బొమ్మ గీయడానికి ఎన్ని నిద్రలు లేని రాత్రులు గడిపానో...! దీనికి ఒక్కదానికే మూడువేలు ఖర్చయింది... రూపా కమ్మలు అమ్మేశాను" ఆఖరి మాట నెమ్మదిగా చెప్పాడు. రూపా వైపు జాలిగా చూశాను. సమయం అంతా అలానే గడచిపోయింది. మంత్రిగారు రావడమూ ప్రతి చిత్రపటం చూడడమూ 'వృక్షవిలాపం' వద్ద ఎక్కువ సేపు గడపడమూ, అందరూ ఆ చిత్రాన్నే మెచ్చుకుంటున్న విషయం నాకు తెలుస్తూనే ఉంది. "వృక్షవిలాపం ఖరీదు రూ.4500/-అని ఆ చిత్రపటం మీద ధర రాసుంది. వీడు వేసిన చిన్న చిన్న చిత్రాలన్నీ దాదాపు అమ్ముడుపోయాయి. దాన్నిమటుకు ఎవరూ కొనడం లేదు. నాకు చాలా విచిత్రమనిపించింది. ఇంతలో ఎవరో వ్యక్తి మమ్మల్ని సమీపించాడు.

"సార్.... ఇక్కడ సుధాకర్ గారంటే" నన్నూ, వాణ్ణీ చూస్తూ అడిగాడు.

"నేనే"... సమాధానమిచ్చాడు సుధాకర్.

"సార్ మీరు వేసిన "వృక్షవిలాపం" చాలా బాగుంది. కొందామని అడిగితే మీరే అమ్మవద్దని చెప్పారట గదా...! పదివేలైనా సరే నేను రెడీసార్" చిన్నగా చెప్పాడతను.

'సారీ...సర్...వేరే వ్యక్తి దానిని రిజర్వ్ చేసుకున్నాడు".

"పర్లేదు అతని అడ్రస్ ఇవ్వండి అతన్ని నేను ఒప్పించుకుంటాను" స్థిరంగా చెప్పాడతను.

"సారీ.... అది ఇచ్చేశాను సార్... మీరేం అనుకోవద్దు, ప్లీజ్" రిక్వెస్టింగ్‌గా చెప్పాడు సుధాకర్. అతను బాధగా వెళ్లిపోయాడు'. చిన్నా చితక చిత్రాలు అమ్మడం వలన సుధాకి ఎనిమిది వేలదాకా వచ్చింది. రాత్రి పన్నెండు తర్వాత ముగ్గురం ఆటోలో ఇంటికెళ్లాం.

రూపా అన్నం కలిపి చేతిలో పెడ్తుంటే ఇద్దరం ఆరుబయట వెన్నెలలో కూర్చుని వేడివేడి భోజనాన్ని ప్రకృతిని ఆస్వాదిస్తూ తిన్నాం. పక్కరోజు వెళ్తానన్నాను. ఇద్దరూ ఒప్పుకోలేదు. వారం రోజులు ఉండమన్నారు. వీల్లేదని చెప్పాను. మొత్తం మూడు రోజులున్నాను. ఆ మూడు రోజులు మూడు క్షణాల్లో హాయిగా గడచిపోయాయి.

ఆ రోజు సాయంత్రం బయలుదేరేముందు రూపాకి ఒక మంచి చీర, వాడికి ఇంపోర్టెడ్ కలర్స్‌సెట్ తీసిచ్చాను. వెయ్యిరూపాయలదాకా ఖర్చైంది. వారు చూపిన ఆదరణకి...ఇలా బ్యాలెన్స్‌చేసి సమతౌల్య సిద్ధాంతాన్ని అప్లయి చేశాను.

ఆ రోజు సాయంత్రం వద్దువద్దన్నా ఇద్దరూ స్టేషన్‌దాకా వచ్చారు. రైలు టిక్కెట్ వాడే తీసిచ్చాడు. రైలు బయల్దేరటానికి ఇంకా పది నిముషాలు ఉందనగా అప్పుడు ఇచ్చాడు సుధా "వృక్షవిలాపాన్ని". స్నేహానికి గుర్తుగా.

"ఏరా... ఎవరినో రిజర్వ్ చేశానన్నావు. నాకిస్తున్నావేం... అయినా ఆ రోజు ఆ వ్యక్తికి ఇచ్చుంటే పదివేలు వచ్చుండేదిగా... నీకు ఎలా సంపాదించాలో ఇంకా తెలీయదురా...! తెలుసుంటే చెల్లెమ్మ కమ్మలు, గాజులు అమ్మేవాడివి కాదు" బాధగా చెప్పాను.

"ఒరే...రవి. డబ్బు ఈ రోజుంటుంది, రేపు పోతుంది... కాని ఆత్మీయత, స్నేహం, ప్రేమ అనేవి ఈ లోకంలో విలువ కట్టలేనివిరా? కమ్మలు, గాజులు పోయాయని రూపా ఎప్పుడూ బాధ పడలేదు. పైగా ఆ రోజు నీవు ఈ చిత్రాన్ని చూస్తూ శిలలా అయిపోతే, నీకు ఇమ్మని సలహా ఇచ్చింది కూడా తనే. నీవు వచ్చావు, నాకు అదే పదివేలు" చెప్పాడు.

రైలు కదులుతుంది. నా ఎకనమిక్స్ ఘోరంగా ఓడిపోయింది. ఆత్మీయతముందు, ఇద్దరూ టాటా చెప్తున్నారు. నా కళ్లల్లో నీరు, నా చెయ్యి ఒకేలా కదులుతున్నాయి. టాటా చెప్తూ...!

# సదస్సులు - సమావేశాలు

## తూర్పుగోదావరి జిల్లా

### ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి - ఆర్ఎస్ఆర్



**మలికిపురం :** మలికిపురం మండలం లక్కవరంలో జరిగిన సమావేశంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు ప్రసంగిస్తూ ప్రతి మనిషి అనవసర ఖర్చులు మాని పేదవాని విద్యకు ఉపయోగపడేలా నిర్ణయం తీసుకుంటే సమాజానికి మేలు చేకూరుతుందన్నారు. ఉచిత విద్యను అమలు చేస్తూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తాను పనిచేస్తున్నానన్నారు. రెండు జిల్లాల్లోను ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నదే తన ఆశయమని ఏ పనైనా చేయాలంటే అసాధ్యమనేది ఉండదని, చిత్తశుద్ధి ఉంటే ఏదైనా చేయవచ్చునన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో యూనిఫాంలు పంపిణీ చేసేలా తాను కృషి చేశానని, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పదోన్నతి విషయంలో కృషి చేసినట్లు తెలిపారు. రాజకీయ బదిలీలు తదితర వాటిపై తాము నిరసన వ్యక్తం చేయడం తోనే ఉపాధ్యాయ బదిలీలు కౌన్సిలింగ్ ద్వారా చేయుటకు ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ప్రభుత్వం కంప్యూటర్ టీచర్స్‌ను తొలగించడంతో 12,600మంది ఉపాధి కోల్పోయారని, పేద విద్యార్థి కంప్యూటర్ విద్యకు దూరమైనట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వం కొత్తగా చేపట్టే ప్రాజెక్టులో తొలగించిన కంప్యూటర్ ఉపాధ్యాయులను నియమించేలా తాను కృషి చేస్తున్నట్టు తెలిపారు. పలువురు కంప్యూటర్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీకి వినత పత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ సూర్యారావు మలికిపురం మండలం లోని పలు హైస్కూల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో బేతినీడి శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, శ్రీరామాంజనేయులు, కడిమి సత్యనారాయణ సుబ్రహ్మణ్యం, జి.మురళీకృష్ణ, హేమ సుజాత పాల్గొన్నారు.

### అన్ని విద్యాలయాలకు పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించాలి



**మామిడికుదురు :** అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లోనూ విద్యార్థులకు అవసరమైన పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించే అంశాన్ని తాను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఎమ్మెల్సీ రాము సూర్యారావు తెలిపారు. దీనికి అవసరమైతే స్వచ్ఛంద సంఘాల నుంచి కూడా సహకారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. కృతజ్ఞతా పర్యటనలో భాగంగా ఆయన మండలంలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జులై 29న పర్యటించి ఉపాధ్యాయులను కలుసుకున్నారు. వారి నుంచి వ్యక్తమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

అనంతరం ఐక్యోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. క్లస్టర్ విధానాన్ని నిలుపుదలకు తాము చేసిన కృషి ఫలించిందన్నారు. 730మంది ఉపాధ్యాయుల రాజకీయ బదిలీలను నిలుపుదల చేయించి కౌన్సిలింగ్ ప్రకారం జరిగేలా కార్యచరణ చేశామని వివరించారు. ఒప్పంద ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాల్సిన అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పండిట్, పీఈటీల పదోన్నతులపై కృషి చేస్తున్నట్లు తెలిపారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎంఈఓ పీవీవీ సత్యనారాయణ, యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, మండలశాఖ నాయకులు సూర్యారావు వెంట ఉన్నారు.

## విజయనగరం జిల్లా

### కార్పొరేట్ సంస్థలను నియంత్రించాలి

విజయనగరం అంజనీ ఫంక్షన్ హాలులో యుటియఫ్ ఆధ్వర్యంలో "విద్యా రంగం అభివృద్ధి - అవకాశాలు" అనే అంశంపై ఆగస్టు 2న సదస్సు జరిగింది. సదస్సు ప్రారంభంలో దివంగత అబ్దుల్ కలాంకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో విద్యాభివృద్ధికి గల అవకాశాలను - ఆటంకాలను చర్చించారు. ప్రధానంగా ప్రాథమిక విద్య ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘంగా సమస్యల పరిష్కారానికి ఆందోళనలే కాకుండా సామాజిక లక్ష్యంతో విద్యాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సర్వేలు, సదస్సులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యా పరిరక్షణ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సాలూరు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ వెంకట్రావు మాట్లాడుతూ అక్షరాస్యత పెంపులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు.

యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో 2872 పాఠశాలలను స్వయంగా యుటియఫ్ క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, యుటియఫ్‌గా దత్తత తీసుకున్న పాఠశాలల వివరాలను విడుదల చేశారు. అనంతరం 10వ తరగతి పాఠ్యపుస్తకాల "ఎలా బోధించాలి" అనే సిడిలను ఆవిష్కరించారు. ప్రాథమిక పాఠశాలల బోధనకు సంబంధించిన "పదజాలాభివృద్ధి" పుస్తకావిష్కరణ చేశారు. (ఎస్.సింహాచలం, ఎస్‌జిటి, బోరబొంద, సాలూరు (మం) తయారుచేశారు.)

జిల్లాలోని 13 మండలాల్లో ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో 100% రిజల్టు సాధించిన పాఠశాలలు, ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన వారికి, 9.7 నుండి 10/10 పాయింట్లు సాధించిన పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 4 మండలాల మండల విద్యాశాఖాధికారులు కె.ప్రసాద్, మల్లేశ్వరరావు, సూర్యనారాయణ, ఎన్.వెంకటరావులు విద్యారంగ పరిస్థితుల గురించి మాట్లాడారు. 13 మండలాల యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దత్తత తీసుకునే పాఠశాలలను ప్రకటించి మాట్లాడారు.

## విశాఖ జిల్లా

### మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి - రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు

**విశాఖపట్నం:** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటియఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల విద్యాసదస్సు ఆగస్టు 1న పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విశాఖ జివిఎంసిలో పనిచేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు విడుదల చేయాలని, సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇటీవల ఆర్థిక, ట్రెజరీ అధికారులు జెఏసితో జరిపిన చర్చల్లో భాగంగా ఆర్థికశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్ర, ట్రెజరీ డైరెక్టర్లకు విశాఖ, కర్నూలు కార్పొరేషన్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మున్సిపల్ డైరెక్టరేట్ నుండి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. సర్వీస్ రూల్స్‌పై తక్షణం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విడుదల చేయాలని అన్నారు.

ఏప్రిల్ 2013కు ముందు ఉన్నటువంటి వివిధ రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉత్తర్వులు 84 ప్రకారం 2,3,4 క్వార్టర్ల బడ్జెట్ ఒకేసారి విడుదలచేసి చెల్లించుటకు ఆర్థికశాఖ వెంటనే ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండవ క్వార్టర్‌కు సరిపడా బడ్జెట్ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 2009 ఏప్రిల్ నుంచి ఆరేళ్లగా ఉన్న బకాయిలు సుమారు రూ.2 కోట్లు అరియర్స్‌ను తక్షణమే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రమంతటా పిఆర్‌సి అరియర్ బిల్లులు ఆమోదిస్తుంటే విశాఖ పట్నంలో మాత్రం పాస్ చేయకపోవడాన్ని ఖండించారు.

ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. డిఎస్‌సి-2008 హామీ పత్రాల ఉపాధ్యాయులకు వేతన రక్షణ కల్పించాలని, వారి బిల్లులను అన్ని ఉపఖజానాల్లో ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కెకె జాజులు, వైఏఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

### బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలి

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్‌చేశారు. యుటియఫ్ విశాఖపట్నం జిల్లా కార్యవర్గ సమావేశం కె.కె.జాజులు అధ్యక్షతన జరిగింది.

ఐ.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వం వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు యిస్తామని చెప్పి, నేటివరకు షెడ్యూల్ ప్రకటించకపోవడం చాలా సిగ్గుచేటని అన్నారు.

సర్వీస్‌రూల్స్ రూపొందించి ఎంఇఓ, డివైఇఓ, జెఎల్స్, డైట్ లెక్చరర్స్ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి, పండిట్స్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి, డిఎస్‌సి నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. 2008 హామీ పత్రాల అభ్యర్థులకు వేతన రక్షణ కల్పించాలన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో నెలరోజులు పాటు ఉపాధ్యాయులకు శిక్షణా తరగతుల వలన విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని కాబట్టి టీచర్స్ ట్రైనింగ్‌లను వాయిదా వేయాలని రాష్ట్ర కార్యదర్శి డి.రాము డిమాండ్ చేశారు.

జిల్లా అధ్యక్షులు కెకె జాజులు మాట్లాడుతూ రాష్ట్ర మంతా పిఆర్‌సి తీసుకున్నప్పటికీ విశాఖ జిల్లాలో మాత్రం నూతన వేతనాలు చెల్లించకపోవడంపట్ల, ట్రెజరీ అధికారుల నిర్లక్ష్య వైఖరిని సమావేశం తీవ్రంగా ఖండించింది. వెంటనే పిఆర్‌సి అమలుచేసి నూతన వేతనాలు చెల్లించాలని ట్రెజరీ అధికారులను డిమాండ్ చేశారు.

జిల్లా ప్రధానకార్యదర్శి వైఏఆర్‌కె ప్రసాద్ జిల్లా కార్యకలాపాలను నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లాలో వివిధ కార్యాలయాల్లో పెండింగ్‌లో యున్న ఉపాధ్యాయులకు చెందిన వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వివిధ మండలాలకు చెందిన జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరైనారు.

### ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర



**రావికమతం :** ప్రపంచబ్యాంకు నుంచి తీసుకున్న ఋణాలు తీర్చడానికి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి, ప్రైవేట్‌పరం చేయాలనే కుట్ర జరుగుతోందని యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు ఆరోపించారు. యుటియఫ్ జిల్లా అధ్యక్షుడు కెకె జాజులుతో కలిపి జులై 29న రావికమతం మండలంలో ఆయన పలు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ విద్యార్థులు లేరని, తక్కువగా ఉంటున్నారనే నెపంతో నడుస్తున్న స్కూళ్లను మూసివేయాలని చూస్తోందని చెప్పారు. హేబిటేషన్లలోని ప్రభుత్వ పాఠశాలలు మూసి వేస్తే అంతిమంగా లాభపడేది ప్రైవేట్ స్కూళ్లేనని చెప్పారు. ప్రభుత్వం కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడిచి బదిలీలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈ విధానం వల్ల రాజకీయ వత్తిడి పెరిగి ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని చెప్పారు. తక్షణమే ఇటువంటి బదిలీల్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. యుటియఫ్ నాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఆర్.లోకేష్, పి.అప్పారావు, ఎస్.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లా

### అక్రమ బదిలీలు వెంటనే రద్దు చేయాలి

**ఎ.కొండూరు :** ఉపాధ్యాయుల బదిలీలు కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకతతో ప్రవేశ పెట్టిన ప్రభుత్వమే దొడ్డిదారిన సచివాలయం ద్వారా బదిలీల చేయడానికి సిద్ధం కావడాన్ని యుటియఫ్ తీవ్రంగా ఖండిస్తుందని ఎ.కొండూరు మండల యుటియఫ్ ప్రధానకార్యదర్శి బాణోతు సూర్య తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కంభంపాడులోని

యుటియఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో యుటియఫ్ నాయకులు మాట్లాడారు. ఉద్యోగ సంఘాలు కోరినట్లుగా సిఎఫ్ఎంఎస్ తో కాకుండా హెచ్ఆర్ఎంఎస్ (పాతపద్ధతి)తోనే వేతన సవరణ అమలుకు జిఓ నం.85ను ఆర్థికశాఖ జారీచేయడం, ఉన్నత పాఠశాలలు మరియు ప్రాథమికోన్నత పాఠశాలలనందు బోధనను 9 పీరియడ్ల నుండి 8 పీరియడ్లకు తగ్గించడం పట్ల హర్షం వ్యక్తపరచారు. కార్యక్రమంలో మండల యుటియఫ్ అధ్యక్షులు సిహెచ్‌వి సుబ్బారావు, యుటియఫ్ నాయకులు పి.శోభన్‌బాబు, బి.అర్జునరావు, జి.శ్రీనివాస రావు, జి.రామకృష్ణ, ఎల్.చంటి, పి.భవాని, బి.విశ్వభారతి, పి.లీల తదితరులు పాల్గొన్నారు.

### ఇఓ, జిఓ పరీక్షలపై అవగాహన తరగతులు

**నూజివీడు :** జులై 20,21 తేదీలలో నూజివీడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలనందు ఈఓ, జిఓ పరీక్షలపై యుటియఫ్ ఆధ్వర్యంలో అవగాహన తరగతులు నిర్వహించబడినాయి. జులై 20న ఈఓ పరీక్షపై రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, జిల్లా కోశాధికారి ఎ.కృష్ణ సుందరరావు తరగతులు నిర్వహించారు. జులై 21న జిఓ పరీక్షపై జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్, కోశాధికారి ఎ.కృష్ణ సుందర రావు తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. నూజివీడు మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవి, కె.గంగేయుడు మరియు పి. జగదీశ్వరరావు, పి.శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



### ఔట్‌సోర్సింగ్ కార్మికులకూ పిఆర్‌సి అమలు చేయాలి

**పామర్రు :** వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకూ పిఆర్‌సి అమలు చేయాలని ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పామర్రులో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమ్మెకు సంపూర్ణమద్దతు తెలిపారు. అనేక విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో తప్పని పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 77 పురపాలక, నగరపాలక సంస్థల్లోని కార్మికులంతా 13రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఈ సమ్మెకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం నుండి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. ముఖ్యమంత్రి కల్పించుకుని జిఓ నం.3ను పదో పిఆర్‌సిలో అమలు చేయటం ద్వారా రూ.15,432/-లు కనీస వేతనం చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన ఉన్న ఖాళీ పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసులను ప్రభుత్వ హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలన్నారు. 2013లో జరిగిన సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు పిఎఫ్ ఖాతాలు ప్రారంభిస్తామని హెల్త్‌కార్డులు మంజూరు చేస్తామని యిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లా**

### అక్రమ బదిలీలు వెంటనే రద్దు చేయాలి

**మాచర్ల :** టీచర్ల బదిలీలు కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన ఈ ప్రభుత్వమే దొడ్డిదారిన సెక్రటేరియట్ ద్వారా బదిలీలు చేయడానికి పూనుకోవడాన్ని యుటియఫ్ ఖండిస్తోంది. దీనికి నిరసనగా జులై 9న విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఆరుగురు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మరియు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు జరిపే నిరాహారదీక్షకు పెద్దఎత్తున టీచర్లు మద్దతు పలకాలని మాచర్లలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి షేక్ గాలిబ్‌సాహెబ్ పిలుపు నిచ్చారు.

ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య వెంటనే పరిష్కరించి ఎంఇఓ, డివైఇఓ, ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లు ఇవ్వాలని మాచర్ల శాఖ అధ్యక్షులు ఏ.నాసర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పిఆర్‌సి అమలుకు హెచ్ఆర్ఎంఎస్ ద్వారా అమలకు వెంటనే చర్యలు తీసుకోవాలని, హెల్త్‌కార్డులు అన్ని ఆసుపత్రుల్లో వెంటనే అమలు జరిగేలా ఉత్తర్వు లివ్వాలని మాచర్ల శాఖ ప్రధానకార్యదర్శి జెవికెఎస్ ప్రసాదు డిమాండ్ చేశారు. షేక్ నసీర్, ఇట్టా శ్రీను, మండవ రత్నప్రభ, పట్టాభిరామ రావు, టి.గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు యుటియఫ్ ఆధ్వర్యంలో శిక్షణ




యుటియఫ్ గుంటూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇఓ, జిఓ పరీక్షలపై అవగాహన కార్యక్రమం జులై 25,26 తేదీలలో గుంటూరులో నిర్వహించడం జరిగింది. ప్రారంభసభలో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ యుటియఫ్ ఉపాధ్యాయుల, ఉద్యోగులకు సంబంధించిన అన్ని రకాల సమస్యలను, విద్యాపరమైన, సామాజిక అంశాలను అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తుందని ఈ విషయంలో యుటియఫ్ మొదటి నుంచీ ముందంజలో ఉందని తెలిపారు.

రాష్ట్ర కోశాధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ గత మే నెలలో కూడా ఈ పరీక్షలపై శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందని, వారిలో ఎక్కువమంది ఉత్తీర్ణులు కావలం జరిగిందని, ఈ శిక్షణా కార్యక్రమాన్ని కూడా అభ్యర్థుల సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ శిక్షణకు రాష్ట్ర కోశాధికారి సంజీవరెడ్డి, కృష్ణాజిల్లా యుటియఫ్ అధ్యక్షులు మనోహర్ రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించారు. ముగింపు సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరయి రిసోర్స్‌పర్సన్‌లను అభినందించారు. యుటియఫ్ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అవసరమయ్యే డిపార్టుమెంట్ పరీక్షల గురించి యుటియఫ్ శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శి పిఐ పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, అధ్యాపక బదిలీల్లో కౌన్సిలింగ్ విధానం కొనసాగించాలి - పిడిఎఫ్




ఉపాధ్యాయుల, అధ్యాపకుల బదిలీలు కౌన్సిలింగ్ ద్వారా జరపాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి. బాలసుబ్రహ్మణ్యం, ఎంవి శర్మ, వై.శ్రీనివాసులురెడ్డి, బి.నాగేశ్వరరావు, డా॥ ఎం.గేయానంద్, ఆర్.సూర్యారావు మరియు మాజీ ఎమ్మెల్సీ కెవిఎస్ లక్ష్మణరావులు జులై 9వ తేదీన నిరాహారదీక్ష చేపట్టారు. ఎమ్మెల్సీ నిరాహారదీక్షల శిబిరాన్ని ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్. నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంలో నారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు పోరాడి కౌన్సిలింగ్ విధానాన్ని సాధించు కున్నారు. ఆ పోరాటంలో తెలుగు దేశం ప్రభుత్వం ముగ్గురు జెడ్‌పి చైర్మన్‌లను తొలగించాల్సి వచ్చిందని, ఆ తర్వాతేనే కౌన్సిలింగ్ జిఓ ఇచ్చారన్నారు. జిఓలు యిచ్చినవారే అందుకు విర్ధుంగా ప్రభుత్వ బదిలీలు చేయడం అక్రమం, వెంటనే రద్దు చేయాలన్నారు.

యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలన్ని కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని కోరుతుంటే ప్రభుత్వ అక్రమ బదిలీలకు తెరదీయడం ప్రజాస్వామికం అన్నారు. తమ రాజకీయ అవసరాల కోసం బదిలీలు చేస్తామనడం శోచనీయ మన్నారు. వెస్ట్ కృష్ణ జెఏసి చైర్మన్ సాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీల నిరాహారదీక్షలకు మద్ధతు తెలియజేశారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని కాపాడే కౌన్సిలింగ్ విధానం కొనసాగించాలని అన్నారు. రాష్ట్ర జెఏసి ఉపాధ్యక్షులు ఇక్బాల్, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.కృష్ణయ్య, పండిత పరిషత్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రవిచంద్ర, గిరిరాజ్ కుమార్, ఉపాధ్యాయవాణి పత్రిక సంపాదకులు అప్పారావు, జిజెఎల్ఏ జోనల్ అధ్యక్షులు శ్రీనివాస్, జిసిజిటిఏ నాయకులు నరేంద్రనాథ్, మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి బోసుబాబు, యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి మరియు రాష్ట్ర కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల నిరాహారదీక్షలకు మద్ధతుగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు అండగా పోరాడుతాం - పిడిఎఫ్**

అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాలు చేసే పోరాటానికి పూర్తి మద్ధతు తెలపడమేగాక, ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొంటామని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రకటించారు. ఇప్పుడు కౌన్సిలింగ్ విధానం కాపాడుకోకపోతే భవిష్యత్‌లో ఈ విధానమే రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. శాసనమండలిలో కూడా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వెంటనే ప్రభుత్వం అక్రమ బదిలీలు ఆపి, కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## అవకాశం ఇచ్చి చూడండి



మనది అసమానతల సమాజం డబ్బులు పలుకుబడి ఉన్న వారికే అన్ని అవకాశాలు. చివరకు పిల్లలు ఆడుకొనే ఆటల్లో కూడా ఈ వివక్షత కొనసాగుతూనే ఉంటుంది. ఇది ఈ సమాజపు లక్షణం.

అంతేగాదు ప్రతిదాన్ని వ్యాపారంచేసి డబ్బులు సంపాదించే మరో దుర్మార్గపు లక్షణం కూడా దీనికి ఉంది. పేరు ప్రఖ్యాతలు సంపాదించి గుర్తింపుపొందిన ఆటగాళ్లను, వ్యాపార సంస్థలు, తమ కంపెనీ ఉత్పత్తుల ప్రచారం కోసం "బ్రాండ్ అంబాసిడర్లు"గా నియమించుకొంటాయి. కోట్ల రూపాయలు ఆటగాళ్లకు చెల్లిస్తాయి. ఇంకేముంది ఆటగాళ్ల ఎంపికలో రాజకీయులు అధికారం, పలుకుబడి మోసం వంటివి ముందుకొస్తాయి. "నైపుణ్యం, శక్తి సామర్థ్యాలు" రెండో స్థానం లోకి వెళ్ళిపోతాయి. ఇదే ఇప్పుడు మనదేశ జాతీయ అంతర్జాతీయ ఆటగాళ్ల ఎంపికలో జరుగుతూ ఉంది.

అయినా అన్ని అవరోధాలు అధిగమించి కొండశిఖరం ఎక్కే సామాన్యులూ ఉంటారు. ఏకొద్ది అవకాశం ఇచ్చినా దాన్ని దొరక పుచ్చుకొని పట్టుదలతో పైకి ఎగబాకే పేద పిల్లలూ ఉంటారు.

ఇదిగో ఇలాంటి అమ్మాయే "ఇండియన్ ఉమెన్ క్రికెట్ వికెట్ కీపర్" కల్పన. కల్పన అతి సామాన్య పేద కుటుంబం నుండి వచ్చింది. జాతీయ క్రికెట్టు జట్టులో స్థానం సంపాదించింది. ఈ యేడాది జులై నెలలో న్యూజిలాండ్‌లో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడింది. అంతర్జాతీయ క్రీడాకారిణిగా రాణించింది.

కల్పన తల్లిదండ్రులది ప్రకాశం జిల్లా. బ్రతుకుదెరువు కోసం విజయవాడ వలసవచ్చారు. అప్పుడు ఆమె వయస్సు మూడేళ్లు. తండ్రి ముఠాకూలీగా, రిక్షా కార్మికుడిగా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

కల్పన విజయవాడలోని "బిషప్ అజరయ్య హైస్కూల్‌లో" ఏడవ తరగతి చదువుతున్నప్పుడు ఆమెకు క్రికెట్ మీద అభిమానం ఏర్పడింది. టీచర్లు ప్రోత్సహించారు. తల్లిదండ్రులు అడ్డు చెప్పలేదు. పేదరికంలో ఉన్నప్పటికీ అందరి తల్లిదండ్రుల్లా తమ బిడ్డ ఏ డాక్టరో ఇంజనీరో కావాలని కోరుకోలేదు. బిడ్డ ఇష్టానికేవదిలేశారు. పైపెచ్చు ప్రోత్సహించారు.

తండ్రి కష్టంచూసి కల్పన కూడా పూలుకుట్టడానికో, పొలం పనులకో వెళ్ళి డబ్బులు సంపాదించేది. అలా పనులకు వెళ్తూ కూడా క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూనే ఉండేది. "కూలీ పనులైనా, ఆటలైనా కష్టపడాల్సిందే తల్లీ" అన్న తండ్రి మాటలు ఆమెను కదిలించాయి. మరింత పట్టుదల పెరిగింది.

కల్పన జాతీయ క్రీడాకారిణిగా ఎదగడం ఒక్క రోజులో జరగలేదు. పదేళ్ల కఠోరసాధన చేసింది. ఉదయం 4 గంటలకు నిద్రలేచి క్రికెట్ కిట్ వేసుకొని సిటీబస్‌లో ప్రయాణం చేసి 5 గంటలకు క్రీడా మైదానం చేరి ప్రాక్టీసు ప్రారంభించేది. ఈ అలవాటు ఒక్క రోజు కూడా తప్పలేదు.

క్రికెట్ కోచ్‌లు కూడా ఆమెకు ఎంతో సహకరించారు. ఆటంకాలు వచ్చినప్పుడల్లా ధైర్యంచెప్పి నిలబడేటట్లు చేశారు.

తనలాంటి యువతీ యువకులకు కల్పన ఇచ్చే సందేశం ఒక్కటే స్వయం కృషితో పాటు పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలి.

పేదరికంలో ఉన్నా, సాధారణ పాఠశాలలో చదువుతున్నా అవకాశం ఇస్తే పిల్లలు తమ శక్తి సామర్థ్యాలు నిరూపించుకొంటారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు.

అట్టడుగు వర్గాల పిల్లల్లో ముఖ్యంగా గిరిజనుల పిల్లల్లో పోరాట పటిమ కొన్ని సహజనైపుణ్యాలు ఉంటాయి. పసితనం నుండి ప్రకృతితో ఉండడం, అనేక అవరోధాలు ఎదుర్కొంటూ ఎదగడం వలన వారికి కొన్ని మెళకువలు తెలిసి ఉంటాయి. ఇలాంటి వారిని వెతికి పట్టుకొని గొప్ప ఆగగాళ్లగా తీర్చిదిద్దాలి.

ఒలింపిక్స్‌లో మన దేశం రాణించాలంటే మహిళల మీదా, అట్ట దుగు వర్గాల పిల్లల మీద ఆధారపడడం మంచిది.

అట్టడుగువర్గాలకు అవకాశం ఇచ్చి చూడండి - రాజకీయాలు పక్కన బెట్టి అసలైన ఆటగాళ్లను వెదికి పట్టుకోండి. ఆటగాళ్లను కాదు ఆటను గెల్పించండి. దేశ గౌరవాన్ని కాపాడండి. - చక్రి

# ప్రశ్నోత్తరాలు



*నిర్వహణ :* **టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,**
ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు
**mail : ikyopadhyaya1975@gmail.com**

ప్రశ్న : **ఒక ఉపాధ్యాయుడు 24.01.2002న సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయునిగా విధులలో చేరియున్నారు. ప్రీపోన్మెంట్ వలన అతని ఇంక్రిమెంట్ అక్టోబర్ మాసంలో ఉన్నది. 24.01.2014న 12 సం॥ల స్కేలు పొందిన తదుపరి అతని ఇంక్రిమెంట్ జనవరికి మారింది. 01.07.2013న మూల వేతనం 13660గా ఉన్నది. నూతన పిఆర్సిలో వారి వేతన స్థిరీకరణ గురించి వివరించండి.**

**- పి.మనోహరం,** గుడ్లూరు, ప్రకాశం జిల్లా

జవాబు :

| 2010 వేతన స్కేళ్ళు | | 2015 వేతన స్కేళ్లు | |
|---|---|---|---|
| తేది | వేతనం | తేది | వేతనం |
| 01.07.2013 | 13660 | 01.07.2013 | 28940 |
| 01.10.2013 | 14050 | 01.10.2013 | 29760 |
| 24.01.2014 | 14860 ఎఫ్ఆర్ 22 ఎ(i) | 24.01.2014 | 30580 ఎఫ్ఆర్ 22 ఎ(i) |
| 01.01.2015 | 15280 | 01.10.2014 | 31460 ఎఫ్ఆర్ 31(2) |

ప్రశ్న : **నేను 2008 డిఎస్సి ద్వారా ఎంపిక కాబడి హామీ పత్రాల ద్వారా 20.07.2011న విధులలో చేరాను. నూతన పిఆర్సిలో స్కేల్‌లో కనిష్ఠ వేతనంలో స్థిరీకరణ చేసి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం వలన 2012 డిఎస్సి వారికన్న తక్కువగా ఉన్నాను. ఇది అన్యాయం కాదా! దీనిపై యుటియఫ్ చేస్తున్న కృషిని వివరించ గలరు.**

**- మెయిల్ ద్వారా**

జవాబు : సీనియర్లు తక్కువ వేతనం తీసుకొనవలసి రావడం అన్యాయమే. మీరు అప్రెంటీస్‌గా విధులలో చేరటం, డిఎస్సి 2012 వాళ్ళు అప్రెంటీస్ లేనందువలన నేరుగా టైం స్కేలులో నియమించబడటం వలన ఈ వ్యత్యాసం వుంది. దీనిపై యుటియఫ్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసింది. నాలుగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేసింది.

1. 2008 డిఎస్సి ఉపాధ్యాయుల అప్రెంటీస్ రద్దు చేసి రెగ్యులర్ స్కేలులో నోషనల్ ఫిక్సేషన్‌కి అనుమతించాలి.
2. అప్రెంటీస్ సర్వీస్ మొదటి సంవత్సరం పూర్తిచేసిన రోజున నోషనల్ ఇంక్రిమెంట్‌తో 01.07.2013నాడు ఫిక్సేషన్‌కి అనుమతించాలి.
3. ఫండమెంటల్ రూల్ 27 నిబంధనను అనుసరించి ప్రీ మెచ్యూర్ ఇంక్రిమెంట్ మంజూరుచేసి వేతన వ్యత్యాసం సరిచేయాలి.
4. 10వ పిఆర్సిలో వారికి ఇంక్రిమెంట్ తేదికి ఆప్షన్ సౌకర్యం కల్పించాలి

ప్రశ్న : **2015 పిఆర్సిలో హెచ్ఆర్ఏ ఉత్తర్వులలో కొన్ని నూతన పట్టణాలను చేర్చారు. వాటిపై మరల ఉత్తర్వులు ఇవ్వాలా?**

**- పిఆర్ మునిరత్నం,** నగరి

జవాబు : అవసరం లేదు. ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొనందున ఆ పట్టణం మొత్తానికి హెచ్ఆర్ఏ వర్తిస్తుంది. ఆ పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల ను మాత్రం జిల్లా కలెక్టర్ గెజిట్ నోటిఫై చేయాలి.

ప్రశ్న : **ఇన్-కం-టాక్స్ రిటర్న్ అందరు సమర్పించాలా? ఎప్పటి లోగా సమర్పించాలి?**

జవాబు : 2,50,000లు ఆదాయం దాటిన వారందరూ ఆగస్ట్ 31లోగా రిటర్న్ దాఖలు చేయాలి. వేతనాదాయం మాత్రమే ఉన్నవారు ఐటిఆర్-1 ఫారంలో ఈ ఫైలింగ్ చేయవచ్చు.

ప్రశ్న : **ఒక ఉపాధ్యాయుడు 30.08.2014 నుండి సస్పెన్షన్‌లో ఉన్నారు. వారికి పిఆర్సిలో వేతన స్థిరీకరణ చేస్తారా? సస్పెన్షన్ కాలానికి ఏ విధంగా చెల్లిస్తారు?**

**- ఐ.పవన్‌కుమార్,** బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు

జవాబు : 01.07.2013 నాటికి ఆ ఉపాధ్యాయుడు సర్వీస్‌లో ఉన్నారు కాబట్టి 2015 వేతన స్కేళ్ళలో 01.07.2013నాటి మూలవేతనం ఆధారంగా వేతన స్థిరీకరణ చేస్తారు. రీ ఇన్‌స్టేట్ కొరకు ఆగవలసిన అవసరం లేదు. సస్పెన్షన్ కాలానికి అలవెన్స్ రివైజ్ చేస్తారు. 02.06.2014 నుండి 31.03.2015 వరకు రావలసిన బకాయిలు ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన తర్వాత చెల్లిస్తారు.

ప్రశ్న : **01.07.2013 పిఆర్సి నందు రిటైర్డ్ ఉపాధ్యాయులకు స్టేజ్ బెనిఫిట్ ఇవ్వలేదా ఎందువలన?**

**- ఎ.మహమ్మద్ ఆలీ,** అనంతపురం

జవాబు : పెన్షనర్లకు వేతన స్కేల్ ఉండదు కాబట్టి స్టేజ్ బెనిఫిట్ అనే అంశం ఉత్పన్నం కాదు. 01.07.2013 నాటి బేసిక్ పెన్షన్‌కి, 63.344% డిఏ, 43% ఫిట్‌మెంట్ కలపగా వచ్చిన మొత్తాన్ని తదుపరి రూపాయికి సవరించి నూతన బేసిక్ పెన్షన్‌గా నిర్ధారిస్తారు.

ప్రశ్న : **మా స్నేహితుడు 22.07.2015 నుండి మెడికల్ లీవ్‌లో వున్నారు. 18,19,20,21 తేదీలలో రంజాన్, ఆదివారం, పుష్కరాల సెలవులు వచ్చినవి. ఆ నాలుగు రోజులకు ప్రిఫిక్స్‌గా వాడుకొనుటకు అనుమతింవచ్చా?**

**- పి.రాధాకృష్ణన్ నాయర్,** చిత్తూరు

జవాబు : అనుమతించవచ్చును.

ప్రశ్న : **2015 వేతన స్కేళ్ళలో పిహెచ్ అలవెన్స్ ఎంత? జిఓ తెలుపగలరు.**

**- కర్రి సురేష్,** మెయిల్ ద్వారా

జవాబు : 2015 వేతన స్కేల్ పిహెచ్ అలవెన్స్ ఉత్తర్వులు వెలువడలేదు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు 2010 స్కేల్‌లోని అలవెన్స్‌లే కొనసాగుతాయని మెమో నం. 3572..... తేది.18.06.2015 ద్వారా పేర్కొన్నారు.

## పాఠకులకు గమనిక

ఇ–మెయిల్ **(ikyopadhyaya1975@gmail.com)** లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, ఫోన్ నంబరు, ఐక్య ఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.

# సమస్యలపై జిల్లాలవారీ ప్రాతినిధ్యాలు

## తూర్పుగోదావరి జిల్లా

### ఏజెన్సీ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

తూర్పుగోదావరి జిల్లాలో నూతనంగా విలీనం కాబడిన మండలాలు చింతూరు, కూనవరం, విఆర్ పురం, నెల్లిపాక మండలాల ఉపాధ్యాయులు కొందరు తెలంగాణ రాష్ట్రానికి ఆప్షన్ యిచ్చి స్వచ్ఛందంగా రిలీవ్ కావడంతో ఉపాధ్యాయుల కొరత కారణంగా 105 పాఠశాలలు తెరిచే పరిస్థితి లేకపోయింది. 4 మండలాలలో డిప్యుటేషన్లు వేస్తే తప్ప పాఠశాలలు నడపడం సాధ్యంకాదని ఏజెన్సీ 7 మండలాల నుండి 84మందిని విలీన మండలాల నుండి 21మందిని సర్దుబాటు చేస్తూ డిప్యుటేషన్ ఉత్తర్వులు ఇచ్చారు.

జిల్లాశాఖ తక్షణం స్పందించి అంగీకారంలేని డిప్యుటేషన్లను రద్దు చేయాలని కోరింది. పరిస్థితిని ముందుగా అంచనా వేయకుండా, ముందస్తు చర్యలు చేపట్టకుండా అర్థాంతరంగా 200 కి.మీ. డిప్యుటేషను వేశారు. స్త్రీలు, అనారోగ్యవంతులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లలను నియమించాలని కోరారు. దానిపై జిల్లా విద్యాశాఖాధికారి శాశ్వత ఏర్పాట్లు ప్రయత్నాలు జరుగుతున్నాయని త్వరలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి డిప్యుటేషన్లు రద్దు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

యుటియఫ్ రాష్ట్ర సంఘం కూడా ఈ విషయంపై వెంటనే స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి చేసింది. స్పెషల్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లని నియమించాలని తక్షణం ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దానిపై అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియామకానికి ఫైలు ఆర్థికశాఖకు పంపడం జరిగింది. డిఎస్‌సి ద్వారాగాని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ద్వారాగాని సమస్య పరిష్కారం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారంకాని పక్షంలో పోరాటానికి సిద్ధంగా ఉండాలని యుటియఫ్ విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.

## గుంటూరు జిల్లా

### పిఆర్‌సి అమలుకు చర్య తీసుకోవాలి




2015 పిఆర్‌సి అమలు కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యుటియఫ్ కార్యాలయంలో పిఆర్‌సి అవగాహన సదస్సు కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం జెఏసితో ఒప్పందం చేసుకున్నా ఇంతవరకు పిఆర్‌సి అమలుపై చర్య తీసుకోలేదని విమర్శించారు. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ హెల్త్‌కార్డులు ఇవ్వకుండా మెడికల్ పథకాన్ని నీరుకార్చేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పిఆర్‌సిపై అవగాహన కల్పిస్తూ యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.మల్లేశ్వర రావు మాట్లాడుతూ 2013 జులై 1 నుండి పిఆర్‌సి అమలులోకి వస్తుందని, బకాయిలు ఎలా చెల్లించాలో తదుపరి ఉత్తర్వులు జారీ చేయాల్సి వుందన్నారు. బిల్లులు చెల్లించే విధానం హెచ్‌ఆర్ఎంఎస్ ద్వారా అంటే పాత విధానంలో చెల్లించడానికి జిఓ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్, కార్యదర్శులు శివపూర్ణయ్య, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.కళాధర్, ఐ.పౌల్ రాజు, ఐ.డేవిడ్‌రాజు, ఆదిలక్ష్మి, లక్ష్మీపార్వతి, రవిచంద్ర శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన హెచ్‌ఆర్ఏ అమలు పర్చండి



10వ వేతన సంఘం సిఫార్సులు అమలులో భాగంగా రేపల్లె, పిడుగురాళ్ళ, మాచర్ల పట్టణాలకు 14.5% హెచ్‌ఆర్ఏ అమలుకు చర్యలు తీసుకోవాలని యుటియఫ్ గుంటూరు జిల్లాశాఖ డిఆర్ఓ నాగబాబుని కలిసి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. రేపల్లె పట్టణ పరిధిలో 37, మాచర్ల పరిధిలో 16, పిడుగురాళ్ళ పరిధిలో 15 గ్రామాలకు నూతనంగా హెచ్‌ఆర్ఏ మార్పులు జరిగే అవకాశం వుందని తెలిపారు. జిఓ నం.48 ప్రకారం ఆ గ్రామాలను గుర్తించి, జిల్లా కలెక్టర్‌చే గెజిట్ విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

డిఆర్ఓ సానుకూలంగా స్పందించి, వెంటనే సంబంధిత అధికారుల ద్వారా గ్రామాలను గుర్తించేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జిల్లా కార్యదర్శి జి.శివపూర్ణయ్య, రాష్ట్ర నాయకులు ఎన్.తాండవకృష్ణ, ఆడిట్ మెంబర్ ఎన్.జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

### డైట్ సెట్‌లో ఇంటర్ అర్హత మార్కులు 45%కి తగ్గించాలి

డైట్‌సెట్ 2015లో ప్రవేశానికి ఇంటర్‌మీడియట్ అర్హత మార్కులను 45%కి తగ్గించాలని యుటియఫ్ గుంటూరు జిల్లాశాఖ మరియు మాజీ శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు ప్రాంతీయ ఉపసంచాలకులు మరియు డైట్‌సెట్ కన్వీనర్ అయిన శ్రీమతి పార్వతికి ప్రాతినిధ్యం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిఓఎంఎస్ నం.30, తేది.08.07.2015 ప్రకారం డైట్‌సెట్‌లో ఇంటర్‌మీడియట్ అర్హత మార్కులను ఓసి, బిసిలకు 50%గా విడుదల చేసింది. ఇప్పటివరకు 45%గా ఉన్న మార్కులు ఇప్పుడు 50%కి పెంచడంవలన డైట్‌సెట్‌లో ఎక్కువ ప్రవేశం పొందుతున్న పేద, బలహీన వర్గాల పిల్లలు నష్టపోయే అవకాశం వుంది. అందువల్ల దీనిని గతంలోలాగే 45%గా కొనసాగించాలని డైట్‌సెట్ కన్వీనర్‌కి విజ్ఞప్తి చేయడం జరిగింది. దీనికి డైట్‌సెట్ కన్వీనర్

సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కెవిఎస్ లక్ష్మణరావు, యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు, కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

**ప్రకాశం జిల్లా**

**పిఆర్‌సి అములుకై కృషి**

నూతన వేతనము అమలులో జాప్యంలేకుండా ట్రెజరీలలో అవినీతికి అవకాశం లేకుండా అమలు చేయాలని జిల్లా ఖజానాధికారితో ప్రాతినిధ్యం చేయడమైనది. జిల్లాలోని అన్ని ఎస్‌టిఓ కార్యాలయాలలో యుటియఫ్ కార్యకర్తలు చురుకుగా పనిచేయడం వలన నూతన వేతనములు పొందుటలో ముందున్నాం.

ఒంగోలు, మార్కాపురంలో పిఆర్‌సిపై అవగాహన క్లాసులు నిర్వహించబడినాయి. క్లాసుల నిర్వహణకు జిల్లా కార్యదర్శి కెవి ప్రసాద్, ఒంగోలు పట్టణ కార్యకర్తలు సహకరించారు.

పిఆర్‌సి అమలు చేయించుటలో ముందున్న మండల / పట్టణ శాఖల కార్యకర్తలందరికి రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు డి.వీరాంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి అభినందనలు తెలిపారు.

**చిత్తూరు జిల్లా**

**పిఆర్‌సిని పారదర్శకంగా జరపాలి**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొత్త వేతనాలను పారదర్శకంగా జరిపించాలని చిత్తూరు జిల్లా డిటిఓ గంగాద్రిని కలిసి యుటియఫ్ జిల్లా కమిటీ పక్షాన ప్రాతినిధ్యం చేశారు. జిల్లా వ్యాప్తంగా గల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బిల్లులు సమర్పించిన వరుస క్రమంలో ప్రతి బిల్‌కు నెంబర్లు కేటాయిస్తూ త్వరిత గతిన మంజూరు చేయించాలని అదే విషయాన్ని అన్ని ఎస్‌టిఓ కార్యాలయాలకు సర్క్యులేట్ చేయాలని డిటిఓకి తెలియజేశారు. డిటిఓ స్పందిస్తూ వేతన సవరణను పారదర్శకంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాతినిధ్యం చేసినవారిలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, ప్రధానకార్యదర్శి ఎన్.గుణశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు జి.శ్రీరామమూర్తి, గుడిపాల మండల నాయకులు, నాగరాజ, కుప్పస్వామి నాయుడు, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

**భవిష్యనిధి ఆన్‌లైన్‌లో పెట్టించిన యుటియఫ్**

చిత్తూరు జిల్లాలోని వేలాదిమంది ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రావిడెంట్‌ఫండ్ 1999 నుండి జమగాక కోట్లాది రూపాయలు నిరుపయోగం క్రింద ఉన్న విషయాన్ని చిత్తూరు జిల్లా యుటియఫ్ కమిటీ మార్చి 2015 నుండి పలుదఫాలుగా జిల్లాపరిషత్ సిఇఓ వేణుగోపాల్ రెడ్డి, గణాంక అధికారి వెంకటరత్నంల దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసులురెడ్డి కూడ పై విషయం సిఇఓతో చర్చించి త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు. పిఎఫ్ అకౌంట్స్ సరిచేసి ఆ మొత్తాలను ఆన్‌లైన్‌లో పెట్టాలనే డిమాండ్‌పై యుటియఫ్ ధర్నా నోటీస్ కూడ ఇవ్వడంతో జెడ్‌పి సిఇఓ వెంటనే స్పందించి యుటియఫ్ జిల్లా కమిటీని చర్చలకు పిలిచి నిర్ణీత సమయంలోగా సమస్యను పరిష్కరించగలనని హామీ ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత యుటియఫ్ జిల్లా కమిటీ అధికారులను తరచూ కలుస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేసింది. ఫలితాన్ని సాధించింది. పిఎఫ్ ఆన్‌లైన్‌లో పెట్టారు. సిఇఓ పత్రికల ద్వారా కూడ పై సమస్యను పరిష్కరించామని, ఇంకా ఏదైనా జమలు, లోపాలు ఉన్నయెడల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫిర్యాదు నెంబరుకు ఫోన్ చేయాలని ప్రకటించడం జరిగింది.

జిల్లా కమిటీ పట్టుదలగా కృషి చేయడం వల్ల సమస్య పరిష్కారమయ్యిందని జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.గుణశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్. సోమచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శులు రాధాకృష్ణ, పరంధామనాయుడు, ముత్యాల రెడ్డి, కోశాధికారి జనార్ధనరెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ శేఖర్, రెడ్డప్ప, కుప్పస్వామి, సహాధ్యక్షులు ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

**ట్రెజరీ కార్యాలయాలలో క్రమపద్ధతిలో పిఆర్‌సి అమలు చేయాలి**

యుటియఫ్ జిల్లాశాఖ నాయకులు కడప ఖజానా ఉప సంచాలకులుని జిల్లా ఖజనా కార్యాలయంలో కలిసి నూతన పిఆర్‌సి అమలు గురించి చర్చించారు. జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మిరాజా నూతన పేరివిజన్ అమలు మండలాలవారీగా వచ్చిన బిల్స్ క్రమపద్ధతి రిజిష్టర్‌లో నమోదు చేయాలని, నూతన వేతన స్థిరీకరణకు ఖజనా కార్యాలయాల సిబ్బంది, అధికారులు సహకరించి జాప్యం లేకుండా మంజూరు చేయాలని, జిల్లాలోని ఉప ఖజానాధి కారులకు సకాలంలో నూతన పిఆర్‌సి అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని ఉపసంచాలకుల్ని కోరారు. మండలాల వారీగా వచ్చిన వేతన స్థిరీకరణ వరుసప్రకారం చేయాలన్నారు. హెచ్ఆర్ఎంఎస్‌లో ఉన్న లోపాలను వెంటనే సవరించటానికి చర్యలు తీసుకోవటానికి ఉన్నతాధికారులకు తెలపాలి.

ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.విజయ్‌కుమార్, పి.రాజు, నాయకులు శంకర్‌బాబు, వి.వెంకటసుబ్బయ్య, జాన్‌ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా డోన్‌లో కలాం మృతికి సంతాపం**



ప్రఖ్యాత శాస్త్రవేత్త, క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మరణం దేశానికి తీరని లోటని యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు అన్నారు. భారత అంతరిక్ష పరిశోధనలతో ఎనలేని కృషిచేసి, రాష్ట్రపతిగా నిరాడంబర జీవితాన్ని గడిపి దేశ ప్రజలలో, విద్యార్థులతో సంబంధాలను కొనసాగిస్తూ ప్రజల రాష్ట్రపతిగా ఖ్యాతినార్జించిన మహోన్నతుడు అన్నారు. "కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి" అని విద్యార్థుల్లో స్ఫూర్తినింపిన దార్శనికుడన్నారు. డోన్ మండలశాఖ ఆధ్వర్యంలో యుటియఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మాణిక్యంశెట్టి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, బివై సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో తొలి మహాసభను నిర్వహించిన ఆకివీడు మండలశాఖ

రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలశాఖ జూన్ నెలలో సభ్యత్వ జనరల్ ఫండ్ క్యాంపెయిన్స్ వసూళ్లు, ఆడిట్ పూర్తిచేసి జులై మొదటి వారంలో నూతన మండల కౌన్సిల్ నిర్వహించింది. రాష్ట్రంలో మొట్టమొదటి నిర్మాణం పూర్తిచేసిన మండలశాఖగా నిలిచి నందుకు రాష్ట్ర జిల్లా శాఖలు సదరు మండల శాఖ బాధ్యులందరికీ ఉద్యమాభివందనలు తెల్పారు. గత సంవత్సరం కూడ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కార్యదర్శి ఎం.ఐ.విజయకుమార్ తెల్పారు.

మండల కౌన్సిల్ వేదికపైకి గౌరవాధ్యక్షులు పాండురంగారావు సంఘ బాధ్యులను, ముఖ్య అతిథులను ఆహ్వానించగా, సభాధ్యక్షులుగా




ఏ.రాంశేషు బాబు వ్యవహరించారు. సంతాప తీర్మానాలు మండల కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు ప్రవేశపెట్టారు. ప్రధానకార్యదర్శి ఎ.రాంబాబు గత మహాసభ నుండి నేటివరకు చేసిన కృషి నివేదికను, ట్రెజరర్ బిఎన్‌వి సత్యనారాయణ ఆర్థికనివేదిక ప్రవేశపెట్టగా కార్యకర్తలు చర్చించి ఆమోదించారు.

సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధానకార్యదర్శి షేక్‌సాబ్జీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి అహూరాత్రులు శ్రమించి అనేక త్యాగాలు చేసిన మండల శాఖ నాయకత్వాన్ని అభినందించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణం చేస్తూ మతతత్వ పోకడలను ప్రోత్సహిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సిని సకాలంలో విడుదల చేయకుండా, అక్రమ బదిలీలకు ప్రభుత్వమే ద్వారాలు తెరుస్తుందన్నారు. మున్సిపల్ పాఠశాలలను కార్పొరేట్ నాయకులు కబళిస్తుంటే ప్రభుత్వం వారితో పిపిపి విధానాలను అమలు చేస్తుందని, విలీనం పేరుతో అనేక పాఠశాలలను మూతవేస్తుందని వీటన్నిటిని మేధావులైన ఉపాధ్యాయులు అర్థం చేసుకొని సమైక్యంతో ఉద్యమాలు నడపాలన్నారు. అలాగే ఈ శాఖ ప్రధానకార్యదర్శిగా చాలాకాలం పనిచేసి ఆకస్మిక మరణం పొందిన గోడి శామ్యూల్‌రాజు సేవలను మరువలేనివని, వారి సతీమణి దేవకృప కూడ శాఖకు అందిస్తున్న సహాయసహకారాలను కొనియాడారు.

జిల్లా ట్రెజరర్ పి.వి.నర్సింహారావు మండలశాఖ ఆర్థికంగా నిల్వలో ఉన్నం దుకు అభినందించారు. అన్ని పాఠశాలలకు యుటియఫ్ పత్రిక వెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లాకార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం డిటిఓ కార్యాలయం సమస్యలకు గూర్చి వివరించారు. తదుపరి ఎన్నికల అధికారిగా బొర్రా గోపిమూర్తి, జిల్లా కార్యదర్శి మరియు డివిజన్ కన్వీనర్ ఆధ్వర్యంలో నూతన కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

**నూతన కమిటీ**

**ఆఫీస్ బేరర్స్ :** గౌరవాధ్యక్షులు కె.పాండురంగారావు, అధ్యక్షులు ఏ.రాంశేషుబాబు, సహాధ్యక్షులు జెడ్‌వి సత్యనారాయణ, కెఎన్‌వి నాగలక్ష్మి, ప్రధానకార్యదర్శి ఏ.రాంబాబు, కోశాధికారి బిఎన్‌వి సత్యనారాయణ, కార్యదర్శులు కెజె మౌనిక, జి.రత్నకుమార్, ఎస్.రవికుమార్, టి.వెంకటేశ్వరరావు, ఏవిఎల్ నర్సింహ్మం, పి.విజయ రాజన్, జి.విజయకుమార్, ఎం.వెంకటస్వామి, జెఏ ప్రమీల.

**మహిళా కార్యదర్శి :** ఎం.శాంతిఫ్లొరెన్స్

**ఆడిట్ కమిటీ కన్వీనర్ :** ఆర్.పాండురంగారావు,

**జిల్లా కౌన్సిలర్స్ :** కె.మోహన్, పి.అరవింద్, ఎస్.వి.అప్పల నాయుడు, ఆర్.జోత్స్నకుమారి, కె.జ్ఞానానాదం, ఎం.ఎం.ప్రేమానాదం, టి.వెంకటేశ్వరరావు, ఏ.రాంశేషుబాబు, ఏ.రాంబాబు.

# సభ్యత్వ నమోదులో ప్రకాశం జిల్లా రికార్డు

యుటియఫ్ ప్రకాశం జిల్లా శాఖ మొదటిసారిగా 10వేల సభ్యత్వం దాటి రికార్డును సృష్టించింది. ఆ జిల్లా శాఖకు, కార్యకర్తలకు రాష్ట్ర సంఘం ఉద్యమాభినందనలు తెలిపింది.

యుటియఫ్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన దాచూరి రామిరెడ్డిగారి పర్యవేక్షణలో ప్రకాశం జిల్లాశాఖ జిల్లాలో అనేక విద్యా సదస్సులు జరపడం, సమస్యలపై నిరంతర ప్రాతినిధ్యాలు, పోరాటాలు చేయడం, నిత్యం ఉపాధ్యాయులతో సంబంధాలు కలిగి ఉండటం వలన జిల్లాలో 10వేలమంది సభ్యులుగా చేర్చారు. ఇది ప్రకాశం జిల్లా ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుంది.

జిల్లాకార్యవర్గ నిర్ణయం మేరకు జిల్లా కమిటీ సభ్యులతోపాటు సీనియర్ నాయకులు 56 మండల, 3 పట్టణ శాఖల కార్యకర్తలు టీమ్‌లుగా ఏర్పడి క్యాంపెయిన్స్ సకాలంలో పూర్తిచేశారు. ఇప్పటికి 9000 సభ్యత్వం రాష్ట్ర కమిటీకి చెల్లించారు. ఈ క్యాంపెయిన్‌లో సమస్యల సేకరణ జరిపారు.

2014-15 పిఎఫ్ స్లిప్పులు, ఏపిజిఎల్ఐ, సిపిఎస్ మిస్సింగ్ క్రెడిట్స్, ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని త్వరలో పరిష్కారానికి కార్యక్రమాలు తీసుకుంటామని జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డి.వీరాంజనేయులు, పి.రమణారెడ్డి తెలిపారు.

## గమనిక

పేపర్, ప్రింటింగ్ ఖర్చులు పెరగడం, మరింత సమాచారం అందించడం కొరకు పత్రిక పేజీలు పెంచవలసి రావడంతో **ఐక్య ఉపాధ్యాయ మాస పత్రిక** రేట్లు పెంచాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. సెప్టెంబర్ 2015 సంచిక నుండి కొత్త రేట్లు అమలులోకి వస్తాయి. పాఠకులు గమనించగలరు.

**నూతన చందా : దశాబ్ది రూ. 1250/-, అర్థ దశాబ్ది రూ.650/-, సంవత్సరం చందా రూ.150/-, విడి ప్రతి రూ.15/-**

# మున్సిపల్ ఉపాధ్యాయుల నిరసనలు

## విజయనగరం జిల్లా

### కార్పొరేట్ చదువులు మాకొద్దు

మున్సిపల్ పాఠశాలల్లో ఐఐటి ఫౌండేషన్ కోర్సు పరుతో మున్సిపల్ శాఖామంత్రి నారాయణ ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ శిక్షణా కార్యక్రమాన్ని బహిస్కరించారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం అయిన నిరసన 2 గంటల వరకు కొనసాగింది. శిక్షణ ఇవ్వడం కోసం నారాయణ విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులను మన పాఠశాలలకు పంపి ప్రభుత్వ మున్సిపల్ విద్యా రంగంపై పెత్తనం చేయడాన్ని తీవ్రంగా నిరశిస్తున్నామని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి అన్నారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, విజయనగరం మున్సిపల్ కేంద్రాల నుండి హాజరైన అన్ని సబ్జెక్టుల టీచర్లు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని ముందుగా మున్సిపల్ విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.నిర్మల, వి.శ్రీను, టి. సూర్యనారాయణ, కె.రాము, కె.భాస్కరరావు, వై.శ్యాము, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా

### మున్సిపల్ టీచర్ల శిక్షణా తరగతుల బహిష్కరణ

మున్సిపల్ ఉపాధ్యాయులకు కార్పొరేట్ విద్యాసంస్థల సిబ్బందితో శిక్షణనివ్వడాన్ని నిరసిస్తూ యుటియఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు బహిష్కరించారు. 2015 జులై 5న కాకినాడలో 1 రోజు శిక్షణా తరగతి నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుండానే ప్రభుత్వం మలిదశ శిక్షణా తరగతులు నారాయణ సంస్థల సిబ్బంది శిక్షణ ప్రారంభించడం తో వారిలో అసంతృప్తి కట్టలు తెగింది. ప్రభుత్వ ఉపాధ్యాయులపై కార్పొరేట్ పెత్తనాన్ని సహించబో మంటూ ఉపాధ్యాయులు శిక్షణా తరగతులను బహిష్కరించారు.

## ప్రకాశం జిల్లా

### శిక్షణాతరగతులు బహిష్కరణ



**ఒంగోలు నగరం :** జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు చేపట్టిన పునశ్చరణ శిక్షణ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. నారాయణ కళాశాలకు చెందిన అధ్యాపకులతో మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ యిప్పించడాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయులు తరగతులను బహిష్కరించారు. స్థానిక రామనగర్ ఉన్నత పాఠశాలలో ఒంగోలు, చీరాల, మార్కాపురం మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని కమీషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పోటీపడే విధంగా మున్సిపల్ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఐఐటి తరహా శిక్షణ ఇవ్వడానికి ఎనిమిదిమందితో అకడమిక్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులతో ఏర్పడిన ఈ కౌన్సిల్ గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ముందుగా శిక్షణ పొందారన్నారు. వారు పాఠశాలల్లో బోధించేవారికి తిరిగి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కాని నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. దాంతో పదినిమిషాలకే ఉపాధ్యాయులందరూ శిక్షణను బహిష్కరించి వెళ్ళిపోయారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో కార్పొరేట్ శక్తుల జోక్యాన్ని సహించేది లేదని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా ప్రతినిధులు ఎస్ రవి, పివి నారాయణలు తెలియజేశారు. వృత్యంతర శిక్షణ మంచిదే అయినప్పటికీ కార్పొరేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పించడం ప్రభుత్వ ఉపాధ్యాయులను అగౌరవపరచడమే నన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులుండగా కార్పొరేట్ కళాశాలల వారిని ఎందుకు వినియోగి స్తున్నారని ప్రశ్నించారు.

## కర్నూలు జిల్లా

### ప్రభుత్వ విద్యారంగంలో కార్పొరేట్ జోక్యాన్ని సహించం




ప్రభుత్వ విద్యారంగంలో కార్పొరేట్ విద్యాసంస్థల జోక్యాన్ని సహించ బోమని ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్‌కుమార్ అన్నారు. జులై 7న కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కర్నూలు, నంద్యాల, ఆదోని పట్టణాలకు చెందిన మున్సిపల్ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం జరిగింది. అయితే రిసోర్స్‌పర్సన్స్‌గా ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులను కాకుండా ఒక కార్పొరేట్ విద్యాసంస్థ (నారాయణ విద్యాసంస్థలు)కు చెందిన ఉపాధ్యాయులను నియమించారు. దీనికి నిరసనగా యుటియఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను బహిష్కరించారు.

ఈ సందర్భంగా కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఇవి ఉపాధ్యాయుల ఆత్మగౌరవ సమస్య మాత్రమేగాక, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే చర్య అని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి జోక్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జె.సుధాకర్, ఎస్.ఎం.జయరాజు, బి.ప్రతాప్, జి. సర్వేశ్వరరెడ్డి, యుఆర్ఏ రవికుమార్, ఎఎండి రసిక్, మద్దిలేటి, హేమంత్ కుమార్, ప్రకాశరావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యావికాస ఉద్యమం

## తూర్పుగోదావరి జిల్లా

## తూర్పుతీరాన కదిలిన విద్యావికాస ఉద్యమ రథం




బడులు తెరచి రోజులు గడుస్తున్నా సర్కారు పాఠశాలల్లో మాత్రం ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. టీచర్ల ఖాళీలు నింపలేదు. పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో అందలేదు. గత సంవత్సరం ఇవ్వాల్సిన ఏకరూప దుస్తులూ ఇవ్వలేదు. మధ్యాహ్న భోజన పథకం నిధులు సకాలంలో విడుదల కావడం లేదు. ఇక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన సంగతి సరేసరి. ప్రభుత్వ విద్యారంగం బ్రతికి బట్టకట్టాలంటే ముందుగా ప్రాథమిక విద్యారంగాన్ని పటిష్ట పరచాలి. సెకండరీ విద్యారంగంలో మరిన్ని మార్పులు తేవడం ద్వారా దాన్నీ బలోపేతం చేయాల్సి ఉంటుంది. కాని, ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యధోరణి ప్రభుత్వ పాఠశాలలకు శాపంగాను, ప్రైవేట్ పాఠశాలలకు వరంగాను మారుతోంది. ఈ నేపథ్యంలో విద్యావికాస ఉద్యమంలో భాగంగా "ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి - ప్రైవేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి" అనే డిమాండ్‌తో జూన్ 29 నుండి వారం రోజులపాటు యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లాశాఖ జాతా నిర్వహించింది.

జూన్ 28వ తేదీన రాజమండ్రిలో జరిగిన ప్రారంభ సభకు యుటియఫ్ కార్యకర్తలతో పాటు జన విజ్ఞాన వేదిక, ఇన్స్యూరెన్స్ ఉద్యోగులు, ఎస్ఎఫ్ఐ, సిఐటియు తదితర ప్రజాసంఘాల నాయకులు, విద్యారంగ శ్రేయోభిలాషులు హాజరయ్యారు. విద్యావికాస ఉద్యమ జాతా లక్ష్యాలను రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనరు కె.సత్తిరాజు వివరించారు. యుటియఫ్ చేపట్టిన జాతాకు మిత్ర సంఘాలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. విద్యావికాస ఉద్యమంలో భాగస్వాములై ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుటకు కృషి చేస్తామన్నాయి.

జూన్ 29న జాతాను కడియం మండలంలో యుటియఫ్ సీనియర్ నాయకులు పి.పుల్లయ్య జాతాను ప్రారంభించారు. జూన్ 29న నుండి జులై 5వరకు వారం రోజులపాటు సాగిన ఈ జాతా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, తాలూకా కేంద్రాలు, పట్టణ ప్రాంతాలను కలుపుకుంటూ సాగింది. మొత్తం 44 మండలాల్లో పర్యటించి 71 చోట్ల బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలలో 10,000మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా 50,000 కరపత్రాలు పంచడం ద్వారా జాతా లక్ష్యాలను వివరించగలిగారు. దీనివల్ల ప్రజల్లో విస్తృతమైన ప్రచారం జరిగింది. ప్రాథమిక విద్యారంగాన్ని పటిష్టపరచాలంటే మౌలిక వసతుల కల్పనతో పాటు, తరగతికో ఉపాధ్యాయుడు ఉండాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో బాల్యారంభ కేంద్రాలు (ఇసిఇ సెంటర్లు) ఏర్పాటు చేయాలని, ఇంగ్లీషు మీడియం బోధనను ఒక క్రమ పద్ధతిలో ప్రవేశపెట్టాలని, ప్రైవేట్ విద్యావ్యాపారాన్ని అరికట్టాలని, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని, ఇందుకు ఉపాధ్యాయులతో బాటు ప్రజలు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని చేసిన ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన కన్పించింది. ఎమ్మెల్యే, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, విద్యా కమిటీ చైర్మన్లు, మెంబర్లు అనేకమంది హాజరై వారి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భవిష్యత్ ఉద్యమాలకు తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజలు సైతం సభల్లో పాల్గొని ప్రభుత్వ విద్య కొనసాగితేనే అందరికీ విద్య అందుతుందని కాబట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతమయ్యేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

జాతా ముగింపు సందర్భంగా కాకినాడ యుటియఫ్ హోమ్‌లో జరిగిన సమావేశానికి వివిధ మండలాల యుటియఫ్ నాయకత్వంతో బాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాశాఖాధికారులు, విద్యారంగ శ్రేయోభిలాషులు సుమారు 300మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డివి రాఘవులు మాట్లాడుతూ 'ప్రైవేట్ పాఠశాలలకు దీటైన విద్యాబోధన చేయగలిగిన సత్తా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉందన్నారు. మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించి, తగినంతమంది ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమిస్తే విద్యారంగంలో అద్భుతాలు సృష్టించవచ్చునన్నారు. రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్న బోధనలో డొల్లతనాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. 10వ తరగతికి సంబంధించిన పాఠాలు 2 సం॥ వలె వేయించి ఫలితాలు సాధిస్తున్నారని, తమకంటే ఉన్నతంగా ఎవరూ చదువు చెప్పలేరని ప్రచారం చేసుకుంటున్నారని, కాని విద్యార్థుల మానసిక వికాసానికి మాత్రం కృషి చేయరని విమర్శించారు.

రాజోలు, మలికిపురం మండల విద్యాధికారులు ప్రసంగిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉపాధ్యాయులతో బాటు ప్రజలకూ ఉందని, తాము కూడా విద్యారంగాన్ని పటిష్టపర చేందుకు తమవంతు కృషిని, సహకారాన్ని అందిస్తామన్నారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యుటియఫ్ చేపట్టే ప్రతీ మంచి కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను, వారి ఉపాధ్యాయుల అభినందించడం జరిగింది.

యుటియఫ్ ప్రారంభించిన ఈ ఉద్యమ వికాస జాతాకు యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.సత్తిరాజు సారధ్యం వహించగా, ఎంటివి సుబ్బారావు (అల్లవరం), పి.సురేంద్రకుమార్ (కపిలేశ్వరపురం), వైవిఎస్ఎన్ బాలాజీ (రావులపాలెం), కెవి రమణ (రౌతులపూడి) జాతా టీమ్‌గా వ్యవహరించారు. జాతా జరిగిన 7రోజులూ యుటియఫ్ ప్రధాన బాధ్యులు రోజుకు ఒకరు చొప్పున బాధ్యత వహించి జాతా జయప్రద మయ్యేందుకు కృషి చేశారు. జాతా జయప్రదం చేయడానికి కృషి చేసిన నాయకత్వానికి, కార్యకర్తలకు యుటియఫ్ జిల్లా శాఖ అభినంద నలు తెలియజేసింది. రాబోయే కాలంలో మరిన్ని కార్యక్రమాల ద్వారా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## విజయనగరం జిల్లా

### ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి

నూతన ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. యుటియఫ్ విద్యావికాస వేదిక ఆధ్వర్యంలో బడులులేని ప్రాంతాల్లో పర్యటించి అక్కడ పాఠశాలల ప్రాధాన్యతను గుర్తిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడగా వారు పాఠశాలను విధిగా ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో సమావేశం నిర్వహించి స్థానికుల నుంచి వినతిపత్రం తీసుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి పాఠశాల ఏర్పాటయ్యేలా కృషి చేస్తామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ప్రభుత్వ విద్యను అందు బాటులోకి తీసుకురావాలని, విద్యాహక్కు చట్టం అమలు చేయాలని, బాలల హక్కులను పరిరక్షించాలని, కిలోమీటర్ దూరంలోనే పాఠశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు పి.మధుసూదనరావు, పి.వరప్రసాద్, పి. సత్యనారాయణ, రాధాకృష్ణ, వి.ప్రసన్నకుమార్, కె.రామకృష్ణతో పాటు స్థానికులు డాక్టర్ బొంతు శ్రీరాములు, ఇందిర పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల కృషితో ప్రతియేటా పెరుగుతున్న ఎన్‌రోల్మెంట్




తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం మండల కేంద్రంలో గల పి. గన్నవరం మెయిన్ ప్రాథమిక పాఠశాలయందు ఈ విద్యా సంవత్సరం లో 45మంది విద్యార్థులు చేరారు. ప్రతి సంవత్సరం ఎన్‌రోల్మెంట్ అత్యధికంగా చేసే పాఠశాలగా గన్నవరం మెయిన్ పాఠశాల మండలంలో ప్రథమస్థానం పొందుచున్నది. పాఠశాల ప్రధానోపాధ్యా యులు కత్తుల ఆనందరావు, సహాధ్యక్షురాలు కెవి దుర్గా దేవి వేసవి సెలవులలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టి విద్యా సంబరాలు కరపత్రాల ద్వారా ఇంటింటికి తిరిగి నమోదు కార్యక్రమం చేయపడుతారు. విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన విద్యాబోధన, 'బి'గ్రేడ్ పిల్లలకు పాఠశాల పనివేళల అనంతరం అదనపు తరగతులు నిర్వహించుట, 1వ తరగతి నుండి తెలుగు భాషా బోధనతో పాటు ఇంగ్లీషు మరియు హిందీ భాషా నేర్పడం ఈ పాఠశాల ప్రత్యేకత.

పాఠశాల అతి దగ్గరలో 5 ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నప్పటికి ప్రతి సంవత్సరం ఎన్‌రోల్మెంట్ పెంచుతున్న ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులను మండల పరిషత్ అధ్యక్షురాలు సంసాని లక్ష్మీగౌరి, మండల విద్యాశాఖ అధికారి కొక్కిరి దామోదరం, మండల అభివృద్ధి అధికారి ఎం.ప్రభాకరరావు, సర్పంచ్ చుట్టుగుల్ల షర్మిల, విద్యా కమిటీ చైర్మన్ రేలంగి రాజ్యలక్ష్మీ అభినందించారు.

## పశ్చిమగోదావరి జిల్లా

### తోట జోసఫ్ మృతికి సంతాపం



**దెందులూరు :** మండల యుటియఫ్ శాఖ గౌరవ అధ్యక్షుడు తోట జోసఫ్ అనారోగ్య కారణంగా జులై 12న విజయవాడ రమేష్ హాస్పిటల్‌నందు మృతి చెందారు. తోట జోసఫ్ గత 25 సం॥లుగా యుటియఫ్ సభ్యుడిగా, మండలశాఖ అధ్యక్షుడిగా, ప్రధానకార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా వివిధ హోదాలలో సేవలందించి ప్రస్తుతం మండలశాఖ గౌరవాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. తోట జోసఫ్ ఆకాల మరణానికి యుటియఫ్ పక్షాన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది.

### బివి రమణ అకాల మరణం - యుటియఫ్ నివాళి



**కాళ్ళ :** జులై 11న అనారోగ్య కారణాలరీత్యా ఆకస్మికంగా మరణించిన కాళ్ళ మండలశాఖ మాజీ ప్రధానకార్యదర్శి బీరదాకోట వెంకటరమణ (44 సం॥)కు యుటియఫ్ నివాళులర్పించింది. భీమవరం డివిజన్‌లోని జిల్లా కార్యదర్శులు బి.గోపిమూర్తి, ఎం.ఐ.విజయకుమార్, పి.సీతారామ రాజు, ఎం.శ్రీనివాసరాజు మరియు కాళ్ళ శాఖ అధ్యక్షులు కవులూరి సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు ప్రసాదరాజు మరియు మండల నాయకులు ఎం.రాజేంద్రబాబు, శంకరరావు, బిఆర్‌కె వర్మ, కె.అశోక్, బి.వి.రామ రాజు, ఎం.విజయలక్ష్మి, టి.లీలావతి తదితరులు బివి రమణ గృహమునకు వెళ్ళి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

### ఏవి నర్సింహాం మృతి



**ఉండి :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉండి నందు స్కూల్ అసిస్టెంట్ (పిఎస్)గా పనిచేస్తూ ఏవి నర్సింహాం జూన్ 19న మృతి చెందారు. వారి మృతికి ఉండి మండల శాఖ, యుటియఫ్ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఉండి మండల శాఖ అధ్యక్షులు కెఎస్ సిహెచ్ సాయిరామ్, ప్రధానకార్యదర్శి పి.డేవిడ్‌రాజు, గౌరవాధ్యక్షులు ఎస్‌విఆర్ కృష్ణంరాజు, అసోసియేట్ అధ్యక్షులు కె.వామనమూర్తి, ట్రెజరర్ పివి సత్యనారాయణరాజు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### అంకితభావంగల నాయకులే యుటియఫ్ ప్రాణం



**ఆకివీడు :** జులై 15న ఎస్‌జెఎస్‌జె ఎలిమెంటరీ స్కూల్ ఆకివీడునందు సంస్మరణ సభ జరిగింది. దివంగత జి.సామ్యూల్‌రాజు ఫోటోకు గౌరవాధ్యక్షులు కె.పాండురంగారావు పూలమాల వేశారు. ఈ సభలో మేడిది జోబాబు, ఎం.వెంకటస్వామి, వై.యోహాను, ఏ.రామశేషు, ఏ. రాంబాబు, బిఎన్‌వి సత్యనారాయణ, పి.అరవింద్ తదితరులు హాజరై ఆయన సేవలను కొనియాడారు. ఆయన సతీమణి జి.దేవకృప శాఖకు అందిస్తున్న సహాయసహకారాలకు కృతజ్ఞతలు తెల్పారు.

జిల్లా కార్యదర్శి ఎం.ఐ.విజయకుమార్ మాట్లాడుతూ అంకితభావం గల శామ్యూల్‌రాజు లాంటి నాయకులు యుటిఎఫ్‌కు ప్రాణంతో సమానమని, వారి సేవలను ఎప్పుడు ఆకివీడు యుటియఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు మరవలేరని అన్నారు.

# ధర్నాలు - నిరసనలు

### విజయనగరం జిల్లా

#### 2008 హామీ పత్రాల అభ్యర్థులకు పిఆర్‌సిలో వేతన వ్యత్యాసాలను సరిచేయాలని యుటియఫ్ డిమాండ్

10వ పిఆర్‌సిలో 2008 హామీ పత్రాల అభ్యర్థులకు వేతన వ్యత్యాసం ఉండటం వలన తీవ్రంగా నష్టపోతున్నారని, నష్టం లేకుండా ఉండాలంటే యుటియఫ్ ప్రభుత్వం దృష్టిలో పెట్టిన నాలుగు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలించాలని, హామీ పత్రాల అభ్యర్థులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరి మాట్లాడుతూ యుటియఫ్‌గా చిత్తశుద్ధితో వారి సమస్యను పరిష్కరించేదానికి యుటియఫ్, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.కృష్ణా రావు, జిల్లా వెంకటరావు, కె.శ్రీనివాస్, జె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పశ్చిమగోదావరి జిల్లా

#### విద్యాశాఖాధికారికి యుటియఫ్ మండల శాఖ ధర్నా నోటీస్

**పాలకొల్లు :** మండలశాఖ జులై 21న మండలంలోని పుస్తకాలు అప్‌డేట్ చేయాలని, పిఆర్‌సి బిల్లులు సకాలంలో పరిష్కరించాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాశాఖాధికారికి ధర్నా నోటీసు ఇచ్చారు. దీనితో స్పందించిన మండల విద్యాశాఖాధికారి 135 పిఆర్‌సి బిల్లులు ట్రెజర్‌కి పంపడం జరిగింది. మిగిలిన బిల్లులు కూడా పంపాలని కోరడం జరిగింది. ఈ విషయమై ఎంఇఓ భీమవరం ఉపవిద్యాశాఖాధికారికి కూడా ప్రాతినిధ్యం చేయడం జరిగింది. జులై 28న మండలశాఖ నాయకత్వం లో చర్చలు జరిపి సమస్యలు సకాలంలో పరిష్కరిస్తానని యిచ్చిన హామీ మేరకు ధర్నా వాయిదా వేయడం జరిగింది. మండల విద్యాశాఖాధికారితో జరిగిన చర్చలలో అసోసియేట్ అధ్యక్షులు వి.జగ్గారావు, కోశాధికారి ఎ.రామకృష్ణ, కార్యదర్శులు వి.నాగేశ్వరరావు, వి.నరసింహామూర్తి, వై.ముసలయ్య, పిఎస్ మార్తాండవర్మ, జిల్లా కార్యదర్శి ఎకెవి రామభద్రం, మండల ఆడిటర్ ఐ.రాజబాబు, ఎల్‌వివి ఎస్ శర్మ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

#### పిఆర్‌సి బిల్లులు వెంటనే చెల్లించండి

పిఆర్‌సి బిల్లుల మంజూరులో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోరుతూ యుటియఫ్ పాలకొల్లు మండలశాఖ నాయకత్వం పాలకొల్లు ఉప ఖజానాధికారిని కలిసి ప్రాతినిధ్యం చేసింది. ఉప ఖజానాధికారి వెంటనే స్పందించి బిల్లులు అన్నిటికి టోకెన్ నంబర్లువేసి, బిల్లులను పంపడం జరిగినది. అవినీతి లేకుండా పిఆర్‌సి ఉపాధ్యాయుల బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యేలా ఉప ఖజనాధికారి, పాలకొల్లు మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పాలకొల్లు వారితో మాట్లాడటం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎకెవి రామభద్రం, పాలకొల్లు(మం) యుటియఫ్ అధ్యక్షులు డివి నరసింహారావు, ప్రధానకార్యదర్శి కె.రాజశేఖర్, ఎ. రామకృష్ణ, కోశాధికారి వి.నాగేశ్వర రావు, పి.శ్రీనివాస, వి.జగ్గారరావు పాల్గొన్నారు.

### చిత్తూరు జిల్లా

#### ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే జరపాలి

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలను కౌన్సిలింగ్ పద్ధతిలోనే జరపాలనీ గతంలోలాగా క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టులలోకి విద్యా వాలంటీర్లను నియమించాలని, విద్యావికాస ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని, ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వ విద్య పరిరక్షణకు పాటుపడాలని శాసనమండలి సభ్యులు యండపల్లి శ్రీనివాసులురెడ్డి కోరారు. తిరుపతి యుటియఫ్ కార్యాలయంలో జులై 28న జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఏళ్ళ తరబడి టీచర్లు, పర్యవేక్షకులు లేక విద్యారంగం కుంటుపడుతోందని, బలహీన, పేద వర్గాల పిల్లలు చదివే పాఠశాలలను ప్రభుత్వమే పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ పిఆర్‌సిలో హామీ పత్రాల, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అర్థవేతన సెలవును నగదుగా మార్చుకొనే అవకాశం కల్పించాలని కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, హామీ పత్రాల ద్వారా ఉపాధ్యాయులుగా వేరే పోస్టుల్లో పనిచేస్తున్న వారిని వారి సబ్జెక్టుల్లో నియమించాలని కోరారు.

ఈ సమావేశంలో సహాధ్యక్షులు టి.ఉత్తన్న, కోశాధికారి ఎం.జనార్ధనరెడ్డి, జిల్లా కార్యదర్శులు ఎస్.రెడ్డెప్ప, డి.నిర్మల, ఎస్ఎస్ నాయుడు, కె.ముత్యాలరెడ్డి, ఎన్.రవిప్రకాష్, రెహమాన్, చిన్నస్వామి, సదాశివరెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాసులు, మున్నెయ్య, బెంగుళూరాయ నాయుడు, జివి రమణ, ప్రకాష్, పట్టాభి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

### కడప జిల్లా

#### ఉపాధ్యాయుడి మీద దాడి చేసిన టిడిపి నాయకునిపై కేసు నమోదు చేయాలి

తెలుగుదేశం పార్టీ అధికారంతో కళ్ళు మూసుకొని దాడులకు దిగడం పరిపాటిగా మారిందనటాన్ని ఒంటిమిట్ట మండలం జిల్లా పరిషత్ రాచపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వెంకటరమణపై అధికారపార్టీ నాయకుడు చేసిన దాడిని యుటియఫ్ తీవ్రంగా ఖండిస్తున్నదని జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మిరాజ, నాయకులు పి.శ్రీనివాసులు రెడ్డి, కె.నరసింహారావు, ఎస్.జిలానిభాషా, ఎస్.శివశంకర్ తెలిపారు. ఒంటిమిట్టలో వారంరోజులుగా త్రాగునీళ్ళు అందడం లేదని చెబుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సమక్షంలో టిడిపి మండల అధ్యక్షుడు దాడి చేయటం దుర్మార్గమన్నారు. అధికార పార్టీ వారిని ప్రశ్నిస్తే ఇలాంటి దాడులకు పూనుకుంటామని ఈ సంఘటన ద్వార ప్రజలకు హెచ్చరిక చేసినట్లుగా ఉందన్నారు. దాడిచేసిన టిడిపి మండల అధ్యక్షుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖవారు వెంటనే కేసు నమోదు చేయాలని లేని పక్షంలో జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు.

### గుంటూరు జిల్లా

#### స్టడీ సర్కిల్

**పిడుగురాళ్ళ :** మండల శాఖ ఆధ్వర్యంలో జులై 28న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టడీ సర్కిల్ నిర్వహించడమైనది. ఈ స్టడీసర్కిల్‌లో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొని ప్రజాస్వామ్యం - రాజకీయాలు కార్పొరేటీకరణ అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా పూర్వ అధ్యక్షులు జి.ప్రభుదాస్, జిల్లా సహాధ్యక్షులు జి.విజయసారధి, స్థానికశాఖ నాయకులు కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అభినందన సభలు

### తూర్పుగోదావరి జిల్లా

### ఎస్ఎస్‌సి ఫలితాల అభినందన సభ

2015 ఎస్ఎస్‌సి పరీక్షలలో 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు యుటియఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. జులై 5వ తేదీన కాకినాడ యుటియఫ్ హోమ్‌నందు జిల్లా అధ్యక్షులు డి.వి.రాఘవులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ ఇటీవల సివిల్స్ పరీక్షలలో విజేతలుగా నిలిచిన వారిలో చాలామంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని, ప్రతిభావంతులను తగిన విధంగా ప్రోత్సహిస్తే ఆ స్ఫూర్తితో వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ప్రతిభను ప్రోత్సహిస్తున్న యుటియఫ్ జిల్లాశాఖను అభినందించారు. యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకొనేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. మారుతున్న పరిస్థితులను విశ్లేషించుకొని పాఠాలు బోధించాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల నుండి 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించిన 38మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2000/-ల వంతున నగదు పురస్కారం అందించారు. ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను యుటియఫ్ శాఖ తరపున సన్మానించి అభినందన కార్యక్రమం నిర్వహించారు.

### ప్రకాశం జిల్లా

### ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో 100% ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జిపిఏ 10/10 వచ్చిన విద్యార్థులను అభినందించారు. జులై 11న అంబేద్కర్ భవన్ ఒంగోలునందు జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత అభినందన సభ జరిగింది. సభకు జిల్లా ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి ఆహ్వానం పలుకగా ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ డి.రామిరెడ్డి, డిఇఓ ఎం.రామలింగం, డివైఇఓ ఒంగోలు ఇ.సాల్మన్, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బోస్, కెజిబివిటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు కె.రత్నమాలినీదేవి, సన్మాన గ్రహీతలు, యుటియఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమాన్ని జిల్లా బాధ్యులు ఎస్.రవి, ఎం.రామ్మెహనరావు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్సీ డి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవల్సిన అవసరం ఉందన్నారు. పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నా వాటి నియంత్రణ కొరవడిందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సంవత్సరం నుండి యుటియఫ్ జిల్లాశాఖ ఈ అభినందన కార్యక్రమం జరపడం అభినందనీయమన్నారు. పాఠశాలల తెరిచేనాటికీ ప్రైవేట్ పాఠశాలలు రిజల్టుతో హోరెత్తిస్తుంటే, మన ప్రభుత్వ పాఠశాలల గురించి మాట్లాడేవారే కరువైనారన్నారు. ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అభినందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యుటియఫ్‌ని అభినందించారు. పాఠశాల విద్య ప్రైవేట్ వ్యక్తుల, సంస్థల చేతుల్లోకి వెళ్ళాయన్నారు. ప్రైమరీ పాఠశాలలో ఎన్‌రోల్మెంట్ తగ్గుతోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రాథమిక విద్య కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రతి పాఠశాలలో ఎన్‌రోల్మెంట్ పెంచడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కూడా నాణ్యమైన విద్యకోసం ప్రతి పంచాయితీకి మోడల్ స్కూల్, 5గురు టీచర్లతో ఏర్పాటుచేసి, అక్కడ కాన్వెంట్‌లు లేకుండా చేయాలన్నారు. డిఇఓ మువ్వారామలింగం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి బాధ్యత ఆ పాఠశాల ఉపాధ్యాయులు, హెచ్ఎంలదే బాధ్యత అన్నారు. గుర్తింపు లేని పాఠశాలల నియంత్రణకూ మూసివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల బలోపేతానికి, కృషి చేస్తున్న యుటియఫ్ కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ ఇ.సాల్మాన్, జిల్లా సహాధ్యక్షులు జె.కేశవ రాజు, ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు.

### కృష్ణా జిల్లా

యుటియఫ్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో 2015 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలలో 90%పైన ఫలితాలు సాధించి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, కార్పొరేషన్, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, ప్రధానోపాధ్యాయులకు అభినందన కార్యక్రమం జులై 19న నిర్వహించబడింది. ఆ పరీక్షలలో 10/10 గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.1000/- నగదులు బహుమతి మరియు ప్రోత్సాహక సర్టిఫికెట్‌ను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి కె.నాగేశ్వరరావు, విజయవాడ కార్పొరేషన్ ఉపవిద్యాశాఖాధికారి కె.దుర్గాప్రసాద్, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి, వెస్ట్ కృష్ణా జెఏసి చైర్మన్ ఏ.విద్యాసాగర్, రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.లీలా, జిల్లా అధ్యక్షులు ఎస్‌పి మనోహర్ కుమార్, ప్రధానకార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు, సహాధ్యక్షులు ఎంఎస్‌సి రాజు, భగీరథి, కోశాధికారి ఎ.కృష్ణసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

### గుంటూరు జిల్లా

2015 మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన 125 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను యుటియఫ్ ఆధ్వర్యంలో స్థానిక పరీక్షా భవన్‌లో జులై 12న అభినందన సభ జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ని ఇబ్బందులు వున్నా మంచి ఫలితాలు సాధించటం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ మార్కులే ప్రాధాన్యత కాకుండా వివిధ అంశాలపై ఆశక్తిని కల్గిస్తూ బోధిస్తున్న ఉపాధ్యాయులందరికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్య ఆర్‌జెడి టి.పార్వతి ప్రసంగిస్తూ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిఇఓ పి.సూర్యప్రకాశరావు, డిప్యూటి డిఇఓలు ఎన్.రఘుకుమార్, కిరణ్‌కుమార్, రమేష్‌బాబు, శేషుబాబు, విజయలక్ష్మి, యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వి.విశ్వనాథం, జి.ప్రభుదాసు, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు, జిల్లా నాయకులు ఏ.నాగేశ్వరరావు, టి.వినోద, జి.విజయసారథి, పి.ప్రేమ్‌కుమార్, ఎన్.కుమార్‌రాజా, కె.శ్రీనివాసరెడ్డి, మోహనరావు, కలాధర్, ఐ.డేవిడ్‌రాజు, సిహెచ్.పద్మావతి, శివపూర్ణయ్య, పి.వి.కోటేశ్వరరావు, జగదీష్, శాంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు

### పిఆర్‌సి వేతన స్థిరీకరణ హెచ్‌ఆర్‌ఎంఎస్ ద్వారా జులై 20లోగా పూర్తి చేయవలసిందిగా సవరణ ఉత్తర్వు

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**ABSTRACT**

Revision of Pay Scales 2015 – Fixation of pay of employees in the Revised Pay Scales, 2015 – Updated Instruction for fixation of Pay in RPS 2015 and arrear claims – Orders Issued.

**FINANCE (HRM.V-PC) DEPARTMENT**

**G.O.MS.No. 85** **Dated: 8th July, 2015**

**Read the Following:**

1. G.O.Ms.No.46, Fin.(HRM.V-PC) Deptt., dt. 30.04.2015.
2. G.O.Ms.No.47, Fin.(HRM.V-PC) Deptt., dt.30.04.2015
3. G.O.Ms.No.48, Fin.(HRM.V-PC) Deptt., dt. 30.04.2015.
4. G.O.Ms.No.49, Fin.(HRM.V-PC) Deptt., dt.30. 04.2015.
5. Circular Memo. No.3856-A/29/A2/HRM.V-PC/2014, Dated: 26.5.2015.
6. G.O.Ms.No.67, Fin.(HRM.V-PC) Deptt., dt. 12.06.2015.
7. G.O.Ms.No.68, Fin.(HRM.V-PC) Deptt., dt. 12.06.2015.
8. Circular Memo. No.5375-J-A/29/TA – A&L/2015, Dated: 18.06.2015.

* * *

In the references read above, orders were issued for fixation of pay in the Revised Pay Scales - 2015. After a careful review of the progress in this matter, the Government has decided to make available an updated mechanism for fixation of Pay in the Revised Scales of Pay 2015 and process the arrear claims expeditiously and accordingly instruct that the Drawing and Disbursing Officers (DDOs) shall undertake fixation of Pay of the employees and process the arrear claims through the Human Resources Management System (HRMS) of the Directorate of Treasuries and Accounts in respect of those employees whose data cannot be uploaded in e-Nidhi Portal on or before July 09, 2015.

However, the existing facility of e-Nidhi will continue to be available for further processing of PRC claims in respect of those employees whose data is available in e-Nidhi as on 08.07.2015. Accordingly, those who have already provided data in e-Nidhi will be paid in the revised pay scales through e-Nidhi and therefore the same need not be processed through HRMS.

2. The Drawing and Disbursing Officers shall register their details in e-Nidhi on or before July 20, 2015 and simultaneously log in to the HRMS package of the DTA Portal using their regular login Id and fill the data relating to all events that have relation to the drawl of arrears, in the data entry screens specially designed for the purpose in the package.
3. After completing the data entry, the DDOs should press the Final Submission Button provided therein and generate the bill in three parts – Part –I for the period from July 01, 2013 to June 01, 2014 for which the fixation is notional; Part – II for the period from June 02, 2014, to March 31, 2015 for which orders will be issued separately; and Part – III for the period from April 01, 2015 onwards payment shall be made in cash, duly making necessary deductions towards Professional Tax and the contribution towards Contributory Pension Scheme, wherever applicable as per the revised rates. The DDOs then manually prepare the sanction proceedings/ orders duly obtaining the approval of the competent authority and attach copies of the same to the arrear pay bill generated through HRMS.
4. The Arrear Pay Bill along with the service register of the employee with upto date entries shall be sent to the Treasury/ PAO. The Treasury / PAO shall conduct audit of the bills duly following the normal procedure in passing the bills and with reference to the entries in the service register.
5. However, the instructions above are not applicable to the employees whose salary bills are presented to the Assistant Pay and Accounts Officer (W&P) / Pay and Accounts Officer (W&P), under the control of the Director of Works Accounts, AP. In respect of these employees, the DDOs shall process the cases manually and present the bills following the normal procedure.
6. The arrears amount admitted in audit shall be transferred directly to the bank account of the employee concerned through ECS / e-Payments mode.
7. All the Heads of Departments are requested to issue necessary instructions to the Departmental Officers under their control to follow the above instructions scrupulously and co-operate with the Audit Authorities.
8. This memo is available on Internet and can be accessed at the address http://www.aponline.gov.inand http://www.apfinance.gov.in.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**MUDDADA RAVI CHANDRA**
SECRETARY TO GOVERNMENT (EXPENDITURE)

***

### 60 సం॥లు వయోపరిమితి వర్తింపు అయిన ఎయిడెడ్ సిబ్బంది గ్యాప్ పీరియడ్‌కు అర్హతగల సెలవు మంజూరు ఉత్తర్వు

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**ABSTRACT**

School Education – Enactment of Act No.1 of 2015- Amendment to the Section 78-A of A.P. Education Act,- Raising of age of superannuation of teaching and non-teaching staff working in aided Private Educational Institutions from 58 to 60 years - Settlement of interregnum period-Orders -Issued.

**SCHOOL EDUCATION (PS) DEPARTMENT**

**G.O.MS.No. 31** **Dated: 10.07.2015**

**Read :-**

Act No.1 of 2015, dated 3.1.2015.

***

**ORDER:**

The Section-78 A of A.P.Education Act,1982 has been amended through the reference read above. Accordingly, the age for superannuation of teaching and non-teaching staff working in aided private Educational institutions has been raised from 58 years to 60 years. The Act 1 of 2015 comes into force from the date of publication in the Gazette i.e from 3rd January 2015. As per proviso incorporated through above amendment, the interregnum period i.e from the 2nd June

2014 to the date of publication of the A.P. Education (Amendment) Act, 2014, should be treated in such manner, as may be prescribed.

2. Accordingly, after careful examination of the entire matter, Government have decided and hereby order to treat the interregnum period i.e from 02.06.2014 to 02.01.2015 as leave to which employee is eligible, and in case no leave is due, the period be treated as Extra-Ordinary Leave.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**R.P.SISODIA**

SECRETARY TO GOVERNMENT

***

## ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగుల సర్వీస్ రెన్యువల్ ఉత్తర్వు

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**ABSTRACT**

Human Resources - Contracted and outsourced Services in Government Departments – Permission to renew the contract / outsourced services from July 01 to September 30, 2015 – Orders - Issued.

**FINANCE (HR.I) DEPARTMENT**

**G.O.Ms.No.90** **19 July 2015**

**Read the following**

1. G.O.Rt.No.4271, Fin.(SMPC) Dept., Dated: 01.01.2008.
2. Cir. Memo No.9522-A/417/A1/SMPC.II/13 Dt. 13.9.2013.
3. G.O.Ms.No.84 Finance (SMPC.II) Dept., Dated: 17-04-2014.
4. G.O.Ms.No.248 G.A. (SR) Dept. Dt.1-06-2014.
5. G.O.Ms.No.250 G.A.(SR) Dept., Dt.1-06-2014.
6. G.O.Ms.No.146 Finance (HR.I) Dept. Dated: 27-06-2014.
7. G.O.Ms.No.1 Finance (HR.I) Dept. Dated: 05.01.2015.
8. G.O.Ms.No.44 Finance (HR.I) Dept. Dated: 16.04.2015.

**ORDER:**

1. With a view to supplement the core human resources of the government and to meet the short-term requirements, the Government has periodically permitted the departments to obtain services essential for the day-to-day management of the governance on contract/ outsourcing basis for a limited duration with the prior approval of Finance Department.
2. In the references seventh to ninth read above, the Government ordered for the continuation of contractual and outsourced services that were subsisting on June 02, 2015, initially up to December 31, 2014 and subsequently up to June 30, 2015.
3. After a review of the prevailing manpower requirements, especially in the light of the fact that final allocation of state cadre employees has not been completed by the Competent Authority, the Government has decided to permit all government departments to extend the contractual / outsourced services subsisting on June 30, 2015, for another three months, i.e., from July 01 to September 30, 2015.
4. Accordingly, the Government hereby permits all departments to renew the contractual and outsourced services subsisting on June 30, 2015, until September 30, 2015 or an earlier period, as deemed appropriate, based on the imperative need for such services by the department. The terms and conditions of the contract shall remain unchanged for both contractual and outsourced services.
5. These orders are strictly limited to those services, including those personnel that were taken up by the departments with the prior concurrence of the Finance Department. The Heads of Departments – Secretariat and the Departmental Heads – and the District Collectors are hereby authorized to extend the contractual / outsourced services that were subsisting on June 30, 2015, until September 30, 2015, at the State and the District respectively, provided competent authority has undertaken a review of the need for such services and has enough empirical rationale for extending the services by another three months. The conditions stipulated in the references seventh to ninth read above shall continue to dictate the services during the extended period of contractual services.
6. All Secretaries, Head of departments and District Collectors are hereby informed that no services shall be contracted or outsourced without the prior concurrence of the Finance Department and the approval of the Government. Further, they are required to furnish the details of all personnel providing contractual and outsourced services to the Finance Department latest by August 10, 2015, in order to enable the Government to take a comprehensive view of its manpower requirements.
7. All Secretariat Head of Departments – Secretaries to Government - are required to monitor this issue carefully and ensure that the information is provided to the Finance Department latest by August 10, 2015.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**DR PV RAMESH**

PRINCIPAL FINANCE SECRETARY TO GOVERNMENT

***

## 2015-16 ఆర్థిక సం॥లో ప్రభుత్వ ఉద్యోగులకు అప్పులు, అడ్వాన్సు మంజూరు ఉత్తర్వు

**GOVERNMENT OF ANDHRA PRADESH**

**ABSTRACT**

**LOANS AND ADVANCES –** Re-allocation of funds under Loans and Advances to the Government Servants working in Education (SE) Department, HOD's and Regional /Dist Offices towards **Motor Cycle and Mopeds, Cycle and other Conveyances, Personal Computer, Marriage Advance and Education Advance**, for **1st quarter** for the financial year 2015 – 2016 – Orders – Issued.

**SCHOOL EDUCAITON (OP) DEPARTMENT**

**G.O.RT.No. 145** **Dated : 13/07/2015**

**Read the following:-**

1. GO Rt No 1750 Fin.(A&L) Deptt., dated 27/5/2015.
2. GO Rt No 1751 Fin.(A&L) Deptt.,dated 27/5/2015.
3. GO Rt No 1752 Fin.(A&L) Deptt.,dated 27/5/2015.
4. GO Rt No 1753 Fin.(A&L) Deptt., dated 27/5/2015.
5. GO Rt No 1755 Fin.(A&L) Deptt., dated 27/5/2015.
6. GO Rt No 1757 Fin.(A&L) Deptt., dated 27/5/2015.

***

**ORDER:-**

In the G.O's 1st to 6th read above, the Finance (A&L) Department have allotted funds towards **Motor Cycle and Mopeds, Cycle and other Conveyances, Personal Computer, Marriage Advance and Education Advance**, for **1st quarter** for the financial year 2015 – 2016 and the same are detailed below:-

| SNO | Category of Loan | Head of Account | Department | District / Regional Offices | Total |
|---|---|---|---|---|---|
| 1 | Computer Advances | 7610 – Loans to Government Servants M.H. 204 - Advances for Purchase of Personal Computer SH (12) – Advances for Purchase of Personal Computer 001- Advances for Purchase of Personal Computer | 50,000 | -- | 50,000 |
| 2 | Educational Purposes | 7610 – Loans to Government Servants etc 800- Other Advances SH (10) – Advances for Non Gazetted for Education of their children and other miscellaneous purposes 001- Advances of N.G.O.s for Education of their children and other miscellaneous purposes | 50,000 | 50,000 | 1,00,000 |
| 3 | Marriage Advance | 7610 – Loans to Government Servants etc. 800- Other Advances SH (05) – Marriage Advances 001- Marriage Advances. | 1,50,000 | -- | 1,50,000 |
| 4 | Cycle & Other Conveyances | 7610 – Loans to Government Servants etc., 203- Advances for Purchase of other Conveyances SH (04) – Advances for Purchase of Cycle and other Conveyances 001- Advances for Purchase of Cycle and other Conveyances | 6,000 | 3,000 | 9,000 |
| 5 | Motor Cycle & Mopeds | 7610 – Loans to Government Servants etc. 202- Advances for Purchase of Motor Cycle conveyances SH (05) – Loans for Purchase of Motor Cycles 001- Loans for Purchase of Motor Cycles | 1,50,000 | -- | 1,50,000 |
| 6 | Motor Car | 7610 – Loans to Government Servants 202- Advances for purchase of Motor conveyances SH (04) – Loans for purchase of Motor car 001- Loans for purchase of Motor cars | -- | -- | -- |

2. Keeping in view of the strength of the Unit of HOD's under the Administrative control of School Education Department and availability of funds for **1st Quartyer for the financial year 2015 -16**, the Government hereby re allocate the above said funds among the HOD's and School Education Dept., Secretariat and also to the Regional / District Offices as specified in the **Annexure** appended to this order.
3. The following principals shall be kept in view while sanctioning loans to Government Servants by the Departments:
   - i) The Budget released shall be utilized by following strictly all quarterly regulations.
   - ii) The Heads of Departments should not utilize the amount allotted to the employees of Regional and District Offices for sanctioning the Advance to their respective employees.
   - iii) Instructions issued regarding allotment in respect of Class IV employees should be kept in view;
   - iv) The sanctioning authority shall ensure that prompt follow up action is also taken up after sanctioning the advance in getting the formalities completed by the loanees.
   - v) It shall also be ensured that the cases for sanction of advances for house construction / repairs / ready built house shall be considered only after meeting the requirement of committed cases in full.
   - vi) No H.B.A for House Construction / Ready Built house purpose should be sanctioned to those Government employees who were allotted houses by the H.U.D.A / A.P. Housing Board, Cooperative Societies etc;
   - vii) Special care should be taken to scrutinize the case for sanction of Marriage Advance to the employees to ensure that they do not draw advance by producing false particulars of daughters and sons.
   - viii) The sanctioning authority shall ensure that prompt action is taken against the defaulters who misuse the amount and against those who fail to complete the formalities in time, according to the rules.

**5.** This order does not require the concurrence of Finance (A&L) Department as per the orders and rule in force on the subject.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**R.P. SISODIA**
SECRETARY TO GOVERNMENET (SE)

***

## ప్రభుత్వ ఉద్యోగులకు అప్పులు, అడ్వాన్సు మంజూరు ఉత్తర్వుకు సవరణ ఉత్తర్వు

## GOVERNMENT OF ANDHRA PRADESH
## ABSTRACT

**LOANS AND ADVANCES –** Re-allocation of funds under Loans and Advances to the Government Servants working in Education (SE) Department, HOD's and Regional / Dist Offices towards **Motor Cycle and Mopeds, Cycle and other Conveyances, Personal Computer, Marriage Advance and Education Advance**, for **1st quarter** for the financial year 2015 – 2016 – Corrigendum to GO Rt No 145 SE (OP) Department dated 13/7/2015 **-** Orders – Issued.

**SCHOOL EDUCAITON (OP) DEPARTMENT**

**G.O. Rt. No.146** **Dated : 21.07.2015**

**Read the following:-**

1. G.O. Rt No 145 School Education (SE-OP) Department dated 13/7/2015.

***

**ORDER:-**

In the GO read above, orders were issued for re-allocation of funds under Loans and Advance to the Government Servants working in Education (SE) Department, HODs and Regional / District Officers towards Motor Cycle and Mopeds, Cycle and other Conveyances, Personal Computer, Marriage Advance and Education Advance, for 1st quarter for the financial year 2015 – 2016.

In the Annexure to the GO, in Column (4) viz. "Secretariat", against S.No. (5) "Motor Cycle / Mopeds" an amount of Rs. 50,000/- has been shown, inadvertently. Therefore, the following corrigendum is issued.

**CORRIGENDUM**

The amount in Col.(4) viz. "Secretariat" against S.No. (5) "Motor Cycles / Mopeds" shall be read as **"NIL" instead of Rs. 50000/-.**

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**R.P. SISODIA**
SECRETARY TO GOVERNMENT

***

## పిఆర్‌సి బిల్లులు నెలంతా అంగీకరించవలసిందిగా ఉత్తర్వు

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**FINANCE (TFR) DEPARTMENT**

